
చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



పంతం

కాలింగ్ బెల్
గాయత్రీ మంత్రం చదువుతుంది
లేదా, వీధి తలుపు
ఆంజనేయ దండకం అందుకుంటుంది
నీ సకల చరాచర స్వప్నాలనూ, కోరికలనూ
విడిచిపెట్టి–
విష్ణుమూర్తిలా వెళ్లి
గబుక్కున తలుపులు తెరుస్తావ్,
అంతవరకే నీకు తెలుస్తుంది,
తర్వాతదంతా ప్రపంచం చెప్పుకుంటుంది
– వచ్చింది మృత్యువని.

ప్రియురాలా, మనకేం తెలుసు –
ఏమో, మరో క్షణంలో
మన తలుపు ఎవరు కొడతారో?
నీకసలే కంగారెక్కువ –
గబుక్కున వెళ్లి తెరిచేయకు సుమీ.

నడి మధ్యలో కలిసినా,
మనకు దొరికినది నడమంత్రపు సిరి కాదు.
అయినా, క్షణాల్లో ఎంతదూరం వచ్చేశామో.
తలచుకుంటే ధైర్యంతో గుండెలుప్పొంగవూ?

సముద్ర పక్షులన్నీ నదుల్లో ఈతకెళ్లినట్టు
మనమింకా దేనికోసమని దేవులాడటం?
ఇంటి మీంచి విమానం వెళ్తున్న చప్పుడేదో
చివరిసారిగా వింటాం,
నువ్వో నేనో– మాత్రం చెప్పలేం!

వారసులెవరో శిథిలాలన్నీ జమ చేస్తారని ధీమా
కావచ్చు, లేక చెల్లాచెదురుగా విసిరేయొచ్చు
చెరిపేయొచ్చు, యాంటీవైరస్ వాడి.
మనకు తెలియనప్పుడు దుఃఖమేల?

చల్లారిన గుసగుసలతో..
చప్పబడిన గుండెలతో
బలంగా కౌగిలించుకునే వుందాం –
మార్కండేయుడిలా.
చివరి నిర్ణయంలోనూ
ఓ చిరు సవాల్ విసురుదాం
ఎప్పటి, నీ పంతంలాగే



దేశరాజు

తెలంగాణలో బాల సాహిత్యం విరివిగా వస్తున్నది. స్వరాష్ట్రం సిద్ధించాక తెలంగాణ చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలపై చిన్నపిల్లలకు అవగాహన కలిగించాలనే ఉద్యేశంతో విద్యాశాఖ కొత్త పాఠ్యాంశాలకు రూపకల్పన చేయడమే ఇందుకు కారణం. 6 నుంచి 10వ తరగతి వరకు గల తెలుగు పాఠ్య పుస్తకాల్లో పాఠం చివర సృజనాత్మకత, ప్రశంస ఉండేలా పాఠ్య పుస్తక రచయితలు ఏర్పాటుచేశారు. ఇందులో కథ, కవిత, సంభాషణ, లేఖారచనా, కరపత్రం, ఇంటర్వ్యూ, పుస్తక సమీక్ష వంటి సాహితీ ప్రక్రియలపై ప్రశ్నలుంటాయి. పరీక్షల్లోనూ వాటికి మార్కులుంటాయి. కాబట్టి విద్యార్థులు తప్పకుండా వీటిని చదవడం, రాయడం చేస్తున్నారు.

> “ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయించే కార్యక్రమంలో భాగంగానే, తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక రచనల్లో తర్ఫీదునిస్తున్నారు. ఇది పిల్లల ఆలోచనలకు రెక్కలు తొడిగి, సృజనకారులుగా తయారవడానికి ఎంతో దోహదం చేస్తున్నది. నిబద్ధత, రచనారంగంలో కొంత ప్రవేశం ఉన్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహిస్తూ, వారినుంచి మరిన్ని రచనలు రావడానికి కృషిచేస్తున్నారు.



ప్రపంచతంత్ర కథలు రావాలి

ఖమ్మం జిల్లా అశ్వరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కన్నెగంటి వెంకటయ్య తన సంపాదకత్వంలో 'చిగురాకుల సవ్వడి' పేరుతో పిల్లలు రాసిన వచన కవితలను 2003లో సంకలనంగా తీసుకువచ్చారు. ముస్తాబాద్ పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తున్న గరిపల్లి అశోక్ 2014లో తను సంపాదకుడిగా, పిల్లలతో 'జాంపండ్లు' కథా సంకలనాన్ని తీసుకువచ్చారు. రాష్ట్రంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థుల రచనలతో సంకలనాలు వెలువడ్డాయి. ఇటీవలే వచ్చిన షాద్‌నగర్ పిల్లలు రాసిన 'రంగుల ప్రపంచం' కథా సంకలనం వరకూ 142 పుస్తకాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలోని సుమారు 4 వేల మంది బాలబాలికలు కల్పనాత్మక రచనలు చేస్తున్నారని ఒక అంచనా.

సంకలనాల సంగతి అలా ఉంచితే, తెలుగులో వెలువడే దిన, వారపత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, మాస పత్రికల్లో కలిపి వారానికి సుమారు నలభై పిల్లల కథలు వస్తున్నాయని విజ్ఞుల అభిప్రాయం. బాల సాహిత్యం రాసే రచయితలతో పాటు, పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థిని, విద్యార్థులు కూడా పత్రికలకు రాయడం ప్రారంభించారు. ఇది ఆహ్వానించదగిన పరిణామం. నెలకు సుమారు 150కి పైగా పిల్లల కథలు పలు పత్రికల్లో వెలుగుచూస్తున్నాయి. రాశిలో ఇంత ఎక్కువగా వస్తున్నా, కథల్లో వాసి తగ్గిపోతున్నదని, మనసుదాకా చేరడం లేదని సీనియర్ రచయితల అభిప్రాయం. ఇందులో వాస్తవం లేకపోలేదు. బాలసాహిత్య రచయితలకు సరైన మార్గదర్శకత్వం కొరవడటం వల్లనే ఇలా జరుగుతుందన్నది నిష్ఠుర సత్యం.

> “ **రచయితలు సాధారణంగా కథల్లో చేస్తున్న పొరపాట్ల గురించి చూద్దాం. ఇటీవల ఒక కథ పత్రికలో వచ్చింది. ఈ కథ అవగాహన లోపంతో రాసింది. 'కొంతమంది వేటగాళ్లు అడవికి వచ్చి, ఏనుగును బంధించాలని, అది వచ్చేదారిలో ఉచ్చులు ఏర్పాటు చేశారు' అని రచయిత రాశారు.**

సాధారణంగా ఏనుగును పట్టుకోవడానికి పెద్ద గోయి తవ్వి, దాని మీద సన్నటి పుల్లలు పేర్చి, వాటిమీద చాప లేదా వస్త్రం వంటిది కప్పి, పైన కనిపించకుండా మట్టి చల్లి ఆకులు కప్పుతారు. అనుమానం రాకుండా ఈ ఏర్పాటు చేసి, ఏనుగు గోతిలో పడేలా చేస్తారు. తర్వాత తాళ్లతో బంధించి దంతాలు కోసుకుంటారు. ఎంత పెద్ద ఉచ్చులు వేసినా, ఏనుగు బలం ముందు అవి బలాదూరే. ఉచ్చులు పిట్టలకు వేస్తారు. మరో రచయిత రాసిన కథ చదివి ఆశ్చర్యపోయా. ఆ కథలో గాడిదకు చక్కగా పాటలు పాడాలని ఉంటుంది. అది ఏ జంతువును అడిగినా నేర్పవు. అయినా తను అదేపనిగా పాటలు పాడుతుంది. దాని గాత్రానికి అడవిలోని జంతువులన్నీ గాడిదను అసహ్యించుకుంటాయి. అది చిన్నబుచ్చుకుంటుంది. అప్పుడు కోకిల వచ్చి గాడిదకు, పాడటం నేర్పిస్తుంది. అది చక్కగా పాడుతుంటుంది. ఇదీ కథ. కొన్ని జంతువులకు, పక్షులకు సహజసిద్ధంగా పుట్టుకతోనే కొన్ని లక్షణాలు వస్తాయి. లేడి వేగంగా పరిగెత్తడం, గద్ద దీర్ఘదృష్టి కలిగి ఉండటం మొదలైనవి. ఎంత కోకిల శిక్షణ ఇచ్చినా గాడిద కంఠస్వరంలో మార్పు వస్తుందా? రచయిత వస్తువును తీసుకునేటప్పుడే జాగ్రత్తగా ఆలోచించాలి. మనం రాసే కథ చదువరులకు నమ్మకం కలిగించేలా ఉండాలి. ఎక్కువ కథ లు రాయాలనే తొందరలో రచయితలు ఇలాంటి పొరపాట్లు చేస్తుంటారు.



పుప్పాల కృష్ణమూర్తి

ఇంక రాజుల కథలు రాసేటప్పుడు రమేశ్, నరేశ్, పరిమళ, ప్రహేళిక అనే ఆధునిక పేర్లను వాడుతున్నారు. రాజుల కాలంలో ఇంత నాగరికమైన పేర్లు లేవు. నాగమ్మ, కాటమయ్య, బొందయ్య మొదలైన ప్రాచీన పేర్లను ఉపయోగిస్తేనే, కథ వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. ఇలాంటి చాలా విషయాల పట్ల బాల రచయితలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. బాలల కథలు రాస్తున్న రచయితలు కూడా పై విషయాలను గమనంలో ఉంచుకోవాలి.

ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం పొందిన పి.చంద్రశేఖర్ ఆజాద్‌ను ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు గొప్ప మాట చెప్పారు.

'మన తెలుగు బాల రచయితలు ఇంకా క్రీ.పూ.3 నుంచి 5వ శతాబ్దం మధ్యలో రాయబడిన పంచతంత్ర కథల దగ్గరే ఉన్నారు. ప్రపంచం ఎంత మారింది. పిల్లలు ఎన్నో అద్భుతాలు చేస్తున్నారు. ఈ కార్పొరేట్ చదువుల్లో ఎంత సంఘర్షణ అనుభవిస్తున్నారు. రాయడానికి ఎంతో విశాలమైన ప్రపం చం ఉన్నది. రచయితలు కొత్త దారులు తొక్కాలి. పుస్తకాలకు దూరమై, టీవీ, సెల్ ఫోన్లకు బానిసలవుతున్న బాలలను మన వైపు మలుచుకునే మంచి రచనలు రావాలి'

అని సూచించారు. బాలసాహిత్య రచయితలు ఆ దిశగా కలాన్ని కదిలిస్తారని ఆశిద్దాం.



చరకుడు

పోలికలు స్థిరపడని రూపాలకు
ఆనవాళ్లిచ్చిన రూపకర్త.
పుటకనిచ్చిన బ్రహ్మ ఊహకూ
జన్మనిచ్చిన అమ్మలకూ మధ్య
సాకార సారూప్య వారథి.
స్వస్థతకు కేశ నిర్వహణే
మూల వైద్యమన్న చరకుడు
దుర్గమ కేశారణ్యంలో చిక్కువడిన
కర్మేంద్రియాల విధిని
సుగమం చేసిన రోగహారి.
ఆజానుబాహులకూ అరవింద నేత్రులకూ
మూర్తిమత్వ పూర్ణతనిచ్చిన కూర్పరి.

రథోత్సవాలకూ వాహన సేవలకూ
దివిటీలై కాలి
నాదస్వరాల రాగ వాహినిలో
ఊపిరులై ప్రవహించి
తగిలితేనే స్నానం చేసే ధర్మాల
మనోధర్మంలో మసిబారిన
మనిషితనం మంగలి.
పుట్టు వెంట్రుకల నుంచి సావుదినం దాకా
అవసరమై నిలబడి కత్తిలా కలబడి
ఒసుగు బిచ్చం కోరే
గడప అవతలి పంచె మంగలి.

తెర మీది శిరోజాల సొరును
శిరసున ముద్రించే లాఘవం
వాడలకొద్దీ హీరోలకు జన్మనిచ్చి
జీరోగా మిగిలే జీవి.
వెర్రెత్తిన కుర్రకారు హుషారు 'కీ'.
ఖండనాల ముండనాల దండనాయకుడు.
తెగేసి చెక్కగల శిల్పి
తెరువు తెలిసిన తెగువరి.

వంచిన తలలకు తలెత్తుకునే యోగాన్నిచ్చి
మాసిన జుట్టును మల్లె తోటగా విప్పార్చి
పగిలిన అద్దాల మీద
ముక్కలవుతున్న మురికి రవిబింబం.

సెలూన్ల సెగ ధగల్లో
బెలూన్లలా పేలి రాలిపోతూ
కార్పొ 'రేటు' కత్తెర దారిలో
దారు పట్టక తుప్పు పట్టిన
అతార మంగలి.

గొరుగుతున్నప్పుడు కులాన్ని అడగని
సమతా సౌందర్య దాత
కత్తి లాగే బతుకూ అరుగుతున్నప్పుడు
'కల్ప'నీ కాలాన్నీ ప్రశ్నించని
వృత్తి వృత్తంలో జీవిత ఖైదీ
ఊడ్చేసిన వెంట్రుకల కుప్పలో
మూలుగుతున్న కులకక్షి వేరు.
బుసకొట్టే నాగరికతల కాటుకి
కమిలిపోతున్న బతుకు కాటుక.
అంగడిలో అగ్వకౌలు ప్రాణి
వేణీ సంహార సమరంలో
వేళ్లు తెగుతున్న యోధుడు

(మంగలి రాములు స్మృతిలో..)



వర్ఖుల శివకుమార్
94418 83210

కథలకు ఆహ్వానం

2024–దీపావళి పండుగను పురస్కరించుకొని 'డాక్టర్ అమృతలత–పాలపిట్ట' సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీని నిర్వహిస్తున్నాం. ఇతివృత్తం రచయితల అభీష్టం. సామాజిక కల్లోలాలే కాదు, మానవ అంతరంగాల్లోని ఘర్షణలనూ ఇతివృత్తాలుగా ఎంపిక చేసుకోవచ్చు. మొదటి బహుమతి–రూ.10 వేలు, రెండో బహుమతి: రూ.6 వేలు, మూడో బహుమతి: రూ.4 వేలు, మరో పది కథలను ప్రత్యేక బహుమతులుగా ఎంపికచేసి ఒక్కో కథకు రూ.1000 బహుమతిగా ఇవ్వనున్నాం. కథల ఎంపిక లో 'పాలపిట్ట' సంపాదకవర్గానిదే తుది నిర్ణ యం. ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. పోటీలో ఎంపికయ్యే కథలు 'పాలపిట్ట'లో ప్రచురితమవుతాయి. కథలు పంపడానికి చివరి తేదీ 2024, సెప్టెంబర్ 25, ఫలితాలు ప్రకటించే తేదీ 2024, అక్టోబర్ 15. కథలు పంపవలసిన చిరునామా ఎడిట ర్ పాలపిట్ట, ప్లాట్ నెం–3, బ్లాక్–6, ఏపీహెచ్‌బీ, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–044. ఫోన్:94900 99327, palapitta books @gmail.com

– గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట

కరీంనగర్ కవితావరణం

నాడు, నేడు కవులది ఒకే చూపు, ఒకే దారి. సూర్యోదయపు తొలి కిరణాలను అందిపుచ్చుకొని పొద్దు పొడుపుల వెంట చైతన్యం వైపు పరుగులు తీయడం. ఇందుకు కరీంనగర్ కవులు మినహాయింపేమీ కాదు. తడి ఆరని ఆంధ్ర మహాసభ జ్ఞాపకాలు, సాయుధ రైతాంగ పోరాటపు గాయాల సలపరింపు, భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు సంఘటనలు, సిరిసిల్ల జగిత్యాల కల్లోల కలవరింపు, తెలంగాణ రాష్ట్ర తొలి, మలి ఉద్యమాల ఉడుకు రక్తం.. ఇక్కడి కవులు, కళాకారులను అనుక్షణం కలవరపెడుతూనే ఉన్నాయి. పోరాటాలు, ఉద్యమాల నుంచి పుట్టుకొచ్చిన కవులే కాదు, సాంఘిక, సామాజిక, ఆర్థిక అసమానతల నుంచి పుట్టుకొచ్చిన కవులు కూడా ఉన్నారు.

శతాబ్దాల కాలం నాటి వేములవాడ భీమకవి నాటిన లలితకళల విత్తనాలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కవులు పుట్టిన నేల ఇది. కాలం వెంట కదులుతున్న కవులు, తెలుగు భాషకు నడకనేర్పిన రచయితలు, పాటకు ప్రాణం పోసిన గాయకులు.. ఈ నేల నేలంతా పచ్చటి మాగాణంతో పరిమళాలు వెదజల్లుతున్నది. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ వచ్చిన కవితా సంపుటాలు, కథా సంకలనాలు, నవలా సాహిత్యం 'విశ్వంభర'ను తాకాయి. ఎందరో సాహిత్యకారులను చైతన్యవంతులను చేసి, వాళ్ల దృష్టిని పేద ప్రజల జీవితాల్లోని బాధల వైపు, సమస్యల వైపు, పోరాటాల వైపు మళ్లించింది. తాజాగా వెలువడిన 'కరీంనగర్ కవులు నాడు నేడు' వంద రెండు కవితల సంకలనం ఇందుకు నిలువుటద్దం.



మాతృభూమి మీది మమకారంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి చెందిన పూర్వ ఉప కులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య ముందుకువచ్చి నూటా ఇద్దరు కవుల కవితలతో ఆనాటి, ఈనాటి పద్యాలు, కవితలను మన ముందుకుతెచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ కవులందరూ ఆర్థిక స్వేచ్ఛ, సాంఘిక స్వేచ్ఛ, భావ స్వేచ్ఛ ముఖ్యంగా ఇవన్నీ కలగలసిన స్వేచ్ఛతో తమ భావాలను పటిష్ఠంగా మనస్సుకు హత్తుకునేట్లు వ్యక్తం చేశారు. 10వ శతాబ్ది నాటి జినవల్లభుడు, వేములవాడ భీమకవి, చరిగొండ ధర్మన్న, మల్లియ రేచన, ఎలిగందుల నారయ, మడికి సింగన, మామిడిపల్లి సాంబశివ శర్మ, సినారె, వానమామలై, బాపురెడ్డి తదితరులు నాటి కవులు, నేటి కవులు జూకంటి, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, వారాల ఆనంద్, రాజేందర్ జింబో, వెల్దండి శ్రీధర్, గాజోజు నాగభూషణం తదితరులు 102 మంది కవితల సంకలనం ఇది.

తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా కల్పించిన తొలి కందపద్యాలు రాసిన కవి జిన వల్లభుడు. జిన భవనాలు కట్టించడం, జిన సాధువుల పూజలు చేయడం, జినమునులకు నచ్చిన భోజనాలు పెట్టడంలో ఇతర జైనులెవ్వరినీ జిన వల్లభునితో సరిపోల్చలేం. సూర్యుడితో సమానంగా వెలుగు వారు, జిన వల్లభునితో సరితూగు మరే కవులు లేరు. ఒక్కొక్కరు ఒక్కొక్క సుగుణంతో ఉంటారు. ఆలోచించి చూస్తే జిన వల్లభుడే గుణమణి. పైగా ఆయన 'గుణపక్ష పాతి' అనే అర్థంతో మొదలైన కంద పద్యం ఈ సంకలనానికి తొలి పద్య కవిత జిల్లాలోని గంగాధర మండలం కురిక్యాల గ్రామంలోని వృషభ గిరి అనే బొమ్మలమ్మ గుట్టపై చెక్కబడి ఉంది. అలాగే 11వ శతాబ్దికి చెందిన కవి వేములవాడ భీమకవికి చెందిన చాటువులు ప్రజాదరణ పొందినవి. నన్నయ్య తర్వాత, తిక్కన్న కంటే ముందు జీవించి సమాజంలోని అసమానతలపై చాటువు శైలిలో పద్యాలు రాశాడు. ఈ మహాకవి స్మారకార్థం 1935లో సిరిసిల్లలో నిర్వహించిన ఆంధ్ర మహాసభ వేదికకు 'భీమకవి నగర్'గా పేరు పెట్టడం విశేషం. మరో కవి మల్లియ రేచన తెలుగులో మొదటి ఛందో గ్రంథం రాసినవాడు. వేములవాడకు చెందిన రేచన ఎంతో మంది కవులకు ఆశ్రయమిచ్చాడు, పోషించాడు. కంద పద్యాలతో కూడుకున్న 'కవిజనాశ్రయము' అనే విలక్షణమైన గ్రంథాన్ని రాశాడు. 15వ శతాబ్దానికి చెందిన మడికి సింగన రచించిన 'సకల నీతి సమ్మతము' గ్రంథంలోని పద్యాలన్నీ రాజ్యాంగంలోని అన్నివర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకుసాగడానికి నీతి మార్గాలను బోధించాడు. ఆ తర్వాత 20వ శతాబ్దం తొలితరం కవులలో మామిడిపల్లి సాంబశివ శర్మ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, వానమామలై, బాపురెడ్డి తదితరులు మారుతున్న సమాజానికి అనుగుణంగా పద్య, వచన కవితలు రాశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేల సంఖ్యలో కవులున్నారు. 102 మందితో ఈ సంకలనం మనకు సమగ్రతను అందివ్వదు. మరింతమంది కవులతో ఇలాంటి సంకలనాలు మరిన్ని రావడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందని ఆశిస్తున్నాను.



కోడం పవన్‌కుమార్
98489 92825



సిగ్గు పడుతున్న

నేను
చేవ చచ్చిన కలాన్ని మాట్లాడుతున్న
నన్ను, మట్టిలో కప్పిపెడితే గన్నై లేసి
అక్షరాలను తూటాల్లా మలిచి
దోపిడిపై యుద్ధం చేసి
జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నా!

ప్రజల నెత్తి మీద
పేదరికం తాండవం చేస్తుంటే
ఆకలి పెను మంటై
తనువు దహించుకపోతే
ప్రశ్నించిన పాపానికి
ఊచలు లెక్కిస్తుంటే
అడగాల్సిన నేను
మెడలో దండలేసుకుని
ఊరేగుతూ
తలరాతలు మార్చినట్లు
సంబరపడుతున్నా!

ఇంద్రవెల్లి, బషీర్‌బాగ్
ముదిగొండ అడుగులో
అడుగులేస్తున్న కాళ్లను
నెత్తిన పెట్టుకొని
మోస్తున్న!
ఒకప్పుడు
న్యాయం కోసం, ధర్మం కోసం
నిప్పులు కక్కి
నేడు
అణగారిన ప్రజల
అస్థిపంజరాలపై
కార్పొరేట్‌కు బాటలేస్తున్న!

ఆకలి తీర్చుకొని
నడక నేర్చుకొని
నలుదిశలా పరిచయమై
మార్పు అనివార్యమని
జంధ్యాన్ని ప్రేమిస్తున్నాను
ఇదే.. అంతిమ లక్ష్యం అని
పేర్చిన శవాల గుట్టల కిందే
సేద తీరుతున్నాను..

నేను చేవ చచ్చిన పెన్నై
పుట్టినందుకు సిగ్గు పడుతున్నా!



ఎదిరెపల్లి కాశన్న
96400 06304

అఫ్సర్ కవిత్వానికి నలభై ఏండ్లు. ఇప్పటితరం వాళ్లు ఇన్నేండ్ల పాటు సాహిత్య ప్రయాణం చేయగలరా? అనే ప్రశ్న వేసుకున్నప్పుడు సందేహంగానే ఉంటుంది. 'రక్తస్పర్శ' నాటి అఫ్సర్ భౌతికంగా ఎలా ఉన్నాడో నాకు తెలియదు. మానసికంగా, ఉద్వేగంగా ఎలా ఉన్నాడో తెలుసుకోవాలంటే మాత్రం ఆ కవితా సంపుటే సాక్షి. తన 2వ కవితా సంపుటి 'ఇవాళ' నాటికి పరిస్థితులు మారాయి. అప్పటికి అఫ్సర్ మానసిక, సామాజిక అనుభవాలు వేరు. సామరస్య వాతావరణంలో మార్పులు వచ్చాయి. స్వేచ్ఛ దారి తప్పింది. 'వలస' నాటికి కవిత్వం ఒక గమ్యం కాదు, అది ఎప్పుడూ ఒక మజిలీ అని ప్రకటించుకున్నాడు. ఎప్పటికీ ఎవరూ వదిలించుకోలేని వర్తమానం కవిత్వానికి ప్రాణమని బలంగా నమ్మాడు. స్థల కాలాలను అన్వేషించకుండా ఏ కవీ కవిత్వం రాయడు. జీవితంలోని రంగులు తెలియాలి. వ్యవస్థలోని స్థాయీభేదాలు తెలియాలి. 80ల నాటి అఫ్సర్ వేరు, 90ల నాటి అఫ్సర్ వేరు. అఫ్సర్ అనే కవే కాదు, ఏ కవి అయినా నిలువ నీరులా ఉంటే పాఠకుల ముందు తేలిపోతాడు.

మాటల మధ్య నిశ్శబ్దం



'వలస' కవిత సంపుటి నాటికి నేనొక విభిన్నమైన వాస్తవికతని, నేను స్త్రీని, నేను దళితుడిని, నేను మైనారిటీని, నేనో మూడవ ప్రపంచాన్ని, చివరికి నేనొక మనిషిని అని సొంత ఉనికిని చెప్పుకోవాల్సిన స్థితిలో పడిన సంక్లిష్ట అంతరంగాన్ని చూసి రోజులు గడిచే కొద్దీ భయపడుతున్నా, అనేక సమూహాల రేపటిని, అస్తిత్వవేదనని, జీవనయాతనను నేను, నేనొక అనేక వచనాన్ని అని చెప్పుకొన్నాడు. ఆయన కవిత్వ నిర్మాణాన్ని పరిశీలిస్తే ఖండికల ద్వారా పొరలు నిర్మించడం, ఆ పొరలను విప్పుకొంటూ పోవడం, ఈతచాప అల్లినట్టు, ఆకు ఆకు చేర్చి విస్తరి కుట్టినట్టు అల్లిక ఉంటుంది. పాఠకుడిలోకి సొచ్చుకుపోయే సరళపదాల భావాల జోడింపు అఫ్సర్‌లో గమనించవచ్చు.

ఆయన ఖమ్మం జిల్లా చింతకాని నుంచి అమెరికా వరకు జరిగిన, జరుగుతున్న పరిణామాలను, సంక్షోభాలను, ఖాళీలను చూస్తున్నాడు. లోపల అంచనాలు కడుతున్నాడు. ఆ అంచనాలకు తన సృజన ద్వారా కొత్తదనాన్ని ఇస్తాడు. ఆ అక్షరాలను కొత్త ఆలోచనలతో గాఢంగా ఎలా వ్యక్తీకరించాలో తనకు తెలుసు. అఫ్సర్ కవిత్వాన్ని మొదటినుంచీ ఇప్పటివరకు పరిశీలిస్తే ప్రపంచ చరిత్ర తాలూకు అనేక మార్పులకు సాక్ష్యాలు దొరుకుతాయి. సామాజిక పరిణామాలను అవగాహన చేసుకుంటూ సాగుతున్నాడు. అఫ్సర్ స్వరం లోతైనది. ఇప్పటి అఫ్సర్ కవిత్వంలో ఒక తాత్త్విక సంవేదన పాటలా వ్యాపిస్తుంది. రాలిపడిన క్షణాల చప్పుడును ప్రభావవంతంగా చిత్రీకరించడం చూడవచ్చు. ఈ పద్యాన్ని చూడండి...

మాటల మీద నీకేమీ గౌరవమూ లేదు,
పోనీ అనుకుంటే ప్రేమా లేదు.
మాటలు నువ్వారికే కట్టుకుంటూ వుంటావ్
వాటిని యూనిఫారాల మీద
నక్షత్రాల పరువులాగా
అలంకరించుకుంటూ వుంటావ్.

ఈ రోజుల్లో ఖాళీ అయిన మనుషులు, ప్రేమ రాహిత్యంతో కూడిన మనుషులు మాట్లాడే మాటలు ఇలాగే అభావంగా ఉంటాయని చెప్తున్నాడు. అఫ్సర్ శైలి గురించి మాట్లాడితే సరాసరి ఎదురుగా నిలబడిన, కూర్చున్న వ్యక్తితో మాట్లాడుతున్నట్టుగా కవితలు ప్రారంభమవుతాయి. అఫ్సర్ పాఠకుడితో రిలేషన్‌ను ఇట్టే ప్రారంభించేస్తాడు. చివరివాక్యం వరకు తీసుకెళ్లి తన ప్రపంచం నుంచి పాఠకుణ్ణి అతడి ప్రపంచంలోకి తీసుకెళ్లగలడు.

అఫ్సర్ కవిత్వంలో ఉన్న మరొక లక్షణం క్లుప్తత. విరహం, దిగులు, నిరాశావాదం, జీవితం తాలూకు అన్వేషణ, జ్ఞాపకాలను పడవలా నీటిలో వదలడం ఇట్లాంటి లక్షణాలను ఎక్కువగా గమనించవచ్చు. అఫ్సర్ రంజాన్ మాసంలో రాసిన ఉపవాస పద్యాలు ఏ రోజుకారోజు ఫేస్‌బుక్ గోడల నుంచి కవిత్వ పాఠకుల గుండె గోడల్లోకి చొచ్చుకొనివెళ్లాయి.

1992 నాటి సంచలనాలు, 9/11 నాటి విపరీత పవనాలు, మెజారిటీ, మైనారిటీ భేదాలు ఇవన్నీ ఆయన హృదయంలో ఎప్పటినుంచో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆ ప్రకంపనల ప్రతిఫలం ఈ పొక్క పొద్దు పద్యాలు. చిక్కని కవిత్వ వ్యక్తీకరణ, నిజాయితీతో కూడిన వేదన, పాలస్తీనా శిథిలాల్లో చిక్కుకున్న పసిపిల్లల ముఖాల్లోని ఆవేదన, యుద్ధం సృష్టించే అశాంతి.. ఇట్లాంటివన్నీ ఉపవాస పద్యాల్లో అలవోకగా తొంగిచూశాయి. ఈ వాక్యాలన్నీ ఒక ధ్యానంలో నుంచి వచ్చినట్టుగా మనకు కనిపిస్తాయి. అంతర్జాతీయ వేదిక మీద నిలబడి తన అస్తిత్వాన్ని బలంగా చెప్పుకొనే అవకాశాన్ని అఫ్సర్ పొందాడు. తన ముందు పాఠం వినడానికి కూర్చున్న పాలస్తీనా, ఈజిప్ట్, అమెరికా లాంటి దేశాల విద్యార్థుల ముఖాల్లో ఆయన తన అప్పటి రోజుల ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. అఫ్సర్ ఈ పద్యాలను నేటి ముస్లింల కండ్ల వెను క తారట్లాడే కన్నీళ్లుగా చెప్తున్నాడు. బాధితుల తరపున వకాల్తా పుచ్చుకున్నాడు. ఈ పద్యాల్లో ఎక్కడా మనకు వ్యర్థపదాలు కనిపించవు. అనవసరంగా ఒక్క అక్షరమూ అనిపించదు.

ఇప్పటి అఫ్సర్ కవిత్వాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే పలికిన మాటల మధ్య పలకని మాటల నిశ్శబ్దంగా చెప్పవచ్చు. ఆయన కవిత్వానికి ప్రతిబింబం ఈ వాక్యాలు..

'కాస్త ప్రేమా కాస్త స్నేహమూ
కాస్త సంతోషమూ... నీ కోసమే వీచే గాలి
నీ వెంటే నడిచే ఆకాశమూ
నిన్ను మాత్రమే పాడే పాట
చిటికెన వేలు వొదలని నీడా'

(ఈ నెల 14వ తేదీన 'ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ' పురస్కారాన్ని కవి అఫ్సర్ అందుకున్న సందర్భంగా...)



డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

దళిత రైతుకు దగా!

రైతు సమాచార పత్రంలో ఉద్యోగిగా గుర్తింపు • సర్కారు తప్పిదం..1.92లక్షల మాఫీకి టోపీ • నిజామాబాద్ జిల్లాలో రైతుకు చేదు అనుభవం

నిజామాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆయన యువ రైతు చదివింది పీజీ అయినా వృత్తి వ్యవసాయమే. ఉద్యోగ అర్హత పరీక్ష కాదు కదా.. కనీసం దరఖాస్తు కూడా చేయలేదు. అయినా రేవంత్ సర్కారు ఘనకార్యంలో ఆయనకు ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు లభించింది. సీన్ కట్ చేస్తే సదరు రైతుకు రావాల్సిన రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు రొడ్డ సుమన్‌కు నాలుగు ఎకరాల సొంత వ్యవసాయ భూమి ఉన్నది. కుటుంబంలో ఆయనొక్కడే వారసుడు. దళిత కుటుంబానికి చెందిన రొడ్డ సుమన్‌కు మాక్లూర్‌లోని ఎస్‌బీఐ నుంచి రూ. 1,65,220 రుణం మంజూరైంది. డీసీసీబీ నుంచి రూ.26,801 రుణం వచ్చింది. మొత్తం రూ.1,92,021 రుణాన్ని స్వీకరించగా రైతు సమాచార పత్రంలోని రుణమాఫీ స్థితి అని పేర్కొనే 8వ నంబర్ కాలమ్‌లో కుటుంబంలో మినహాయింపులేని ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు..అంటూ నమోదు చేయడం విడ్డూరంగా మారింది. సుమన్ కుటుంబంలో రెండు రుణ ఖాతాల సంఖ్య జారీ చేయబడింది. ఆ రెండింటిలో ఏ ఒక్క ఖాతాకూ రుణ మాఫీ వర్తించలేదు. దీంతో ఏవో, ఏఈఓలను ప్రశ్నించగా రికార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగిగా పేర్కొన్నట్టుగా బదులిచ్చారు. పొలం పనులు చేసుకునే తాను సర్కారు ఉద్యోగిని కావడం ఏమిటని నిట్టూర్చడమే రొడ్డ సుమన్ వంతయ్యింది. ఈ తప్పును సరిదిద్దే వారెవ్వరని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం, కాల్ సెంటర్లకు ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. ఎవ్వరూ స్పందించకపోవడంతో ఓపిక నశించి పోరాటానికి సిద్ధపడ్డారు. తనకు న్యాయంగా రావాల్సిన లక్షా 92వేల 21రూపాయల పంట రుణాన్ని మాఫీ చేయండి లేదంటే ప్రభుత్వ ఉద్యోగమైనా చూపించండంటూ సర్కారును సుమన్ అడుగుతున్నాడు.


పంటరుణమాఫీ 2024
రైతు సమాచార పత్రం
BODDA SUMAN | RAJANNA
Nizamabad | 1-10 MADHAPUR, MAKLOOR Nizamabad
STATE BANK OF INDIA MAKLOOR | Crop Loan | 165220
DCCB NIZAMABAD Makloor | Crop Loan | 26801

రైతు సమాచార పత్రంలో ప్రభుత్వ ఉద్యోగిగా నమోదైన దృశ్యం



ఉద్యోగం ఇస్తారా? రుణమాఫీ చేస్తారా?

నేను పదిహేనేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. నా కుటుంబంలో నేను ఒక్కడినే రుణం పొందాను. ఎస్‌బీఐ, డీసీసీబీ బ్యాంకుల్లో మొత్తం రూ.1,92,021 రుణం ఉండగా మాఫీ కాలేదు. కారణం ఏమిటని అడిగితే ప్రభుత్వ ఉద్యోగివి అంటూ బదులిస్తున్నారు. నాకైతే ఆశ్చర్యమేసింది. ప్రభుత్వం సరిచేసి రుణమాఫీ వర్తింపచేయాలి. లేదంటే ప్రభుత్వ ఉద్యోగమైనా చూపించాలని కోరుతున్నాను.

- రొడ్డ సుమన్, రైతు

మాఫీకి రాజకీయ రంగు!

- **జాబితా తయారీలో అధికారపార్టీ నేతల జోక్యం!**
- **చింతలపల్లిలో 1,800 రైతుల్లో 500 మందికే మాఫీ**
- **మంత్రి జూపల్లి నియోజకవర్గంలో రుణమాఫీ సిత్రాలు**

కొల్లాపూర్, ఆగస్టు 18: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చింతలపల్లి గ్రామంలో రైతు రుణమాఫీకి రాజకీయ గండం ఎదురైంది. మంత్రి జూపల్లి కృష్ణారావుకు అత్యంత సన్నితంగా ఉండే కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ జాబితా తయారీలో జోక్యం చేసుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్యనాయకులకు అర్హత ఉన్నా జాబితాలో పేరు రాలేదు. అధికారులను అడిగితే విస్మయానికి గురిచేసే సమాధానాలు రావడంతో రాజకీయరంగు పులుముకున్నదనే ఆరోపణలున్నాయి. చింతలపల్లిలో ప్రభుత్వం కాలపరిమితి ప్రకారం 1,800 మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉన్నారు. మొదటి విడతలో 154, రెండో విడతలో 193, మూడో విడతలో 100 మందిలోపే లబ్ధిదారులు ఉన్నట్టు తెలుస్తున్నది. మూడు విడుతలు కలిపి 500 మంది లోపే మాఫీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కొర్రీలతో కొందరికి కోత పడితే.. స్థానికంగా ఉన్న అధికారపార్టీ నాయకుల జోక్యంతో మరికొందరికి మాఫీ కాకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

జూపల్లి ఇలాకా.. రైతుకు ధోకా!

రేషన్ కార్డులేదని చేయట్లేదు..



కొల్లాపూర్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో రూ.60 వేలు పంట రుణం తీసుకున్నాను. రేషన్ కార్డులేదన్న నెపంతో కుటుంబ నిర్ధారణ చేయాలని చెప్పి నాకు రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో రోజూ బ్యాంకు, వ్యవసాయాధికారులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సాయికృష్ణ, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

ఎవరూ పట్టించుకోవడం లేదు..



స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కొల్లాపూర్ బ్రాంచ్‌లో రూ.లక్ష రుణం తీసుకున్నాను. కాంగ్రెస్ వస్తే రుణమాఫీ చేస్తుందని ఆశపడ్డాను. కానీ నాకు మాఫీ కాలేదు. మాఫీ కోసం రోజు బ్యాంకు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

- శివకుమార్, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

రాజకీయ నేతల జోక్యం వల్లే..



ప్రభుత్వం ప్రకటించిన కాలపరిమితిలోనే నేను కొల్లాపూర్ సొసైటీ లో రూ.లక్షా 20 వేలు పంట రుణం తీసుకున్నాను. నాకు రేషన్ కార్డు, పాసుపుస్తకం, ఆదాయ ధ్రువీకరణ పత్రం అన్నీ ఉన్నాయి. రాజకీయ నాయకుల జోక్యంతోనే కొత్త కారణాలను సృష్టించి రుణమాఫీలో పేరు లేకుండా చేశారు. అధికారులను అడిగితే నీకు అర్హత ఉంది కానీ ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదని సమాధానం చెబుతున్నారు. రుణమాఫీని రాజకీయాలకు వాడుకుంటున్నారు.

- మురళీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

2లక్షలు దాటినోళ్లకు రుణమాఫీ ఎప్పుడు ?

- **ఊసే ఎత్తని ప్రభుత్వం.. రైతుల్లో అయోమయం**
- **2 లక్షలపైన రుణం చెల్లించేదెట్ల?**
- **కుటుంబ రుణం వేర్వేరు బ్యాంకుల్లో ఉంటే ఎలా ?**
- **2 లక్షలు దాటినోళ్లు 20 లక్షల మంది రుణరైతులు**
- **రుణమాఫీ కావాలంటే.. మళ్లీ అప్పు చేయాల్సిందేనా!**

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : రూ.2 లక్షల వరకు అరకొరగా రుణ మాఫీ చేసిన ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా రుణం పొందిన రైతుల పరిస్థితి ఏంటనేదానిపై స్పష్టత ఇవ్వడం లేదు. వీళ్లకు రుణమాఫీ ఎప్పటి నుంచి.. ఏ విధంగా చేస్తారనే అంశంపై స్పష్టత కొరవడింది. దీంతో 2 లక్షల వరకే మమా అనిపించేసి ఆపై రుణరైతులకు మొండి చేయి చూపిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు ఇప్పటికే రుణ మాఫీ మొత్తం పూర్తి చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మరింత ఎక్కువై అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులు ఏ విషయం చెప్పలేక చేతులెత్తుస్తున్నారు.దీంతో 2 లక్షలకు దాటిన రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది.

విధివిధానాలేవీ?

ప్రభుత్వం రూ. 2 లక్షలకు పైగా రుణమాఫీకి సంబంధించి ఎలాంటి విధివిధానాలు ప్రకటించలేదు. ఈ రైతులకు సంబంధించి ఉత్తర్వుల్లో ఒకేఒక్క అంశాన్ని మాత్రమే ప్రస్తావించింది. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న కుటుంబం ముందుగా 2 లక్షలకు పైగా ఎంత రుణం ఉన్నదో ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తే ప్రభుత్వం రూ. 2 లక్షలు జమ చేస్తుందని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో 2 లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ఎలా చెల్లించాలి?, ఎప్పటి వరకు చెల్లించాలనే అంశంలో స్పష్టత ఇవ్వ లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్లక్ష్యం చూస్తుంటే ఎగవేత ప్లాన్‌లో ఉందా అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు బ్యాంకుల్లో అప్పుంటే ఎలా?

రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ముందుగా చెల్లించేందుకు సిద్ధమవుతున్న రైతులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రైతులకు వేర్వేరు బ్యాంకుల్లో తలా రూ.లక్ష అప్పు ఉన్నది. వీళ్ల మొత్తం అప్పు రూ.4 లక్షలు. ఇందులో వీళ్లు రూ.2లక్షలు బ్యాంకులకు ముందుగా చెల్లించాలి. అయితే తలా రూ. లక్ష మాత్రమే ఉండడంతో పైగల రూ. 2 లక్షలను ఎవరి ఖాతా కింద చెల్లించాలనే అంశంపై స్పష్టత లేదు. ఆ తర్వాత రుణమాఫీ ఎవరెవరికి అవుతుందో తెలియదు. రూ. 2 లక్షల పైన ఉన్న రుణం చెల్లించాలంటే మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పై చెప్పిన ఉదాహరణలో రైతు కుటుంబానికి రూ. 4 లక్షల అప్పు ఉంటే ఇందులో రూ. 2 లక్షల రుణమాఫీకి మరో రూ. 2 లక్షల అప్పు తెచ్చి బ్యాంకుల్లో కట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

అర్హుల సంఖ్య ఏదీ?

రూ. 2 లక్షల వరకు 22.37 లక్షల మందికి రుణమాఫీ చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం అదే విధంగా రూ. 2 లక్షలకు పైగా రుణం గల రైతులు ఎంతమంది ఉన్నారనే లెక్కల్ని ఎందుకు ప్రకటించడం లేదని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వారికి రుణమాఫీకి ఎంత మొత్తం అవుతుందో ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ లెక్కల్ని బయటకు చెప్పకపోవడంతో మళ్లీ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం రుణమాఫీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో రూ.2 లక్షలకు పైగా రుణం గల రైతులు సుమారు 20 లక్షల వరకు ఉన్నారు. రుణమాఫీకి మొత్తం అర్హుల సంఖ్య 42 లక్షలుగా ప్రభుత్వం పేర్కొన్నది. ఇప్పటి వరకు 22.37 లక్షల మందికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంకా 19.63 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలో వీళ్లంతా రూ. 2 లక్షలకు పైగా రుణం పొందిన రైతుల జాబితాలో ఉండాలి.దీనిపై అధికారులు మాత్రం ఈ లెక్కలతో విభేదిస్తున్నారు. 2 లక్షల వరకు రుణమాఫీకి 22.37 లక్షల మంది అర్హులైతే... 2 లక్షలకు పైగా రుణ రైతులు 20 లక్షల మంది ఏ విధంగా ఉంటారని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మన రాష్ట్రంలో 90శాతం రైతులు సన్నకారు రైతులే దీంతో 2 లక్షల వరకు రుణమాఫీలో రైతుల సంఖ్య అధికంగా ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా 2 లక్షల వరకు రుణమాఫీలో రైతుల సంఖ్య తగ్గి.. దీంతో సమానంగా 2 లక్షలకు పైగా రుణ రైతులు ఉండడంపై అధికారుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అదనపు రుణం చెల్లింపు ఎందుకు...?

రూ. 2 లక్షలు రుణమాఫీ కావాలంటే ఆ పై రుణం ముందుగా చెల్లించాలనే నిబంధనపై రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కండీషన్ పెట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వం ఎంత రుణమాఫీ చేయదల్చుకుందో ఆ మొత్తం చేయకుండా రైతులతో లింకు పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని రైతుల బాధ్యతకు వదిలేయాలి గానీ ఇప్పుడే చెల్లించాలంటూ పీకల మీద కత్తిపెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనతో రైతులు మళ్లీ అప్పుల కోసం ప్రైవేటు వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారని తెలిపారు. ఒక్కొక్కరు రూ. 5 అంతకు మించి వడ్డీతో అప్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. రైతులు అంత చేస్తున్నా ప్రభుత్వం నుంచి 2 లక్షలకు పైగా రుణమాఫీ ఎప్పుడు చేస్తారో స్పష్టత లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

అదనపు రుణం చెల్లించాక.. అర్హత ఉంటే రుణమాఫీ చేస్తాం

రూ. 2లక్షల రుణమాఫీపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం



హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ నిబంధనల మేరకు రూ. 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు ముందు అదనపు సొమ్ము చెల్లించాలని, ఆ తర్వాతే రైతుల అర్హతను బట్టి రుణమాఫీ చేస్తామని ఆదివారం పత్రికా ప్రకటనలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రూ. 2 లక్షలలోపు రుణమాఫీకాని రైతుల కుటుంబ నిర్ధారణ చేసిన తర్వాత వాళ్లకు కూడా చెల్లిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు రుణమాఫీపై అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో విడతల వారిగా రెండుసార్లు రూ. 28వేల కోట్లు రుణమాఫీ చేస్తే తాము ఒకేసారి రూ. 17,933 కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు.

బీసీలు మందుకు ఆశపడ్తరు

› మొదటిపేజీ తరువాయి...

కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. మల్లన్న మాట్లాడుతుండగా ఓ వ్యక్తి లేచి అందుకే రెడ్డిలెవరూ ఈ సభకు రాలేదని అన్నారు. అలా అనొద్దని ఆ వ్యక్తిని కొందరు వారించారు. దాంతో తీన్మార్ మల్లన్న కలుగజేసుకొని ఆ వ్యక్తి చెప్పిన మాటలను తప్పు పట్టొద్దని, ఈ సభకు వారు నిజంగానే రావొద్దని అన్నారు. గౌడ్‌లు అడుక్కునే వారు కాదని, ఒకప్పుడు ఈ దేశాన్ని ఏలిన వారని కొనియాడారు. వెలమలు, రెడ్డిలు ఇచ్చే మందుకు ఆశ పడి బీసీలు ఓట్లను అమ్ముకుంటున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అదే బీసీలు వెలమ, రెడ్డి ఓట్లను మందుతో కొనగలరా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ పోరాట పటిమతో బీసీలంతా ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఒక్క బీసీ అయినా ముఖ్యమంత్రి అయ్యిండా అని ప్రశ్నించారు. బీసీల నుంచి బీర్ల అయిలయ్య కూడా ముఖ్యమంత్రి పదవికి అర్హుడేనని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీసీలకు మంత్రి పదవి ఇవ్వాలని, అందుకు తాను రాహుల్ గాంధీకి లేఖ రాయనున్నట్టు తెలిపారు.

అల్లుడా.. మజాకా?

› మొదటిపేజీ తరువాయి...

సంస్థ ఆయిల్‌ఫెడ్‌తో పాటు మరో 14 కంపెనీలున్నాయి. ఈ కంపెనీల్లో ఒకటి ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. ఈ కంపెనీకి 2021లో ఏడు జిల్లాలు నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, ఆదిలాబాద్ జిల్లాలు కేటాయించారు. సుమారు 40 వేల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కల్ని నాటించింది. ఇప్పుడిప్పుడే గెలల కాత మొదలైంది. ఈ సమయంలో కంపెనీని కబ్జా చేసేందుకు ఓ మంత్రి మేనల్లుడు, కొడుకు కలిసి స్కెచ్ వేసినట్టు తెలిసింది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వంలో పెద్దస్థాయిలో చర్చ జరగ్గా ఇందుకు ఆ శాఖ ఉన్నతాధికారి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. అలా చేయడం కుదరదని తేల్చిచెప్పినట్టు తెలిసింది. అయినా సదరు మంత్రి బంధువులు మాత్రం తీవ్ర ఒత్తిడి చేస్తూ వారి ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నట్టు సమాచారం.



తెలంగాణ భవన్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, పల్లె రవి, బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులు

బడుగు వీరులకు గొడుగు పట్టింది కేసీఆరే

- **మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య**
- **ఏదేని జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి**
- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**
- **కేసీఆర్ హయాంలో గౌడన్నలకు చేయూత**
- **సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి**




సిరిసిల్లలోని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేటీఆర్

హైదరాబాద్/మహబూబ్‌నగర్ అర్బన్/సిద్దిపేట టౌన్/రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): బడుగువీరులకు గొడుగు పట్టింది కేసీఆరేనని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 374వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి మాజీ మంత్రులు వీ శ్రీనివాస్ గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రామమూర్తి, రాంనర్సింహ గౌడ్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గతంలో ఎవరూ నిర్వహించలేదని, తెలంగాణం సాధించిన తరువాత కేసీఆర్ బడుగు, బలహీనవర్గాల వీరులకు, త్యాగధనులకు సముచి గౌరవం ఇచ్చారని చెప్పారు. సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ సహ అనేకమంది త్యాగధనుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించిన చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. సర్వాయి పాపన్న విగ్రహానికి నిధులు కేటాయించారని, ట్యాంక్‌బండ్‌పై, అసెంబ్లీ ప్రాంగణంలోనూ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాన్యులందరూ సమానత్వంతో బతకాలని తన జీవితాన్ని పోరాటంగా మలచుకొన్న సర్వాయి పాపన్న ఆదర్శ ప్రాయుడని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో పర్యటించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సర్వాయి పాపన్న జయంతిలో పాల్గొన్నారు. మొదటి బైపాస్‌రోడ్డులోని నర్సింగ్ కళాశాల చౌరస్తాలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యం కోసం, తెలంగాణపై నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న పేరును జనగామ లేదా మరే జిల్లాకైనా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వాయి పాపన్న ఆశయాలను సాధించే దిశగా గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని గౌడన్నలకు తాటి, ఈత చెట్ల పన్నులు, గతంలో ఉన్న బకాయిలన్నింటినీ పూర్తి స్థాయిలో మాఫీ చేసిందని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేసీఆర్ హయాంలో గౌడ కులస్థులకు చేయూత అందిస్తే.. కాంగ్రెస్ సర్కారు గీత కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నదని ఆరోపించారు.

పర్యాటక ప్రాంతంగా పాపన్నగౌడ్ జన్మస్థలం

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రకటన

రవీంద్రభారతి, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ఆదర్శనీయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌గౌడ్ కొనియాడారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని చేసి చూపిన పాపన్నగౌడ్ జీవితం తమ ఇందిరమ్మ రాజ్యానికీ ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ పుట్టిన ఖిలా షాపూర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.4.70 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. పాపన్న జీవిత చరిత్రపై రూపొందించిన పాకెట్ బుక్‌ను ప్రతి గ్రామంలో పంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం



పోడు పట్టాలను చూపిస్తున్న భద్రాద్రి జిల్లా చింతల్‌తండా గిరిజనులు

160లో35 మందికే మాఫీ

- **చింతల్‌తండాలో తీరని రుణమాఫీ**
- **గ్రామంలోని గిరిజన రైతులకు రిక్త'హస్తం'**
- **జాబితాలో 70 శాతానికి పైగా పేర్లు గల్లంతు**
- **బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తామంటున్న రైతులు**

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (నమస్తేతెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం చింతల్ తండా ఓ మారుమూల పల్లె. 85 కుటుంబాలున్న ఈ గ్రామంలో అందరూ రైతులే. గ్రామ పరిధిలో 160 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. వారిలో కేవలం 35 మందికే కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేసింది. మూడు విడతలు కలిపి 30 శాతం మంది రైతులకు కూడా మాఫీ కాలేదు. వీరిలో ఒక్కొక్కరి పంట రుణాలూ రూ.1.04 లక్షలలోపే ఉండటం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ నూరుశాతం కాలేదనడానికి ఈ చిన్న గ్రామమే ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నది. రుణమాఫీ మీద గంపెడాశలు పెట్టుకున్న గ్రామ అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం రిక్త'హస్తాన్నే' మిగిల్చింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ రైతుబంధు, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాలు అందిన ఈ గ్రామంలో.. రేవంత్ సర్కారు వచ్చీరాగానే మొండి 'చేయి' చూపిందని స్థానిక రైతులు చెప్తున్నారు. మూడు విడతల్లోనూ 70 శాతానికి పైగా పేర్లు రాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులనూ కలిసి వాకబు చేయగా, 'పేర్లు రానప్పుడు మేమేం చేయాలి?' అంటూ వారు సమాధానమిచ్చారు. దీంతో అయోమయంలో ఉన్న వారు రుణాలు తీసుకున్న బ్యాంకు వద్ద ఆందోళనకు దిగాలని నిర్ణయించుకున్నారు. ధర్నా చేసైనా తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు రైతులు తెలిపారు.

బ్యాంకుల చుట్టూ తిరగాలా?

వ్యవసాయ సీజన్ మొదలైందని, పంటలన్నీ అదునుమీద ఉన్నాయని చింతల్‌తండా రైతులు పేర్కొంటున్నారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులు, సొసైటీల వద్దకు పరుగులు తీయడం తప్పడం లేదు. దీంతో పంటలు సాగు చేసుకోవాలా? బ్యాంకుల చుట్టూ తిరగాలా? అంటూ గ్రామ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీ కింద భద్రాద్రి జిల్లాలో 57,983 మంది రైతులకు రూ.415 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని, ఇన్ని నిధులు మంజూరైనా గత కేసీఆర్ సర్కారు రైతుబంధు కింద ఒక సీజన్‌కు ఇచ్చినంత మొత్తం కూడా లేదని విమర్శిస్తున్నారు.

అందరికీ లక్షలోపు రుణాలే.. ఎందుకు మాఫీ కాలే?

మా ఊరికి అధికారులొస్తే పట్టా పుస్తకాలు. బ్యాంకు పాస్‌బుక్‌లు చూపిస్తాం. అందరికీ పోడు పట్టాలున్నాయి. కేసీఆర్, వైఎస్సార్ అందించినవీ ఉన్నాయి. అందులోనూ అందరికీ రూ.లక్ష లోపు పంట రుణాలే. అయినా మా అప్పు ఎందుకు మాఫీ కాలేదు? అధికారులు మా దగ్గరకు వచ్చి చూడాలి? మేము అర్హులమో కాదో తేల్చిచెప్పాలి?

-తేజావత్ రమేశ్, చింతల్ తండా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై

రేపు సుప్రీం విచారణ

- సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు
- ప్రతి రెండు గంటలకు నివేదిక ఇవ్వండి
- వైద్యుల ఆందోళనల నేపథ్యంలో శాంతి భద్రతలపై రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు



న్యూఢిల్లీ/కోల్‌కతా, ఆగస్టు 18: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ కేసుపై ఈ నెల 20న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనున్నది. ఈ కేసు దర్యాప్తును కలకత్తా హైకోర్టు ఇటీవల కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేసింది. మరోవైపు, దేశవ్యాప్తంగా వైద్యులు, నర్సుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రాల్లో శాంతి భద్రతలపై ప్రతి రెండు గంటలకోసారి నివేదిక పంపాలని ఆయా రాష్ట్రాల పోలీసు శాఖలను కేంద్ర హోంశాఖ ఆదేశించింది.

బీజేపీ మాజీ ఎంపీ, ఇద్దరు డాక్టర్లకు పోలీసుల సమన్లు

హత్యాచారానికి గురైన బాధిత ట్రైనీ డాక్టర్ గుర్తింపు వెల్లడి, వదంతుల వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై కోల్‌కతా పోలీసులు ఆదివారం బీజేపీ మాజీ ఎంపీ లాకెట్ ఛటర్జీ, ఇద్దరు డాక్టర్లు కునాల్ సర్కార్, సువర్ణ గోస్వామిలకు సమన్లు జారీచేశారు.

తృణమూల్ కాంగ్రెస్‌లో విభేదాలు

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన బెంగాల్‌లో అధికార టీఎంసీలో విబేధాలకు దారితీసింది. 'సీబీఐ పారదర్శకంగా వ్యవహరించాలి. బాధితురాలి ఆత్మహత్య కథను ఎవరు అల్లారో తెలియాలంటే మాజీ ప్రిన్సిపాల్, పోలీసు కమిషనర్‌ను కస్టడీ విచారణ చేయాలి' అని టీఎంసీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ ఎక్స్ పోస్టులో డిమాండ్ చేశారు. మూడు రోజుల తర్వాతనే పోలీసుల జాగిలాలను తీసుకొచ్చారని, ఇలాంటి వందల ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. అయితే శేఖర్ రాయ్ డిమాండ్లను మరో నేత కునాల్ ఘోష్ వ్యతిరేకించారు. హత్యాచార ఘటన గురించి తెలిసినప్పటి నుంచి పోలీసు కమిషనర్ తగిన విధంగా స్పందించారని, అవసరమైనదంతా చేశారని అన్నారు.

ఒక్కటైన ప్రత్యర్థులు

హత్యాచార ఘటనపై రాష్ట్రంలో నిరసనలు హోరెత్తుతున్నాయి. ఫుట్‌బాల్‌లో బద్ధ విరోధులైన ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ జట్టు సభ్యులు ఆదివారం సాల్ట్ లేక్ స్టేడియం వద్ద ఉమ్మడిగా నిరసన ప్రదర్శన చేపట్టారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై దాడుల్ని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని పద్మ పురస్కారాలు అందుకున్న 70మంది వైద్యులు ప్రధాని మోదీకి లేఖ రాశారు.

సీఎం మమతపై నమ్మకం పోయింది

ట్రైనీ డాక్టర్ తల్లిదండ్రుల ఆగ్రహం

కోల్‌కతా హత్యాచార ఘటనలో పోలీసులు, సీఎం మమతా బెనర్జీ తీరుపై మృతురాలి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'కేసులో న్యాయం చేకూర్చేందుకు సీఎం మమత ఏమీ చేయలేరని అర్థమైంది. ఆ దిశగా ఆమె చేస్తున్నది ఏమీ లేదు. న్యాయం కావాలంటూనే.. నిరసనల్ని అణచివేస్తున్నారు' అంటూ ట్రైనీ డాక్టర్ తండ్రి వాపోయారు. కేసును వెంటనే ముగించేందుకు, నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు, వారం గడిచినా దర్యాప్తు వేగవంతం కాకపోవడాన్ని క్రికెటర్ హర్భజన్‌సింగ్ ప్రశ్నించారు. నేరస్థుడికి త్వరగా శిక్షపడితేనే బాధితురాలి ఆత్మ శాంతిస్తుందన్నారు. ఈ మేరకు మమతకు లేఖరాశారు.

ఆమెకు రక్షణేది?

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన.. దేశంలో మహిళల భద్రతపై మరోసారి చర్చను లేవనెత్తింది. 2012లో దేశంలో సంచలనం సృష్టించిన నిర్భయ ఘటన అనంతరం లైంగిక దాడులకు వ్యతిరేకంగా కఠిన చట్టాలు, నిబంధనలు తీసుకొచ్చినా ఈ కీచకపర్వానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. దేశంలో గంటకు సగటున నలుగురు మహిళలు అఘాయిత్యాలకు బలవుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో గంటకు నాలుగు రేప్‌లు!

- రోజుకు 86 మందిపై లైంగికదాడులు
- అఘాయిత్యాలకు బలవుతున్న మహిళలు
- ఫ్రెండ్స్, బంధువులు, తెలిసినవాళ్లే నిందితులు
- శిక్షలు పడుతున్నది 27-28 శాతం కేసుల్లోనే



న్యూఢిల్లీ, ఆగస్టు 18: పని ప్రదేశాలు, ఇండ్లు, బయట.. ఇలా ఎక్కడ కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయింది. దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, దేశంలో ప్రతి గంటకు సగటున నలుగురు లైంగిక దాడులకు గురవుతున్నారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017-2022 మధ్య రోజుకు సగటున 86 రేప్ కేసులు నమోదవుతుండగా, 82 కేసుల్లో రేపిస్టులు బాధిత మహిళలకు తెలిసిన వాళ్లే కావడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. 2017-2022 మధ్య దేశంలో మొత్తం 1.89 లక్షల లైంగిక దాడుల కేసులు నమోదయ్యాయని, ఇందులో 1.91 లక్షల మంది బాధితులుగా ఉన్నారని జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్సీఆర్బీ) నివేదిక వెల్లడించింది. 1.79 లక్షల కేసుల్లో తెలిసిన వాళ్లే మహిళలపై లైంగిక దాడులకు పాల్పడటం గమనార్హం. దేశంలో భారీ సంఖ్యలో మహిళలపై లైంగిక దాడులు చోటుచేసుకుంటుంటే.. నిందితులకు శిక్ష పడుతున్న కేసులు చాలా తక్కువగా ఉంటున్నాయి. 2014-2022 మధ్య శిక్ష రేటు 27-28% శాతం మధ్యనే ఉన్నదని ఎన్సీఆర్బీ గణాంకాలు పేర్కొన్నాయి.


రాజస్థాన్‌లో అత్యధికంగా..

2022లో దేశవ్యాప్తంగా 31,516 లైంగిక దాడి కేసులు నమోదు కాగా, రాజస్థాన్‌లో అత్యధికంగా 5,399 నమోదయ్యాయి. తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్(3,029), మహారాష్ట్ర(2,904), యూపీ(3,690), ఢిల్లీ(1,212) ఉన్నాయి. ప్రతి లక్ష జనాభాకు చూస్తే ఉత్తరాఖండ్‌లో అత్యధికంగా లైంగిక దాడులు 15 ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో 14 చొప్పున రాజస్థాన్, చండీగఢ్, హర్యానాలో 13, ఢిల్లీ, లక్షద్వీప్‌లో 12 చొప్పున ఉన్నాయి. మొత్తంగా 2022లో దేశంలో ప్రతి లక్ష జనాభాకు ఐదుగురు లైంగిక దాడులకు గురయ్యారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆఫీసుల్లోనూ లేని భద్రత

పని ప్రదేశాలు, ఆఫీసుల్లో కూడా మహిళలకు భద్రత లేకుండా పోయింది. యజమానులు, సహచర ఉద్యోగులే మహిళలపై అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. పని ప్రదేశాల్లో రోజుకు సగటున ఒకరు చొప్పున లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

భారత్‌లో లైంగిక దాడుల కేసులు



2017-22 మధ్య లైంగిక దాడుల కేసులు: 1.89 లక్షలు

2022లో లైంగిక దాడుల కేసులు

రాష్ట్రం	కేసుల సంఖ్య
రాజస్థాన్	5,399
మధ్యప్రదేశ్	3,029
మహారాష్ట్ర	2,904
ఉత్తరప్రదేశ్	3,690
ఢిల్లీ	1,212

యజమానులు లేదా సహచర ఉద్యోగుల లైంగిక దాడులు

సంవత్సరం	రేప్‌ల సంఖ్య
2014	618
2015	577
2016	600

పని ప్రదేశాలు, ఆఫీసుల్లో లైంగిక వేధింపులు

సంవత్సరం	కేసులు
2017	485
2018	402
2019	509
2020	488
2021	419
2022	422

నిరుపయోగంగా నిర్భయ ఫండ్ నిధులు!

2012లో ఢిల్లీ సామూహిక లైంగిక దాడి, హత్య ఘటన తర్వాత కేంద్రం నిర్భయ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. మహిళల భద్రతకు ఉద్దేశించిన ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించక పోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి నిర్భయ ఫండ్‌కు రూ.7,213 కోట్లు కేటాయించగా, 2023, డిసెంబర్ 8 నాటికి రూ.5,119 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే దాదాపు 30 శాతం నిధులను వినియోగించలేదు. ఖర్చు చేసిన నిధుల్లో కూడా రూ.1,435(28 శాతం) అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి 8 పెద్ద నగరాల్లోనే వినియోగించినట్టు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

బస్సులో బాలికపై గ్యాంగ్‌రేప్

డెహ్రాడూన్‌లో దారుణం.. ఐదుగురి అరెస్ట్

డెహ్రాడూన్, ఆగస్టు 18: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 12న అర్ధరాత్రి తనపై సామూహిక లైంగిక దాడి జరిగిందని ఓ బాలిక(15) ఆరోపించింది. తనపై అయిదు మంది బస్సులో లైంగిక దాడి చేశారని తెలిపింది. బస్టాండ్‌లోని ఓ దుకాణం కాపలాదారు ఆమె దీన స్థితిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనలో నిందితులందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికకు చేయించిన వైద్య పరీక్షల నివేదిక కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. ఘటన జరిగిన బస్సుతో పాటు, మరో బస్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. కాగా, బాధితురాలు మానసిక సమస్యలతో బాధ పడుతున్నది.

విద్యార్థినికి లిఫ్ట్ ఇచ్చి, అఘాయిత్యం

బెంగళూరులో దారుణం

బెంగళూరు: ఓ కళాశాల విద్యార్థిని (21)కి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి, ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈస్ట్ జోన్ అదనపు పోలీస్ కమిషనర్ రమణ్ గుప్తా తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు గెట్ టుగెదర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా, శనివారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు బైక్‌పై లిఫ్ట్ ఇచ్చాడు. ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె తన స్నేహితులకు ఎమర్జెన్సీ మెసేజ్ పంపించి, లొకేషన్ షేర్ చేసింది. ఆమె స్నేహితులు వెళ్లి చూసేసరికి హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్‌లోని హోసూర్ సర్వీస్ రోడ్డు సమీపంలో ఓ లారీ వెనుక కనిపించింది. ఆమె ఒంటిపై ఒక జాకెట్ మాత్రమే ఉంది. వారు ఆమెకు బట్టలు ఇచ్చి, సమీపంలోని దవాఖానకు తరలించారు. అదే సమయంలో వారికి ఆ లారీ దగ్గర ఓ వ్యక్తి కనిపించాడు. అతను ఆందోళనతో ఉన్నట్లు గుర్తించారు. అతనిని పట్టుకోబోగా, పారిపోయాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాద నేరంగా స్త్రీ ద్వేషం

బ్రిటన్ ప్రభుత్వం యోచన

లండన్ : మహిళలు, బాలికల పట్ల హింసను నిరోధించేందుకు కఠినంగా వ్యవహరించాలని బ్రిటన్ ప్రభుత్వం యోచిస్తున్నది. ఇస్లామిస్ట్, ఫార్-రైట్ తీవ్రవాదంతో వ్యవహరించినట్లుగానే స్త్రీ ద్వేషులపై కూడా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస గురించి నేషనల్ పోలీస్ చీఫ్స్ కౌన్సిల్ ఇచ్చిన నివేదికలో ఇది జాతీయ స్థాయి అత్యవసర పరిస్థితి అని తెలిపింది. దీంతో మితిమీరిన స్త్రీద్వేషాన్ని ఉగ్రవాదంగా పరిగణించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కౌంటర్ టెర్రరిజం స్ట్రాటజీని సమీక్షించాలని హోం సెక్రటరీ యెవెట్టీ కూపర్ ఆదేశించారు.



7.90 సెం.మీ నాలుక.. గిన్నిస్ రికార్డ్

టెక్సాస్: అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన బ్రిట్టనీ లకాయో 7.90 సెం.మీ(3.11 అంగుళాలు) నాలుకతో ప్రపంచంలోనే అతి వెడల్పైన నాలుక కలిగిన మహిళగా గిన్నిస్ రికార్డ్ సొంతం చేసుకున్నారు. ఆమె నాలుక దాదాపు క్రెడిట్ కార్డ్ అంత వెడల్పు ఉంది. గతంలో అమెరికాకే చెందిన ఎమిలీ షెలెంకర్ పేరిట ఈ రికార్డ్ (7.33 సెం.మీ) ఉండేది. బ్రిట్టనీ అటార్నీగా పని చేస్తున్నారు. తాను చిన్నతనంలో ఏదైనా తినడానికి ఆతృతగా నోరు తెరిచినప్పుడు తన నాలుక పెద్దదిగా ఉందని తన కుటుంబం జోక్ చేసేదని బ్రిట్టనీ చెప్పారు. తన బ్రెస్ట్ ఫ్రెండ్ సూచనతో తన నాలుక వెడల్పు కొలుచుకున్నప్పుడు తనది పెద్ద నాలుక అన్న విషయం తెలిసిందన్నారు.

రిజర్వేషన్లకు తూట్లు

పొడిచేందుకే!

యూపీఎస్సీ లేటరల్ ఎంట్రీ నియామకాలపై విపక్షాల ధ్వజం



న్యూఢిల్లీ, ఆగస్టు 18: ప్రభుత్వ అధికార యంత్రాంగంలో ఉన్నత స్థానాల్లో నియామకాలకు లేటరల్ ఎంట్రీ విధానం కింద కేంద్రం యూపీఎస్సీ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించడంపై విపక్షాలు మండిపడ్డాయి. ఇది దొడ్డిదారిన తమ సైద్ధాంతిక మిత్రులను ఉన్నత స్థానాల్లో నియమించుకోవడానికి బీజేపీ పన్నిన కుట్ర అని ధ్వజమెత్తాయి. ఇది పూర్తిగా రాజ్యాంగ ఉల్లంఘనే అని పేర్కొన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ ఈ నిర్ణయంపై అక్టోబర్ 2 నుంచి ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విధానం ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, యువత భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరే మార్గాలను మూసివేస్తుందని అన్నారు. సామాన్యులు గుమస్తాలు, ప్యూన్ ఉద్యోగాలకే పరిమితం అవుతారని అన్నారు. మొత్తం మీద ఈ విధానం ద్వారా దళితులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను, హక్కులను లాక్కోవడానికి కేంద్రం పన్నిన కుట్ర అని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కడమే కాక, రిజర్వేషన్ల విధానంపై రెట్టింపు దాడి చేస్తున్నదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విభాగాల వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కకుండా చేయడానికి మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ పనికి పూనుకున్నదని అన్నారు.

ఇదో క్రూరమైన జోక్: తేజస్వీ

మన దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థ, రాజ్యాంగంపై కేంద్రం క్రూరమైన జోక్ వేసిందని మోదీ ప్రభుత్వాన్ని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. లేటరల్ ఎంట్రీ ద్వారా చేపట్టే 45 పోస్టుల నియామకాన్ని ప్రస్తుత సంప్రదాయ సివిల్ సర్వీస్ పరీక్షల ద్వారా చేపడితే ఇంచుమించు సగం పోస్టులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు దక్కుతాయని అన్నారు. కాగా, 2018లో ఈ విధానం ద్వారా కేంద్రం 63 పోస్టుల నియామకాలు చేపట్టగా, 35 మంది ప్రైవేట్ సెక్టార్‌కు చెందిన వారు. వీరిలో ప్రస్తుతం 57 మంది వివిధ మంత్రిత్వ, ప్రభుత్వ శాఖల్లో ముఖ్యమైన హోదాల్లో ఉన్నారు.

ఐఐటీ-న్యూఢిల్లీకి జీఎస్టీ నోటీసులు

ఇది ట్యాక్స్ టెర్రరిజమే.. మోహన్‌దాస్ పాయ్ విమర్శలు

న్యూఢిల్లీ: ఐఐటీ-న్యూఢిల్లీకి జీఎస్టీ డైరెక్టర్ జనరల్ నోటీసులు జారీ చేశారు. రిసెర్చ్ కోసం 2017 నుంచి 2022 వరకు సంస్థకు వచ్చిన నిధులపై జీఎస్టీ, వడ్డీ, అపరాధ రుసుములు కలిపి రూ.120 కోట్లు చెల్లించాలంటూ నోటీసులో పేర్కొన్నారు. దీనిపై 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. పలు సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీలు, రాష్ట్రాల్లోని పలు ప్రైవేట్ యూనివర్సిటీలు, విద్యాసంస్థలకు కూడా జీఎస్టీ నోటీసులు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. దీనిపై కేంద్ర విద్యా శాఖలోని ఉన్నతాధికారి ఒకరు స్పందిస్తూ సాధారణంగా పరిశోధనల నిమిత్తం విద్యాసంస్థలకు ఇస్తున్న నిధులపై జీఎస్టీ విధించరని, ఇది పొరపాటున జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. పరిశోధనల అభివృద్ధికి విద్యాసంస్థలకు వచ్చే నిధులపై జీఎస్టీ విధించడం పట్ల ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌ఓ మోహన్‌దాస్ పాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ట్యాక్స్ టెర్రరిజమని పేర్కొంటూ దీనికి అంతు లేదా? అని ప్రశ్నించారు.

కర్ణాటకలో ముడా ప్రకంపనలు!

22న సీఎల్పీ భేటీ ఏర్పాటు చేసిన సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు, ఆగస్టు 18: ముడా భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతిచ్చిన నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య ఈనెల 22న సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సీఎంవో ఆదివారం ప్రకటన విడుదల చేసింది. విధాన సౌధ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశం జరుగుతుందని తెలిపింది. భేటీపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే మీడియాతో మాట్లాడుతూ కేసు వాస్తవాలు, అసలు ఏం జరుగుతుందనే దానిపై సీఎం సిద్ధరామయ్య ఎమ్మెల్యేలకు వివరిస్తారని తెలిపారు. ఈ కేసును న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొనే విషయంపై ఒక వ్యూహాన్ని రూపొందిస్తారని పేర్కొన్నారు.


ఆర్నెల్లలో సగం మంది బీజేపీ నేతలు జైలుకు: ప్రియాంక్ ఖర్గే

రాష్ట్రంలోని సగం మంది బీజేపీ నేతలు వచ్చే ఆర్నెల్లలో జైల్లో ఉంటారని లేదా బెయిల్ కోసం పరుగులు పెడతారని ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీజేపీ ప్రభుత్వం అవినీతిపై తమ సర్కార్ లోతుగా దర్యాప్తు చేయనున్నదని అన్నారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. బీజేపీ నేతలపై 35కు పైగా కేసులు నమోదయ్యాయని, 3-4 కేసుల్లో మధ్యంతర నివేదికలు కూడా వచ్చాయని తెలిపారు.

గుండెపోటుతో కోస్ట్ గార్డ్ చీఫ్ మృతి



చెన్నై: ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ ఆదివారం గుండెపోటుతో మరణించారు. అకస్మాత్తుగా అస్వస్థతగా ఉన్నట్లు ఆయన చెప్పడంతో రాజీవ్ గాంధీ జనరల్ హాస్పిటల్‌లో చేర్చగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. కోస్ట్ గార్డ్ నిర్వహించే కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు రాకేశ్ పాల్గొనవలసి ఉంది. రాకేశ్ మరణ వార్త తెలిసిన వెంటనే రాజ్‌నాథ్ దవాఖానకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి జయంత్యుత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నాణెం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజ్‌నాథ్ చెన్నైకి వచ్చారు.



అమెరికాలో కారు ప్రమాదం..

భారత సంతతికి చెందిన ముగ్గురు మృతి

హ్యూస్టన్, ఆగస్టు 18: అమెరికాలోని హ్యూస్టన్‌లో జరిగిన కారు ప్రమాదంలో లియాండర్‌లో నివసించే భారత సంతతికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు మరణించారు. టెక్సాస్‌లోని లాంపసస్ కౌంటీలో బుధవారం వీరు ప్రయాణిస్తున్న కారు మరో కారును ఢీకొన్న ప్రమాదంలో అరవింద్ మణి (45), అతని భార్య ప్రదీప అరవింద్ (40), వారి కుమార్తె ఆండ్రీ అవరింద్ (17) మరణించారు.ప్రమాదం జరిగినప్పుడు 14 ఏండ్ల వారి కుమారుడు అదిర్యన్ వారితో వాహనంలో లేడు. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

యూఎస్‌లో నీటమునిగి ఏపీవాసి మృతి

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ: అమెరికాలో ప్రకాశం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బుచ్చిబాబు (40) మృతి చెందారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన దొద్దాల కోటేశ్వరరావు కుమారుడు బుచ్చిబాబు కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం బీచ్‌కు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు.



పోకిరీల స్టంట్లతో విసుగెత్తి..

బెంగళూరు: బైక్ విన్యాసాలు చేస్తున్న వారిపై విసుగు చెందిన ప్రయాణికులు వారికి బుద్ధి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ నెల 15న బెంగళూరులోని అదకమరనహళ్లి దగ్గర రద్దీగా ఉండే 48 జాతీయ రహదారిపై స్టంట్స్ చేస్తున్న బైకర్లపై ఆగ్రహం చెందిన కొందరు ప్రయాణికులు మూడు బైక్‌లను ఫ్లై ఓవర్ నుంచి కిందకు తోసేశారు. బైక్ విన్యాసాలపై జూన్ వరకు ట్రాఫిక్ పోలీసులు 225 కేసులను నమోదు చేశారు. ఇప్పటివరకు బైక్ విన్యాసాలు చేసిన 9 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. గత రెండేండ్లలో బైక్ విన్యాసాలపై 552 కేసులు నమోదయ్యాయి.




చావునే చీట్ చేస్తారట!

న్యూయార్క్, ఆగస్టు 18: ప్రతి మనిషికి మరణం అనేది కామన్. ఎంత గొప్పగా బతికినా.. ఆరడుగుల జాగాలోనే తనువు చాలించాలి. అలాంటిది.. చావునే చీట్ చేసి బతికేస్తే..! అదీ యవ్వనంగా కనిపించేలా జీవిస్తే..! దాన్ని సుసాధ్యం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు అమెరికా శాస్త్రవేత్తలు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ శాస్త్రవేత్తలు ఆ దిశగా పరిశోధనలు చేపట్టారు. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన న్యూరోనాల్ మూల కణాలతో మెదడు కణజాలాన్ని రిపేర్ చేసి విజయవంతంగా బతికేయొచ్చని అంటున్నారు. ఎలుకల్లో చేసిన పరిశోధనలు విజయవంతం అయ్యాయని చెప్తున్నారు. మెదడు కణజాల మార్పిడి ద్వారా ఆశాజనక ఫలితాలు సాధించామని పరిశోధనలో భాగమైన డాక్టర్ హెబెర్ట్ పేర్కొన్నారు. అయితే, ఈ పరిశోధనపై పలువురు శాస్త్రవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు.




మహారాష్ట్రలో సిమెంట్ వెల్లుల్లి

ముంబై : కాదేదీ నకిలీకి అనర్హం అన్నట్టుగా ఇప్పటికే నకిలీ కోడిగుడ్లు, నకిలీ బియ్యం మార్కెట్లో దర్శనమిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటుండగా, ఇప్పుడు మార్కెట్లను నకిలీ వెల్లుల్లి కూడా ముంచెత్తనుంది. సిమెంట్‌తో తయారు చేసిన నకిలీ వెల్లుల్లి మహారాష్ట్రలోని అకోలాలో దర్శనమివ్వడంతో ఇప్పుడు దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో కన్పిస్తున్న వెల్లిగడ్డను చూస్తే మామూలు వెల్లిగడ్డలానే కన్పించింది. అయితే దాని రేక ఒకటి తీసి చూడగా, లోపలి భాగమంతా సిమెంట్‌తో నిండి గట్టిగా ఉండటం చూసేవారికి షాక్‌ను కలిగిస్తున్నది. వెల్లిగడ్డ పై పొర మాత్రమే అలాగే ఉంచి లోపలంతా సిమెంట్‌ను నింపి మార్కెట్లోకి వదులుతున్నారు. సిమెంట్‌తో చేసిన నకిలీ వెల్లుల్లి అసలు స్టాక్‌లో కలిపి అమ్మేస్తున్నారని అనుమానిస్తున్నారు.




నాలుక రంగుతో వ్యాధుల నిర్ధారణ!

బీజింగ్: నాలుక రంగును చూసి రియల్ టైమ్‌లో 98 శాతం కచ్చితత్వంతో వ్యాధులను గుర్తించే కృత్రిమ మేధ(ఏఐ) కంప్యూటర్ అల్గారిథమ్‌ను సృష్టించినట్టు ఇరాక్, ఆస్ట్రేలియా పరిశోధకులు వెల్లడించారు. అసోసియేట్ ప్రొఫెసర్ అలీ అల్-నజీ అధ్యయనం ప్రకారం మధుమేహ రోగుల నాలుక పసుపు రంగులో, క్యాన్సర్ రోగుల నాలుక తరచూ మందమైన పూతతో ఊదా రంగులో, బ్రెయిన్ స్ట్రోక్ రోగుల్లో ఎరుపు రంగులో ఉంటుంది. నాలుక చిత్రాల ద్వారా రోగమేదో కనిపెట్టడానికి చైనా సంప్రదాయ వైద్యం తనకు స్ఫూర్తిని ఇచ్చిందని నజీ తెలిపారు. 5,200 చిత్రాలను ఉపయోగించి నాలుక రంగును బట్టి వ్యాధిని నిర్ధారించడంలో ఈ ఏఐ నమూనాకు శిక్షణ ఇచ్చారు. చిత్రాలను బట్టి వ్యాధి ఏమిటో ఏఐ సరిగ్గా అంచనా వేసింది.



శరీర వేడిమితో విద్యుత్తు

ఒంటారియో (కెనడా): మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, టీవీలు సహా ఎన్నో రకాల వస్తువులు ఇప్పటికే స్మార్ట్‌గా మారిపోయాయి. సమీప భవిష్యత్తులో దుస్తులు సైతం ఈ జాబితాలో చేరనున్నాయి. సూర్యరశ్మిని ఉపయోగించి మనల్ని వెచ్చగా ఉంచే స్మార్ట్ ఫ్యాబ్రిక్‌తో సూట్‌లు, కోట్‌లు తయారు చేయబోతున్నారు. ఇందుకు అవసరమైన స్మార్ట్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీని వాటర్లూ యూనివర్సిటీ పరిశోధకులు ప్రదర్శించారు. సూర్యరశ్మితో పాటు మన శరీరం నుంచి వెలువడే ఉష్ణాన్ని విద్యుత్తుగా మార్చగలిగేలా రూపొందించిన ఈ ఫ్యాబ్రిక్ ధరించేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. సెన్సర్లను అనుసంధానించుకుని, గుండె లయను, శరీర ఉష్ణోగ్రతను పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫ్యాబ్రిక్‌ను ఉపయోగించుకోవచ్చని పరిశోధకులు తెలిపారు.



అమెరికాలో మళ్లీ కరోనా కలవరం!

వాషింగ్టన్: కొవిడ్ కొత్త వేరియెంట్ 'కేపీ.2' అమెరికాను వణికిస్తున్నది. దవాఖానల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతున్నది. ప్రతి 10 లక్షల మందికి ఒకటి నుంచి నాలుగుకు పెరిగింది. 2022 జూలై తర్వాత, మురుగునీటిలో వైరల్ యాక్టివిటీ (ఆగస్టు 10న 8.82) అత్యధిక స్థాయికి చేరుకుంది. వేసవి సీజన్‌లో కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉందని సీడీసీ గణాంకాలు చెబుతున్నాయి. 'శాంపిల్స్‌లో 100% 'సార్స్-కోవ్-2'ను గుర్తించాం' అని వేస్ట్‌వాటర్ స్కాన్' ప్రోగామ్ డైరెక్టర్ మార్లినె అన్నారు. స్కూళ్ల సెలవులు ముగిసాక, కేసుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎఫ్‌డీఏ అనుమతులు వస్తే, కేపీ.2 వేరియెంట్‌కు కొత్త వ్యాక్సిన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో అందుబాటులో వస్తుందని తెలిసింది.


రుణమాఫీపై భగ్గుమన్న ఆదిలాబాద్


ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

రేవంత్ దిష్టిబొమ్మతో శవయాత్ర

ఆదిలాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): రూ.రెండు లక్షల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండోరోజైన ఆదివారం కూడా రైతుల ఆందోళనలు కొనసాగాయి. జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం కేంద్రంతోపాటు తలమడుగు మండలం రుయ్యాడి, బేల మండలం సిర్సన్న, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లో రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బజార్‌హత్నూర్, రుయ్యాడిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో డప్పుచప్పుళ్ల నడుమ పటాకులు కాలుస్తూ శవయాత్ర నిర్వహించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సిర్సన్న, పిప్పల్‌కోటి గ్రామాల్లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

లోకం పోకడ



మాకు ఓట్లేసి గెలిపించినందుకు మీ'రుణం' ఎప్పటికీ తీర్చుకోలేం రైతన్నా!

రుణమాఫీ కాలే..ఎవరు ఏట్లో దూకాలి?

సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే రుణమాఫీ కాలేదు అంటున్నరని, దీన్ని బట్టి ఎవరు రాజీనామా చేయాలి? ఎవరు ఏటిలో దూకి చావాలో.. ఎవరికి చీము నెత్తురు లేదో.. ఎవరు అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు భూమికి రాయాలో..ఎవరు రాజీనామా చెయ్యాలో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. రాష్ట్రంలో పాక్షికంగా మాత్రమే రుణమాఫీ జరిగింది.. కోదండరెడ్డి, కోదండరాంరెడ్డి, ఆది శ్రీనివాస్ ముగ్గురూ రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని చెప్తున్నదే తానూ చెప్పానని ఆయన స్పష్టం చేశారు. రూ. 31 వేల కోట్లు అని చెప్పి రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారు అని తాను అంటే రంకెలెందుకు వేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ అయి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు రోడ్డెక్కి నిరసనలు తెలియచేస్తున్నారని, సీఎం దిష్టిబొమ్మలు ఎందుకు దహనం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతీ అంశాన్ని రాజకీయకోణంలో చూడటం, తొండి చేసైనా గెలిచామనే వైఖరి ప్రదర్శించడం అవివేకమే అవుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి కండ్లు తెరిచి, రుణమాఫీ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసి రైతులందరికీ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రుణమాఫీ ఎగ్గొట్టాలనే దురాలోచన

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్
- గోడు వెళ్లబోసుకున్న కందగట్ల రైతులు


కందగట్లలో తమ రుణాలు మాఫీ కాలేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి చెబుతున్న రైతులు

సూర్యాపేట, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రైతుల రుణమాఫీ డబ్బు ఎగ్గొట్టాలనే దురాలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం కందగట్ల గ్రామంలో ఓ కార్యకర్త ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే వద్దకు గ్రామానికి చెందిన 25 మంది రైతులు చేరుకొని తమకు రుణమాఫీ కాలేదని గోడు వెళ్లబోసుకున్నారు. బ్యాంకుల్లో తమకు రూ.2 లక్షల లోపు మాత్రమే అప్పు ఉన్నదని, అయినా మూడు విడతల్లోనూ మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీపై సీఎం బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు సేకరించారని, 50 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.49 వేల కోట్ల రుణాలు ఉన్నట్టు బ్యాంకర్లు చెప్పారని తెలిపారు. అన్ని చేయలేమనే భయంతో రూ.39 వేల కోట్లే అంటూ తొలి నుంచి ప్రచారం చేశారని గుర్తు చేశారు. అనంతరం రూ.31 వేల కోట్లు అని క్యాబినెట్‌లో తీర్మానం చేసి తీరా బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు అన్నారని చెప్పారు. బడ్జెట్ సందర్భంగా ఆ రోజు బీఆర్ఎస్ తరపున తాము మాట్లాడే సందర్భంలో రూ.26 వేల కోట్లతో నూరుశాతం మాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించినా వారి నుంచి స్పందన కరువైందని చెప్పారు. తీరా చూస్తే మూడు విడుతలు కలిపి 20 లక్షల మంది రైతులకు రూ.17,900 కోట్లే మాఫీ చేసినట్టు ప్రకటించారని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు అధికారులకు దరఖాస్తు పెట్టుకోమంటున్నారని, అధికారుల వద్దకు వెళ్లి బల్లకింద చెయ్యిపెట్టే పరిస్థితి వస్తదని విమర్శించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

- బూటకపు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆఫీసుపై దాడి సిగ్గుచేటు
- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

కామారెడ్డి, ఆగస్టు 18: రుణమాఫీని పూర్తిగా అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా 30 నుంచి 40 శాతం మంది రైతులకు మించి రుణమాఫీ కాలేదని తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఓట్ల కోసం దేవుళ్లందరిపై ఒట్టేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధికారం వచ్చాక ఆ ఒట్లనే మరిచారని ధ్వజమెత్తారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కార్యాలయంపైకి గూండాలను పంపి దాడులు చేయించారని, దానికి పోలీసులు వత్తాసు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయని ఆరోపించారు. దేశంలో అతి తక్కువకాలంలోనే సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేస్థాయికి దిగజారిన ఏకైక వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు.

రుణమాఫీపై 60వేల ఫిర్యాదులు

- హెల్ప్‌డెస్క్‌ల వద్దకు భారీగా రైతులు
- అధికారుల వద్ద అంతకుమించి ఫిర్యాదులు

హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రుణమాఫీ కాలేదని ఇప్పటివరకు ఏకంగా 60వేల ఫిర్యాదులు వచ్చినట్టుగా తెలిసింది. ఇవి కేవలం హెల్ప్‌లైన్ డెస్క్‌ల వద్ద వచ్చిన ఫిర్యాదులే కావడం గమనార్హం. ఇంకా ఏఈవోలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద వచ్చిన ఫిర్యాదులు అంతకుమించి ఉన్నట్టు తెలిసింది. సర్కారు అడ్డగోలు కోతలకు తోడు చిన్న చిన్న కారణాలు, సాంకేతిక సమస్యలతోనూ అర్హులైన రైతులకు రుణమాఫీ కావడం లేదు. ఆధార్‌లో అక్షరం తప్పుందని, పేరు సరిగ్గా లేదని, రేషన్‌కార్డు లేదని ఇలా అనేక కారణాలతో చాలామంది అర్హులు రుణమాఫీకి దూరమయ్యారు. ఈ రైతులంతా అధికారుల వద్దకు పరుగులు తీసి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇవి ఎంత వరకు పరిష్కారమవుతాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

వజ్జపల్లితండాలో సీఎం దిష్టిబొమ్మ దహనం

రామారెడ్డి, ఆగస్టు 18: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి రైతులను మోసం చేశారని కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జపల్లితండా గిరిజన రైతు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ చేయనందుకు నిరసనగా తండా రైతులు గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆదివారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామంలో చాలా మందికి రుణమాఫీ కాలేదని, రేవంత్‌రెడ్డి.. సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రుణమాఫీ చేయకపోతే బ్యాంకులు, వ్యవసా య కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు.

45% మందికే రుణమాఫీ!

మిగతా 55 శాతం రైతులకు టోకరా • మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 18: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని కేవలం 45 శాతం మంది రైతులకే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రటకనలో విమర్శించారు. మిగతా 55 శాతం మందిని మోసం చేసిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి.. రైతులను నిండా ముంచారని ఆరోపించారు. ప్రభుత్వం మొదట రూ.41 వేల కోట్లు రుణమాఫీకి అవసరమని చెప్పి, క్యాబినెట్ భేటీలో రూ.31 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొని, ఇప్పుడు 8 నెలల తర్వాత కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

త్వరలో అర్హులను పెంచుతారట!

అన్నదాతల ఆందోళనతో పొంగులేటి బుజ్జగింపు ప్రకటన



పరకాల, ఆగస్టు 18 : అధికారంలోకి రాగానే ఒకేసారి 2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రుణరైతులు 70లక్షల మంది ఉంటే.. మూడు విడతల్లో కేవలం 22 లక్షల మందికే రుణమాఫీ వర్తింపజేసి వందశాతం పూర్తిశామని చేతులు దులుపుకొన్నది. కేవలం 40శాతం మందికే రుణమాఫీ వర్తించగా, ఇంకా మాఫీ కాని లక్షలాది రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవడం, ఇటు రైతులు కోపంతో రోడ్డెక్కి నిరసనలకు దిగడంతో వారిని శాంతపరిచేందుకు ఓ మంత్రివర్యులు తాజాగా మరో ప్రకటన చేశారు. త్వరలో రుణమాఫీ కోసం అదనంగా మరో 12 వేల కోట్లు మంజూరు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ భవనంలో అభివృద్ధి పనులు, డిగ్రీ కళాశాలకు ఆదివారం శంకుస్థాపన చేసిన సందర్భంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఇప్పటికే రుణమాఫీకి రూ.19 వేల కోట్లు మంజూరు చేశామని, అదనపు నిధులు త్వరలో మంజూరు చేసి అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అరకొరే రుణమాఫీ అయిందన్న విషయం పొంగులేటి ప్రకటనతో తేటతెల్లమైందని విపక్షాలు స్పష్టంచేస్తున్నాయి.


జనగామ జిల్లా దేవరుప్పుల బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రుణమాఫీలో సర్కారు విఫలం

- రాష్ట్రంలో సగం మందికే రుణమాఫీ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఆగస్టు 18: రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. రుణమాఫీని ఎగ్గొట్టి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హుల్లో కేవలం 47 శాతం మందికే రుణమాఫీ జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్కల్లో రూ.49,500 కోట్ల అప్పులు ఉన్నట్టు తేలగా, క్యాబినెట్ మీటింగ్‌లో రూ.31 వేల కోట్లని తేల్చి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించి, తీరా మూడు విడుతల్లో రూ.17 వేల కోట్లకే రుణమాఫీ చేశారని చెప్పారు. రుణమాఫీ కాని లక్షలాది మంది రైతులు రోడ్డెక్కితే ఈ ప్రభుత్వం ఉంటుందా? అని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం ఎన్నాళ్లుంటుందో చెప్పలేమని తేల్చి చెప్పారు. సమావేశంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

• బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


రుణమాఫీ జరగలేదని ఆందోళన నిర్వహించే అవకాశమున్నదని నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. వారి ఇండ్లకు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. రైతులకు రుణమాఫీ అయ్యేంత వరకు పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు. -ఇందల్వాయి


అగ్రిషోను సందర్శిస్తున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

రుణమాఫీలో కాంగ్రెస్ సర్కారు మోసం

వ్యవసాయ శాఖమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నీలగిరి, ఆగస్టు 18: రుణమాఫీలో కాంగ్రెస్ సర్కారు రైతులను మోసం చేసిందని, అందరికీ అని చెప్పి కొందరికే వర్తింపజేశారని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేయడంలో పోటీలు పడుతున్నాయని విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం అగ్రిషోలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రైతు జీవితం అందరినీ నమ్మడం, మోసపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ వరకు రైతుది అదే కథ అని చెప్పారు. రుణమాఫీ కాని రైతుల నుంచి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, వెంటనే రెండు లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిలింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, అగ్రిషో నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు గోస విను రాహుల్

› మొదటిపేజీ తరువాయి...

మేరకు వారికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. మూడు దశల్లో కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం పూర్తయిందని ప్రకటించడం అబద్ధమని మండిపడ్డారు. రుణమాఫీ పేరిట తెలంగాణలో నయవంచన జరిగిందని ఆధారాలను లేఖలో పొందుపర్చారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను లేఖలో ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల దగాపడ్డ లక్షలాది మంది రైతుల తరఫున లేఖ రాస్తున్నానని వివరించారు. ప్రభుత్వం వైఫల్యాలను కూడా గొప్పగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ చేసిన మోసంతో లక్షలాది మంది రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని చెప్పారు. రైతు రుణమాఫీ విషయంలో వరంగల్ రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రాణప్రతిష్ఠగా స్వీకరించి, దాని అమలును ఏ స్థాయిలో పాతరేసిందో లేఖలో వివరించారు.

> **మూడు దశల్లో కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే 100శాతం పూర్తయిందని ప్రకటించడం వందశాతం అబద్ధం. రుణమాఫీ పేరిట తెలంగాణలో నయవంచన జరిగింది. -కేటీఆర్**

రూ.49,500 కోట్లు ఎక్కడ?

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్ష రుణమాఫీ చేస్తేనే రూ.17 వేల కోట్లు ఖర్చయిందని, 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులయ్యారని కేటీఆర్ వివరించారు. కాంగ్రెస్ చెబుతున్నట్టు 2 లక్షల రుణమాఫీ పూర్తయితే లబ్ధిదారుల సంఖ్య, రుణమాఫీ మొత్తం రెట్టింపు కావాలని, కేవలం రూ.17,900కోట్లతో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనమని అభివర్ణించారు. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి నామమాత్రంగా చేయడం కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు నిలువుటద్దమని నిప్పులు చెరిగారు. లక్ష రుణమాఫీ కన్నా 2 లక్షల రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య 14 లక్షలు తగ్గడం మాఫీ విఫలమైందనేందుకు సంకేతమని చెప్పారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ రూ. 2 లక్షల రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిందని గతంలో రేవంత్‌రెడ్డి స్వయంగా రుణమాఫీకి రూ.40 వేల కోట్ల వరకు అవసరమవుతాయని పేర్కొన్న విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. 'కడుపు కట్టుకుంటే ఇది పెద్ద విషయం కాదు' అని ఇంటర్వ్యూల్లో రేవంత్‌రెడ్డి చెప్పిన గొప్పలను ఏకరువు పెట్టారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రుణమాఫీని రూ.31 వేల కోట్లకు కుదించారని, చివరికి అందులోనూ కోతపెట్టి బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లే కేటాయించారని వివరించారు. మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో సరిపెట్టారని విమర్శించారు. రూ. 49,500 కోట్లని చెప్పి మూడింతలు తగ్గి రూ. 17,933కోట్లతో చివరికి 40 శాతం కూడా రుణమాఫీ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి లక్షలాది మంది రైతులను ముంచారని మండిపడ్డారు. కడుపుమండిన రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

> **రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ చేసిన మోసంపై లక్షలాది మంది రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నరు. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై ఆగ్రహంతో ఊగిపోతున్నరు. దగాపడ్డ రైతుల తరఫున నేను ఈ లేఖ రాస్తున్నా.. -కేటీఆర్**

కాంగ్రెస్ మోసంతో రైతుల ఆక్రందన

కాంగ్రెస్ చేసిన మోసానికి రైతాంగం ఆందోళన బాటను ఎంచుకున్నదని కేటీఆర్ ఉదహరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్‌లో రుణమాఫీ కాని అన్నదాతలు రోడ్డెక్కారని, మంచిర్యాలలో రుణమాఫీ కాలేదన్న మనస్తాపంతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. కరీంనగర్ రాజీవ్ రహదారిపై అన్నదాతలు రాస్తారోకో చేసి 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారని వివరించారు. మొలంగూరు ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించి నిరసన తెలిపారని, రుణమాఫీ కాని రైతులు వనపర్తిలో రైతు వేదిక సాక్షిగా 'అబద్ధాల ముఖ్యమంత్రికి పాలించే హక్కు లేదు' అని నిప్పులు చెరుగుతున్న వైనాన్ని లేఖలో కేటీఆర్ ప్రస్తావించారు. జగిత్యాల సహా రాష్ట్రమంతా రైతన్నల నిరసనతో అట్టుడుకుతున్నదని ఉదహరించారు. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై రైతులోకం ఆగ్రహంతో ఊగిపోతున్నదని చెప్పారు.

సర్కార్ వైఖరి మారేదాకా పోరాటం ఆగదు

అప్పుల బాధ భరించలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగోలు ఆంక్షలు, అర్థంలేని షరతులతో రుణమాఫీని రేవంత్ సర్కార్ ప్రహసనంగా మార్చిందని మండిపడ్డారు. రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నదని చెప్పారు. తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్‌కు కేవలం వారం వ్యవధిలోనే 1,20,000కు పైగా ఫిర్యాదులు అందిన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ సర్కారు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ దిగొచ్చేదాకా తమ పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

బస్సుల సంఖ్య ఎందుకు పెంచరు?


సర్కార్‌కు కేటీఆర్ సూటి ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకొని బస్సుల సంఖ్యను ఎందుకు పెంచడం లేదని సర్కార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 50 మంది ఎక్కాల్సిన బస్సులో 170 మంది ఎక్కినందుకు నిర్మల్ డిపో బస్సు రెండు టైర్లు ఊడిపోయి ప్రయాణికులు పడ్డ అవస్థలను ఆదివారం ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు. 'అదృష్టవశాత్తు ప్రయాణికులెవరికీ ఏమీ కాలేదు.. జరగరానిది జరిగితే బాధ్యులెవరు?' అంటూ ఆవేదన చెందారు.

నేడు ఆడబిడ్డలకు అందుబాటులో కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): సోమవారం ఉదయం 11 గంటల నుంచి తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులకు కేటీఆర్ అందుబాటులో ఉండనున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆడబిడ్డల సమక్షంలో వేడుకలు నిర్వహించుకోనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.


ఎం గోపీకృష్ణ తీసిన సచివాలయ ఫొటో


బందగీ గోపి తీసిన ఫొటో


గడసంతల శ్రీనివాస్ తీసిన ఫొటో


సూర్య శ్రీధర్ తీసిన ఫొటో

నమస్తే తెలంగాణ, టీటీ ఫొటో జర్నలిస్టులకు అవార్డులు

న్యూస్ ఫొటో కాంపిటీషన్ -2024 విజేతల ప్రకటన

హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం నిర్వహించిన 'రాష్ట్ర స్థాయి న్యూస్ ఫొటో కాంపిటీషన్ -2024'లో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఫొటో జర్నలిస్టులకు అవార్డులు వరించాయి. మొత్తం 28 మందికి అవార్డులు ప్రకటించగా, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే నుంచి నలుగురు ఎంపికయ్యారు. తెలంగాణ ఫొటోజర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి మాట్లాడుతూ.. 31 జిల్లాల నుంచి 100 మంది ఫొటోజర్నలిస్టులు తమ ఎంట్రీలను పంపారని చెప్పారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, సీఎం సీపీఆర్వో బీ అయోధ్యరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ సుశీల్‌రావు, సీనియర్ ఫొటోజర్నలిస్ట్ హెచ్ సతీశ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, ఉత్తమ వార్త చిత్రాలను ఎంపిక చేశారని పేర్కొన్నారు. ప్రథమ బహుమతికి మహిమల భాస్కర్‌రెడ్డి, వెలుగు (సిద్దిపేట), ద్వితీయ బహుమతికి పీ సురేంద్ర, డెక్కన్ క్రానికల్ (హైదరాబాద్), తృతీయ బహుమతికి ఏ తరుణ్, టైమ్స్ అఫ్ ఇండియా (హైదరాబాద్) ఎంపికయ్యారని తెలిపారు. 25 మందికి కన్సోలేషన్ బహుమతులు ప్రకటించినట్టు చెప్పారు. వీరిలో నమస్తే తెలంగాణ నుంచి గడసంతల శ్రీనివాస్ (హైదరాబాద్), గోపి కృష్ణ (హైదరాబాద్), బందగీ గోపి (మహబూబ్‌నగర్), సూర్య శ్రీధర్, తెలంగాణటుడే (హైదరాబాద్) ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఛాయా చిత్ర ప్రదర్శనను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ హాజరవుతారని వెల్లడించారు.

బడులకు వెయ్యికోట్ల బకాయి

- **సివిల్ వర్క్స్ బిల్లులే 650 కోట్లు**
- **ఏదో ఒకటి తేల్చాలన్న విద్యాశాఖ**

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు కేసీఆర్ సర్కారు చేపట్టిన 'మన ఊరు – మన బడి' ప్రశ్నార్థకమైంది. ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారా? లేక ఆపేస్తారా? అన్నది ఇప్పటికీ తేలడం లేదు. దీనిపై ఏదో ఒకటి తేల్చాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. పథకం కొనసాగింపు, పెండింగ్ బిల్లులు క్లియరెన్స్‌పై స్పష్టతనివ్వాలని లేఖలో ప్రస్తావించినట్టు తెలిసింది. మొత్తం 12 అంశాలతో బడులను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాన్ని మూడు విడతలుగా అమలుకు గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేసింది. 2022 మార్చి 8న వనపర్తిలో కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి విడతలో 9,123 స్కూళ్లను ఎంపిక చేసింది. వీటి అభివృద్ధికి రూ.3,497 కోట్లు అవసరమవుతాయని అప్పట్లో తేల్చారు. 9,123 బడుల్లో పనులు సైతం చేపట్టారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు చేపట్టిన పనులకు సంబంధించి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రూ. 650 కోట్లు సివిల్‌వర్క్స్‌కు సంబంధించినవే! మరో రూ. 350 కోట్లు ఇతర పనులవి ఉన్నాయి. గత డిసెంబర్ నుంచి రూపాయి కూడా విడుదల కాలేదు.

సబ్ కమిటీల పాలన

మొదటిపేజీ తరువాయి...

శాఖాపరమైన కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ, కమిటీల సమావేశాలు ఏర్పాటు చేయటానికి జీఏడీ అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. పోనీ ఈ కమిటీలతో ఇప్పటివరకు ఒక్క సమస్యకైనా శాశ్వత పరిష్కారం దొరికిందా? అని ప్రశ్నిస్తే లేదనే సమాధానమే వస్తున్నది. దీంతో క్యాబినెట్ సబ్‌కమిటీల చిత్తశుద్ధిపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

క్యాబినెట్ నిర్ణయాలు అమలయ్యేదెప్పుడు?

సాధారణంగా క్యాబినెట్ సమావేశంలో ఏదైనా నిర్ణయం తీసుకుంటే వెంటనే సంబంధిత శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు దాని అమలుపై దృష్టిసారిస్తారు. విధివిధానాలు రూపొందించుకొని, సీఎం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా అమలు చేస్తుంటారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల అమలుపైనా మళ్లీ సబ్ కమిటీ వేస్తున్నారు. దీంతో ముందుగా అధికారులు వివరాలు సేకరించి, సదరు మంత్రితో చర్చించి, ఆ అంశాలను క్యాబినెట్ సబ్‌కమిటీ ముందు ఉంచాల్సి వస్తున్నది. కమిటీ కొన్నిసార్లు సమావేశమై చర్చించి, నిర్ణయం తీసుకొని, సీఎం వద్దకు ఫైల్ పంపుతున్నది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావటానికి ఎంత సమయం పడుతుందో తెలియని పరిస్థితి. 9 నెలల కిందట ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో వేసిన కమిటీలే ఇప్పటికీ కొనసాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చిన్న చిన్న అంశాలపై కూడా ప్రభుత్వానికి తుది నివేదిక ఇచ్చిన దాఖలాలు కనిపించటం లేదు. ఉదాహరణకు 2008 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులకు కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇవ్వాలని ఫిబ్రవరిలో నిర్ణయం తీసుకున్నారు. ఏపీలో ఇప్పటికే అమలవుతున్న విధానాన్ని పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేయాలని సబ్‌కమిటీని ఏర్పాటుచేశారు. ఇప్పటికే విద్యాశాఖ వద్ద సంపూర్ణంగా వివరాలు ఉన్నాయి. వాటిని అధ్యయనం చేసి నెల రోజుల్లో ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉన్నా.. 6 నెలలుగా కాలయాపన చేస్తూనే ఉన్నారు.

సీఎం సబ్‌కమిటీ ఉన్నట్టేనా?

విద్యారంగాన్ని పటిష్టం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సబ్‌కమిటీ ఏర్పాటైంది. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క ఇందులో సభ్యులుగా ఉన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెప్పారు. కానీ ఈ కమిటీ ఏం పనిచేస్తున్నదో తెలియని పరిస్థితి.

ప్రజాపాలన కమిటీ పనిచేస్తున్నదా?

ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో ఐదు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. వీటి అమలుకు ఈ ఏడాది జనవరి 8న క్యాబినెట్ సబ్‌కమిటీని నియమించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇందులో సభ్యులుగా ఉన్నారు. చివరిసారిగా ఫిబ్రవరి 1న సీఎంతో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత కమిటీ ఊసే లేదు. కమిటీ కొనసాగుతున్నదా? అన్నదానిపైనా స్పష్టత లేదు. ఒక వేళ ఉంటే ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులు, అర్హులందరికీ అందుతున్నాయా? లేవా? కొత్త దరఖాస్తుల ప్రక్రియ వంటి అంశాలపై ఎందుకు రివ్యూ చేయడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వరుస భేటీలు.. కనిపించని ఫలితాలు

జీవో 317, జీవో 46 అమలుపై మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో ఒక కమిటీని ఫిబ్రవరిలో నియమించింది. కమిటీ ఇప్పటివరకు అనేకసార్లు భేటీ అయ్యింది. చర్చల మీద చర్చలు జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్క నిర్ణయం కూడా వెలువడలేదు. దీంతో ఉద్యోగుల ఉసూరుమంటున్నారు.

కోర్టు అడుగుతున్నా సాగదీతే..

డీఎస్సీ 2008లో నష్టపోయిన అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. త్వరలో ఉద్యోగాల్లో చేరబోతున్నామని అభ్యర్థులు భావించగా ప్రభుత్వం భిన్నంగా స్పందించింది. జీవో 317, 46పై ఏర్పాటుచేసిన క్యాబినెట్ సబ్‌కమిటీకే విధివిధానాల ఖరారు బాధ్యత అప్పగించింది. అప్పటి నుంచి విద్యాశాఖ అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉన్నా.. సబ్‌కమిటీ సమావేశాలు జరుగుతున్నాయే తప్ప ఈ విషయాన్ని తేల్చటం లేదు. మరోవైపు ఉద్యోగాలు ఇచ్చే అంశం ఏమైందని పదేపదే న్యాయస్థానం అడ్వకేట్ జనరల్‌ను అడుగుతున్నా, సాగదీత ధోరణి కనిపిస్తున్నది. చివరగా ఈనెల 27లోగా ప్రక్రియ పూర్తిచేస్తామని ఏజీ గడువు తీసుకున్నారు. ఆలోగానైనా పూర్తి చేస్తుందా? అని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఈ సీజన్‌కు భరోసా ఎగ్గొట్టేందుకేనా?

రైతు భరోసా అమలు కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సబ్ కమిటీని జూలైలో ప్రభుత్వం నియమించింది. 15 రోజుల్లోగా ఆ సబ్‌కమిటీ నివేదిక ఇస్తుందని సర్కారు తెలిపింది. ఈ నివేదికను అసెంబ్లీలో పెట్టి చర్చించి, అమలు చేస్తామని సర్కారు పెద్దలు ప్రకటించారు. మంత్రులు కూడా హడావుడిగా జిల్లాల పర్యటనలు, వరుస సమావేశాలు నిర్వహించారు. ఆ తర్వాత దాని ఊసే లేకపోయింది. రైతు రుణమాఫీని ప్రచారం చేసుకొని, ఈ సీజన్ రైతుభరోసా వేయకుండా ఎగ్గొట్టింది.

ఇబ్బడిముబ్బడిగా కమిటీలు

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. ఇందులో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. ఈ కమిటీ సమావేశాల ఊసే లేదు. తెలంగాణ అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం తుదిరూపుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ వివిధ వర్గాల వారితో చర్చలు జరుపుతుందని అప్పట్లో చెప్పారు. కానీ ఇప్పటివరకు తేల్చిందేమీ లేదు. ఇలా ప్రభుత్వం వేసిన కొన్ని సబ్‌కమిటీలు అసలు ఊసులోనే లేవు. కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి, జల వనరుల రక్షణకు.. ఇలా ఇబ్బడిముబ్బడిగా సబ్‌కమిటీలను నియమించింది.

మంత్రులపై పనిభారం.. దొరకని సమయం

కొన్ని కమిటీలు సమాశాలు నిర్వహిస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఇలా క్యాబినెట్ సబ్ కమిటీల పేరుతో కాలయాపన తప్ప... సమస్య పరిష్కారం కావటం లేదని అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. 'సమగ్రంగా సంప్రదింపులు జరుపుతున్నాం' అనే వంకతో నెలలపాటు సమయం వృథా చేస్తున్నారని మండిపడుతున్నారు. ఒక్కో మంత్రికి నాలుగైదు కమిటీల్లో చోటు కల్పించటంతో.. వారికి కూడా పనిఒత్తిడి పెరిగిందని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కమిటీలను వేగవంతం చేసి తుది నివేదికలు తెప్పించుకోవాలని కోరుతున్నారు. భవిష్యత్తులో అత్యంత కీలకమైన అంశాలపై తప్ప మంత్రులతో కమిటీలు వేయొద్దని, ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలని పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- **పార్టీలో తగిన గుర్తింపు లేదని మనస్తాపం**
- **పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న భగవాన్**
- **మిర్యాలగూడ పట్టణంలో ఘటన**

మిర్యాలగూడ, ఆగస్టు 18: పార్టీలో తనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని కాంగ్రెస్ కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకొని శనివారం రాత్రి నిప్పంటించుకున్నాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ పరిధిలోని హైదలాపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన భగవాన్ 4ఏండ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నాడు. కాలనీలో ఆదివారం గుడి పండుగ ఉండగా.. ఫ్లెక్సీలో తన ఫొటో లేదని మనస్తాపం చెందాడు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని, తనకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదనతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. భగవాన్ ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడని, అతడి కుటుంబాన్ని కాంగ్రెస్ ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు కోరారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. భగవాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


సుచిత్రలో లలితా జ్యువెలర్స్ బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, లలితా జ్యువెల్లర్స్ యజమాని ఎం కిరణ్‌కుమార్‌తో పాటు తదితరులు

'సుచిత్ర'లో లలితా జ్యువెలర్స్ బ్రాంచ్ ప్రారంభం

కుత్బుల్లాపూర్,ఆగస్టు18: సుచిత్రలో లలితా జ్యువెల్లర్స్ 56వ బ్రాంచ్ అట్టహాసంగా ప్రారంభమైంది. లలితా జ్యువెల్లర్స్ ఎండీ ఎం.కిరణ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కూన శ్రీశైలం గౌడ్, స్థానిక కార్పొరేటర్ చెరకుపల్లి తారాచంద్రారెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్, ఆయా పార్టీల శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బంగారు భవిష్యత్‌కు నమ్మకమైన పెట్టుబడి బంగారమని తెలిపారు. జ్యువెల్లరీ రంగంలో అతితక్కువ కాలంలో లలిత జ్యువెలర్స్ విశేష ఆదరణ పొందిందని యాజమాన్యాన్ని అభినందించారు.

హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియుల పాత్ర ఎనలేనిది

- **కాంగ్రెస్‌కు అధికారంలోకి రావడంలో బోసురాజు క్రియాశీల పాత్ర**
- **రాబోయే ఎన్నికల్లో క్షత్రియులకు టికెట్లు ఇస్తాం**
- **క్షత్రియ సేవా సమితి అభినందన సభలో సీఎం రేవంత్‌రెడ్డి**


గచ్చిబౌలి స్టేడియంలో అల్లూరి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సర్వతోముఖాభివృద్ధిలో క్షత్రియుల పాత్ర ఎనలేనిదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాజులకు శ్రమ, పట్టుదల ఎక్కువని, వారు ఏ రంగంలోనైనా రాణిస్తారని కొనియాడారు. సినీ రంగంలో కృష్ణంరాజు ఉన్నత స్థాయికి ఎదిగితే.. ఇప్పుడు ఆయన వారసుడు ప్రభాస్ హాలీవుడ్‌తో పోటీపడేలా రాణిస్తున్నారని ఉదహరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో బోసురాజు అత్యంత క్రియాశీల పాత్ర పోషించారని చెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకపోయినా పార్టీ విజయం కోసం బోసురాజు కష్టపడి పనిచేశారని, అందుకే ఆయనకు రాహుల్ గాంధీ మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో క్షత్రియులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్షత్రియుల తరఫున శ్రీనివాసరాజును తమ ప్రభుత్వంలో సలహాదారుగా నియమించామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కో–చైర్మన్‌గా శ్రీనిరాజును నియమించామని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని క్షత్రియులకు పిలుపునిచ్చారు. క్షత్రియభవన్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడంతో పాటు అవసరమైన సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక మంత్రి బోసురాజు, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో వాదనల కోసమే

- **అభిషేక్ మను సింఘ్వీకి రాజ్యసభ సీటు**

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) రాష్ట్ర విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై చట్టసభలతోపాటు సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించేందుకే రాజ్యాంగ, న్యాయ కోవిదుడు అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ.. అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలన్న ప్రతిపాదనను వెంటనే ఆమోదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టం అమలులో రాజ్యాంగ, న్యాయపరమైన అనేక చిక్కులు, అవాంతరాలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. వీటిపై చట్టసభలు, న్యాయస్థానాల్లో అభిషేక్ మను సింఘ్వీ గట్టిగా వాదిస్తారని చెప్పారు. మాజీ ఎంపీ కేకే పెద్దమనసుతో క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించారని సీఎం రేవంత్ కొనియాడారు. సింఘ్వీ సోమవారం నామినేషన్ వేస్తారని చెప్పారు. రైతు కృతజ్ఞత సభ, సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణపై ఢిల్లీ పెద్దలతో మాట్లాడి తేదీలు వెల్లడిస్తామన్నారు.


జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో కొత్త షోరూమ్‌ను ప్రారంభిస్తున్న చాగంటి కోటేశ్వర్‌రావు

జూబ్లీహిల్స్‌లో 'కాంచీపురం వరమహాలక్ష్మి' కొత్త షోరూమ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 36లో కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ కొత్త షోరూమ్‌ను చాగంటి కోటేశ్వర్‌రావు ఆదివారం ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా సిల్క్ వస్త్రాలకు మహిళల నుంచి మంచి ఆదరణ ఉందని, వారు మెచ్చే వివిధ డిజైన్ల బనారస్, ఉప్పాడ, ధర్మవరం చీరలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఆలయ ఈవో

- **రూ.20 వేలతో పట్టుబడిన భిక్షమాచారి**



కొత్తగూడ/మరిపెడ, ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో భిక్షమాచారి ఆదివారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఆలయ పరిధిలో పూజా సామగ్రి దుకాణం నిర్వహించే నల్లపు సాంబయ్య నుంచి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో విసుగుచెందిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం రూ.20 వేలు ఈవోకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని భిక్షామాచారి ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.70 వేల నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారం లభ్యమైనట్టు ఏసీబీ సీఐ ఎస్ రాజు తెలిపారు.

కొడంగల్ లిఫ్ట్ 'మేఘా' చేతికే!

మొదటిపేజీ తరువాయి...

తెలిసిందే. ఈ పనులనూ మేఘా చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ అదే సంస్థకు భారీ ప్రాజెక్టును కట్టబెడుతున్నారనే వార్తలపై ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నిధులను వృథా చేయబోమంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో అందుకు భిన్నంగా ముందుకుసాగుతుండటంపై ఇరిగేషన్ అధికారులు సైతం మండిపడుతున్నారు. అందుకు తాజాగా చేపట్టబోతున్న నారాయణపేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమే (ఎన్‌కేఎల్‌ఐఎస్) ఉదాహరణగా నిలుస్తున్నదని వివరిస్తున్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలకు సాగునీటిని ఇచ్చే ప్రతిపాదనలున్నా కూడా వాటిని పక్కనపెట్టి రూ.4,350కోట్ల వ్యయంతో ఎన్‌కేఎల్‌ఐఎస్‌ను చేపట్టడంపై ఇరిగేషన్ అధికారులు, సాగునీటిరంగ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సొంత ఇమేజ్ కోసమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును చేపడుతూ రూ.వేల కోట్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఇంజినీర్లు, సాగునీటి రంగ నిపుణులు విమర్శిస్తున్నారు.

2 ప్యాకేజీలుగా పనులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలకు ఎన్‌కేఎల్‌ఐఎస్ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. మొత్తంగా 2 ప్యాకేజీలుగా లిఫ్ట్ పనులు చేపట్టాలని నిర్ణయించింది. మొదటి ప్యాకేజీలో పంచ్‌దేవ్‌పహాడ్ పంపింగ్ స్టేషన్, భూత్పూర్ పంపింగ్ స్టేషన్లతోపాటు, ఊట్కూరు, జయమ్మ, కానుకుర్తితోపాటు పలు చెరువుల అభివృద్ధి చేపట్టనున్నారు. అందుకు రూ.1,134.62 కోట్లు అవుతాయని అంచనా వేశారు. రెండో ప్యాకేజీలో ఊట్కూరు, కానుకుర్తి పంపింగ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. అందుకు రూ.1,126.23 కోట్లు వ్యయాన్ని అంచనా వేశారు. మొత్తంగా పంపింగ్ సిస్టమ్ కోసమే రూ.2,260.85 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇవిగాక 2వ దశలో జాజాపూర్, దౌల్తాబాద్, బొమ్రాస్‌పేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హుస్నాబాద్, కొడంగల్.. మొత్తంగా 7 చెరువుల నీటి నిల్వసామర్థ్యాన్ని పెంచడంతోపాటు, గ్రావిటీ కాల్వలు, ఆయకట్టుకు నీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం తదితర వాటికి మరో రూ.1,404.50 కోట్లు వ్యయమవుతుందని ఇరిగేషన్ శాఖ అంచనా వేసింది. అయితే ఇటీవలే రెండు ప్యాకేజీల పనులకు టెండర్లను ఆహ్వానించింది. 24వ తేదీతో తుది గడువుగా నిర్ణయించింది. ఈ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.3 వేల ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

'పాలమూరు'లో ప్రతిపాదలున్నా..

కొడంగల్–నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందివ్వాలని నిర్ణయించారు. మక్తల్ నియోజకవర్గంలో ఊట్కూరు, మక్తల్ మండలాల పరిధిలో 25,783 ఎకరాలు, నారాయణపేట నియోజకవర్గంలో నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20,472 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, మద్దూరు, కోస్గి, దౌల్తాబాద్, బొమ్రాస్‌పేట మండలాల్లో 53,745 ఎకరాలను ప్రతిపాదించారు. దాంతో పాటు 0.38 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటిని అందివ్వాలని నిర్ణయించారు. అయితే వాస్తవానికి ఆయా ప్రాంతాలకు ఇప్పటికే చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద సాగునీరివ్వాలని నిర్ణయించారు. ఆ ప్రాజెక్టులో కీలకమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీరిచ్చేందుకు ప్రతిపాదలున్నాయి. ప్రధాన కాల్వల తవ్వకానికి సైతం గత ప్రభుత్వం దాదాపు రూ.5,600 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను కూడా పిలిచింది. అదీగాక ఉద్దండాపూర్ కెనాల్‌పై అదనంగా పలుచోట్ల చిన్న చిన్న లిఫ్ట్‌లను ఏర్పాటు చేసి కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాల్లోని ఎత్తయిన ప్రాంతాలకు సైతం నీటిని అందించాలని గతంలోని నిర్ణయించింది. అయినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ టెండర్లను రద్దు చేసింది. ప్రతిపాదనలన్నీ పక్కన పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్‌ను చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి. నిధులు వృథా తప్ప మరేమీ లేదని పెదవి విరుస్తున్నారు. ఈ స్కీమ్ వల్ల అటు రాజీవ్‌భీమా ఆయకట్టుకు సైతం తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఇంజినీర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ప్రతిపాదనలు మానుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవే నిధులను ఉద్దండాపూర్ రిజర్వాయర్ కాల్వకు వెచ్చిస్తే లక్షల ఎకరాలకు నీరందే అవకాశముంటుందని చెప్తున్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత ఇమేజ్ కోసమే పాకులాడుతూ ఎన్‌కేఎల్‌ఐఎస్ చేపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ కంపెనీకి అప్పగించేందుకే ప్రెషర్ మెయిన్స్!

నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్‌ఐఎస్) పనులకు గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో అప్పుడున్న భూగర్భ సొరంగాల స్థానంలో ఇప్పుడు ప్రెషర్‌మెయిన్స్ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. అయితే అందుకు ప్రధాన కారణం మేఘా కంపెనీకి ప్రాజెక్టు పనులను అప్పగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసిపోతున్నది. ఈ నేపథ్యంలోనే కొడంగల్ లిఫ్ట్ పనులు మేఘా చేతికే వెళ్లనున్నాయని ఇరిగేషన్‌శాఖ అధికారులు ఇప్పటికే నిర్ణయానికి వచ్చారు. అదే విషయాన్ని ఘంటాపథంగా చెప్తున్నారు. వాస్తవంగా భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి సొరంగాల ద్వారా తరలించాల్సి ఉన్నది. దాదాపు 38 కిలోమీటర్ల పొడవు సొరంగాలను తవ్వాలి. ప్రస్తుతం భూగర్భ సొరంగాలకు బదులుగా ప్రెషర్ మెయిన్స్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. భూసేకరణ, జియోలజికల్ అధ్యయనాలు, సొరంగాలకు అడ్డుగా ఉండే రాళ్లు, బండల కటింగ్‌కు ఎక్కువ టైమ్ పడుతుందని ప్రభుత్వం చెప్తున్నది. రైతులకు సాగునీటిని సత్వరమే అందించేందుకు ప్రెషర్‌మెయిన్ నిర్మించాలని నిర్ణయించినట్టు తెలుపుతున్నది. కానీ, ప్రభుత్వ వాదనలన్నీ ఒట్టివేనని ఇంజినీర్ నిపుణులు తేల్చి చెప్తున్నారు. ప్రెషర్‌మెయిన్స్‌తో ప్రాజెక్టును చేపట్టినా దాదాపు 3 ఏండ్లు పడుతుందని ఇంజినీర్లు వివరిస్తున్నారు. మోటర్లు రావడానికి, పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటర్ల బిగింపునకు దాదాపు రెండున్నరేండ్లు పడుతుందని, ఆ సమయంలో ఇప్పుడున్న సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా భూగర్భ సొరంగాల తవ్వకాన్ని పూర్తి చేయవచ్చని వెల్లడిస్తున్నారు. సొరంగాల నిర్మాణం చేపడితే దీర్ఘకాలం పాటు ఎలాంటి మెయింటెనెన్స్ ఉండబోదని, ప్రెషర్స్‌మెయిన్స్‌తో అదనంగా మెయింటెనెన్స్ భారం కూడా పడుతుందని చెప్తున్నారు. సొరంగాల ద్వారా పంపింగ్ సిస్టమ్ పూర్తిచేయడానికి రూ.963.89 కోట్లు మాత్రమే అవసరమవుతాయని, ప్రెషర్‌మెయిన్స్ ద్వారా ఆ ఖర్చు రూ.1,016.57 కోట్లకు పెరుగుతుందని తెలిపారు. మొత్తంగా ప్రెషర్ మెయిన్స్ ద్వారా లిఫ్ట్‌ను చేపడితే ప్రాజెక్టు వ్యయం రూ.60 కోట్లు అదనంగా పెరగనున్నది. ఏటా మెయింటెనెన్స్ చార్జీలు అదనపు భారం కానున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం వేగవంతంగా ప్రాజెక్టును పూర్తి చేయాలనే సాకుతో ప్రెషర్‌మెయిన్స్‌ను చేపడుతున్నదని ఇంజినీర్లు విమర్శిస్తున్నారు. అసలు వాస్తవం మాత్రం ప్రాజెక్టును మేఘాకు అప్పగించేందుకేనని స్పష్టంచేస్తున్నారు. కాంట్రాక్టర్లను బతికించడానికే తప్ప మరేమీ లేదని ఇంజినీర్ నిపుణులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు.

అమాత్యా.. ఆలకించరా?

▶ మొదటిపేజీ తరువాయి...

రంగాపూర్ గ్రామాల్లోని అనేక మంది రైతులకు రుణ మాఫీ కాక ఆందోళనకు గురవుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా సరైన సమాధానం లభించడంలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తచేస్తున్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి జిల్లాలో మొదటి విడుతలో 29,724 మంది రైతులకు రూ. 149.42కోట్లు, రెండో దఫా 13,238 మందికి రూ. 122.43 కోట్లు, మూడో విడుతలో 8,268 మందికి రూ. 101.75కోట్లు, మొత్తంగా జిల్లావ్యాప్తంగా 51,393 మంది రైతులకు రూ. 375.58 కోట్ల రుణమాఫీ చేశారు. మాఫీ ప్రక్రియ పూర్తయిందని స్వయంగా సీఎం ప్రకటించడంతో రుణ మాఫీ కానీ దాదాపు 60శాతం మంది పరిస్థితి ఏమిటని రైతులు మదనపడుతున్నారు. రొంపికుంటకు చెందిన 300మంది రైతులు పెద్దపల్లిలోని ఇండియన్ బ్యాంక్, సబ్బితంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కమాన్‌పూర్‌లోని కేడీసీసీ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. ఇందులో 40 శాతం మంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ కాగా లక్షలోపు రుణాలు ఇంకా మాఫీకి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ వారిని పలకరించగా వారి మనోభావాలను ఇలా వెల్లడించారు.

మంత్రి దుద్దిళ్ల ఇలాకా.. రైతుకు ధోకా!



రొంపికుంట గ్రామ పంచాయతీ వద్ద రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



AD-TGAGRL · Messages · Now

రైతు సంక్షేమానికి, వికాసానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం "రైతు ఋణ మాఫీ - 2024" క్రింద శ్రీ JANGILI SRAV గారికి,రూ18056/- బ్యాంక్ ఖాతా నంబర్ XXXXXX0267 IOB Sabitham బ్రాంచ్ యందు తేది 18.07.2024 న జమ చేయబడినది. వివరాలకు మీ బ్యాంక్ అధికారిని/మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు.

మీ ఈ ఆనందంలో పాలుపంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.

మీ ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి.

జంగిలి శ్రావణ్‌కుమార్ అనే రైతుకు రుణమాఫీ జరిగినట్టు వచ్చిన మెసేజ్

సీఎం రాజీనామా చేయాలి



రెండు గడువులు దాటినా రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ జరగలేదు. రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా? సంపూర్ణంగా రైతులకు రుణమాఫీ చేస్తారా? అనే విషయాన్ని తేల్చుకోవాలి. మా గ్రామంలో 150 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ చేయని పక్షంలో ఆందోళనకు దిగుతాం.

-కొయ్యడ రవి, రొంపికుంట, కమాన్‌పూర్

మాఫీ డబ్బులు జమ కాలేదు..



ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.18వేల లోన్ తీసుకున్నా. తొలివిడుత రుణమాఫీ జాబితాలో పేరు వచ్చింది. బ్యాంకులో అడిగితే అసలు మాఫీ అయ్యిందని, వడ్డీ కట్టి, వన్ బీ పహణీ, ఆధార్ జిరాక్స్ ఇవ్వమన్నారు.వడ్డీ రూ.1300 కట్టి, ధృవీకరణ పత్రాలు ఇచ్చిన. నెల అవుతున్న ఇంకా ప్రభుత్వం నుంచి ఖాతాకు డబ్బులు రాలేదు.

- జంగిలి శ్రావణ్‌కుమార్, రొంపికుంట

40 శాతం మందికే మాఫీ..



మా కమాన్‌పూర్ మండలంలో 40శాతం మంది రైతులకే మాఫీ అయింది. కమాన్‌పూర్ సహకార సంఘం నుంచి 34మంది, పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్ నుంచి 80 మంది, సబ్బితంలోని ఇండియన్ ఓవర్సిస్ బ్యాంకు నుంచి దాదాపు 200ల మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. రైతులను ఇబ్బంది పెట్టడం రేవంత్ సర్కారుకు తగదు.

- చిందం తిరుపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్, కమాన్‌పూర్

బ్యాంకుల్లో బారులు



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో యూరియా బస్తాల కోసం గంటల కొద్ది రైతులు క్యూలైన్‌లో నిల్చోని ఉండేవాళ్లు. ఇప్పుడు రుణమాఫీ కోసం బ్యాంకుల ముందు గంటల తరుబడి బారులు తీరుతున్నరు. రొంపికుంటలో చానామందికి రుణాలు మాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేయాలి.

-కొయ్యడ కుమార్, రొంపికుంట, కమాన్‌పూర్

కాంగ్రెస్ గొప్పలు సిగ్గుచేటు



పెద్దపల్లి ఇండియన్ బ్యాంకులో రూ. 80 వేలు లోన్ తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లో నా పేరు రాలేదు. లక్ష లోపు ఉన్న నాకు మాఫీ కాకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పడం సిగ్గుచేటు. రైతులు ఆగమవుతుంటే వరంగల్‌లో రుణమాఫీ కృతజ్ఞత సభ పెడుతామని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరం.

-తాళ్ల కనకయ్య, తెనుగుపల్లి, కమాన్‌పూర్

ఖాతా లెక్కలు చెప్తలేరు



కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్‌లో రూ. లక్ష రుణం 2023 ఆగస్టులో ఒక్కసారే మాఫీ అయింది. మళ్లీ అదే బ్యాంక్‌లో 28 అక్టోబర్ 2023న రూ.52వేల లోన్ తీసుకున్న. రుణమాఫీ అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నా.. మూడు విడుతల్లోనూ మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే నేను 2016లో రుణం తీసుకున్నట్టు చెబుతున్నరు. నేను 2016లో రుణం తీసుకుంటే కేసీఆర్ చేసిన మాఫీ ఎటు పోయిందని అని అడిగితే కసురుకుంటున్నరు. ఖాతాలెక్కలు అడిగితే కర్సయితయ్ అంటున్నరు.

-కే రవి, రొంపికుంట, కమాన్‌పూర్

మాఫీపై సమజైతలేదు



కేసీఆర్ హయాంలో నాకున్న లోను రూ. 49వేలు వడ్డీతో రూ. 54వేలు ఒకేసారి మాఫీ అయ్యింది. మళ్లీ ఆగస్టు నెలలోనే పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్‌లో రూ. 54వేలు రుణం తీసుకున్నా. రైతు రుణమాఫీకి నాకు అన్ని అర్హతలున్నాయి. కానీ మూడు లిస్ట్‌లోనూ నా పేరు రాలేదు. గిట్లేందుకు అయిందో సమజైతలేదు.

-కే మల్లేశ్, రొంపికుంట, కమాన్‌పూర్

రైతులతో ఆందోళన చేస్తాం



రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోంది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాఫీ చేసింది పావలా వంతు. చెప్పుకునేది రూపాయి వంతు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలి. మాఫీ చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తాం.

- ఉప్పరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ, కమాన్‌పూర్

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

రైతుల ప్రయోజనం కోసమే రహదారి

- ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాం
- మాతోపాటు 140 మందికి పైగా రైతులకు మేలు
- అసైన్ భూమి కబ్జా అవాస్తవం
- జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ స్పష్టీకరణ

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలోని నాగన్‌పల్లి, అనాజీపూర్ గ్రామాల పరిధిలోని వందలాది మంది రైతులతో పాటు తమ పట్టా భూముల్లోకి వెళ్లేందుకు సరైన రహదారి లేదని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నది. తమ కంపెనీకి అనాజీపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 276, 277, 278, 279, 280, 281లో 175 ఎకరాల పట్టా భూమి ఉందని తెలిపింది. అదేవిధంగా సర్వే నెంబర్ 261, 271, 272, 273, 274లో మరో 40 ఎకరాల పట్టా భూమి ఉందని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ స్పష్టంచేసింది. ఇలా మొత్తం 215 ఎకరాల పటాస్ భూమి ఉందని, వాస్తవానికి 1993లో ఈ భూములను రాఘువేంద్ర ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు రైతుల నుంచి కొనుగోలు చేశారని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి తెలిపారు. రాఘువేంద్ర ప్రసాద్, అతని కుటుంబ సభ్యుల నుంచి తాము జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ పేరిట ఆ భూములను కొనుగోలు చేశామన్నారు. జీనియస్ కన్‌స్ట్రక్షన్స్‌లో ఇతరుల ఎవరి భాగస్వామ్యం లేదని వివరించారు. అదేవిధంగా ఇందులో ఒక్క గజం కూడా అసైన్ భూమి లేదని స్పష్టంచేశారు. తమతో పాటు ఈ సర్వే నంబర్లలో వందలాది మంది రైతులకు కూడా వ్యవసాయ భూములు ఉన్నాయని చెప్పారు. ఈ భూములను ఆనుకొని నాగన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 189లో మరి కొంతమంది రైతులకు వ్యవసాయ భూములు ఉన్నాయని, కానీ ఈ భూముల్లోకి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. అందుకే అందరికీ ప్రయోజనం ఉంటుందనే సదుద్దేశంతో రహదారి ఏర్పాటు చేసుకుంటే మంచిదని తమ కంపెనీతో పాటు రైతులందరూ అనుకున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు జీనియస్ కంపెనీ ప్రతినిధి తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రహదారి నిర్మాణ పనులు చేసేందుకు సహకరించాలని రైతులు తమను కోరినట్లు పేర్కొన్నారు. మాతో పాటు రైతులకు కూడా మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఆ ప్రతిపాదనకు తాము అంగీకరించామన్నారు. కానీ అసైన్ భూములు కబ్జా చేశారనే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

గతంలో అనుమతులిచ్చారు...

రైతుల, ఇతర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా అసైన్ భూముల్లో రహదారి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి తెలిపారు. ఈ మేరకు జీవోలు కూడా జారీ అయ్యాయని అన్నారు. అదేరీతిన రైతులతో కలిసి తాము కూడా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నమేగానీ ఇందులో ఒక్కరి ప్రయోజనం లేదన్నారు. రహదారి నిర్మాణం ప్రభుత్వ అనుమతి వచ్చిన తర్వాత మాత్రమే పనుల చేపడుతామని, ప్రస్తుతం తమ కంపెనీకి చెందిన పట్టా భూములను చదునుచేసే పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో ఇందిరా సాగర్ బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి మట్టి, బండరాళ్లు పారబోయడం లేదని, అలాంటి వార్తల్లో నిజం లేదన్నారు.

రహదారి కోసమే మా ప్రయత్నం...

తమ భూములతో పాటు అనాజీపూర్ గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదని ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య గౌడ్, నల్లా బాలరాజు, నెట్టు బాలయ్య, సీహెచ్ బాలయ్య, ఎం అబ్బయ్య, బాలరాజు ఎస్ బుగ్గయ్య, రమణయ్య అనే రైతులు తెలిపారు. ఇందుకోసం తమ భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు ముందుకొచ్చామని అన్నారు. రహదారి నిర్మాణానికి సహకరించాలని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీని కోరామని, అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వాళ్ళు కూడా అంగీకరించినట్లు రైతులు చెప్పారు. కానీ తమ భూములను ఇతరులు ఆక్రమించారనే వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పింది

- కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి, బడ్జెట్లో రూ.26 వేల కోట్లు కేటాయించారని.. చివరికి రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని మండిపడ్డారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? అని ప్రశ్నించారు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు కడుపుమండి కాంగ్రెస్ దిష్టిబొమ్మలను కాలుస్తున్నారని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రుణమాఫీ సహా 6 గ్యారెంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు విలీన డ్రామాలు ఆడుతున్నదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

రెన్యువల్ చేసినా రుణమాఫీ కాలె



2019లో రూ.2 లక్షల రుణం తీసుకున్న. అప్పటి నుంచి ఏటా మిత్తి చెల్లించి రెన్యువల్ చేస్తున్నా. మూడు రోజుల క్రితం రూ.2 లక్షల్లోపు రుణమాఫీ అయినట్టు తెలిసి బ్యాంకుకు వెళ్లి అడిగితే మాఫీ కాలేదని చెప్పిన్రు. మా గ్రామంలో చాలామంది రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదు. రుణమాఫీ చేసి నాకు న్యాయం చేయాలి.

- కూకట్ల వీరన్న, పోచారం, మహబూబాబాద్ జిల్లా

మేం రైతులం కాదా? మాకెందుకు మాఫీ కాదు



నా భర్త ప్రభాకర్ పేరున రూ.2 లక్షలు తీసుకున్నం. దానికి వడ్డీ కలిపితే రెండు లక్షలు దాటుతది. వడ్డీ పైసలు కడుతామని బ్యాంకుకు పోతే పట్టించుకునే వారే లేరు. కొందరికే మాఫీ అయితే ఎలా? మేం రైతులం కాదా?

- కొత్తూరు తిరుపతమ్మ, జంగాలపల్లి, ములుగు జిల్లా

2 లక్షల మాఫీ ఒక్కరికీ కాలేదు

- జుల్కల్‌లో రైతులకు మొండిచెయ్యి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

సంగారెడ్డి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రూ. 2లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ గ్రామంలోని రైతుల్లో కనీసం ఒక్కరికి కూడా 2లక్షల రుణమాఫీ కాలేదు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని జుల్కల్ గ్రామ పంచాయతీలో 3వేల జనాభా, 2800 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. 1000 మందికిపైగా రైతులు ఉన్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ. గ్రామంలోని 500 మందికిపైగా రైతులు కందిలోని ఎస్‌బీఐ, కోఆపరేటివ్ బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకుంటున్నారు. రేవంత్ సర్కార్ గ్రామంలో మొదటి విడతగా 158 మంది, రెండో విడతలో 72 మంది రైతులకు రుణమాఫీ చేసింది. మూడో విడతలో ఒక్కరికీ పంటరుణం మాఫీ కాలేదు. దీంతో గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం గ్రామంలో 70 శాతానికి పైగా రైతుల రుణాలు మాఫీ కావాలని, కానీ సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మించి మోసం చేయొద్దు



నేను కోఆపరేటివ్ బ్యాంకులో రూ.1.94 లక్షల పంట రుణం తీసుకున్నా. రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పటంతో సంతోషపడ్డా. కానీ నాకు రూ.1.94 లక్షల పంటరుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం నాలాంటి రైతులను నమ్మించి మోసం చేయడం సరికాదు.

-కొత్తగాడి నర్సింలు, జుల్కల్, సంగారెడ్డి జిల్లా

ఆశలు అడియాసలయ్యాయి



కంది కోఆపరేటివ్ బ్యాంకులో రూ.2 లక్షల పంట రుణం తీసుకున్న. అర్హత ఉన్నా నాకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదు. రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు అన్నీ ఉన్నాయి. రేవంత్ సర్కార్ నా ఆశలను అడియాసలు చేసింది. ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.

-కలివేముల పాండు,జుల్కల్, సంగారెడ్డి జిల్లా

దండం పెడతా.. మాఫీ చేయండి



మా కుటుంబంలో మా అమ్మకు, నాకు పంట రుణం ఉంది. పట్టాదారు పాస్‌పుస్తకాలు వేర్వేరుగా ఉన్నాయి. మూడు విడతల్లోనూ మాకు లోన్ మాఫీ కాలేదు. అటు రైతుభరోసా ఇవ్వక, ఇటు రుణమాఫీ కాక కష్టాలు పడుతున్నాం. రుణమాఫీ చేస్తే మళ్లీ రుణం తీసుకొని పంటలు సాగు చేసుకుంటాం కదా? సీఎం గారూ.. మీకు దండం పెడతాం.. మా రుణాలు మాఫీ చేయండి.

-మాలోత్ పూల్‌సింగ్, మంగ్యాతండా, టేకులపల్లి

రేషన్‌కార్డు లేకుంటే మాఫీ చేయరా?



దుమ్ముగూడెం సహకార బ్యాంకులో రెండేండ్ల క్రితం రూ.18 వేల పంట రుణం తీసుకున్నాను. మూడు విడతల్లోనూ నా పేరు రాలేదు. బ్యాంకు సిబ్బందిని అడిగితే సమాచారంలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులనూ సంప్రదించాను. మా నాన్న రేషన్‌కార్డులో నా పేరు ఉందని చెప్పారు. నాకు సపరేట్ రేషన్‌కార్డు లేనంత మాత్రాన నా పంట రుణాన్ని మాఫీ చేయరా?

-కాశిబోయిన సతీశ్, బండిరేవు, దుమ్ముగూడెం

● మా ఇంట్లో ఎవరికీ మాఫీ చేయలే..




మా ఇంట్లో నేను, నా భార్య రాజ్యలక్ష్మి, కొడుకులు సేనాపతి, సతీశ్ ఉంటున్నాం. అందరికీ ఒకటే రేషన్ కార్డు ఉన్నా, వేర్వేరుగా ఉంటున్నాం. పట్టాపాస్ పుస్తకాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి. అయితే, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణమాఫీలో మాలో ఒక్కరికి కూడా కాలేదు. నా పేరు మీద రూ.1.50 లక్షలు, నా భార్య పేరు మీద రూ.2.74 లక్షలు, నా కొడుకు సతీశ్ పేరున రూ.98 వేలు, సేనాపతి పేరుమీద రూ.1.10 లక్షల రుణం ఉన్నది. మాలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలె. గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినం. వ్యవసాయ అధికారులను కలిసినం. ఎవరూ సమాధానం చెప్పడం లేదు. మా లెక్క మా ఊరిలో చాలామంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

- మారెల్ల కొమురయ్య రైతు, కాశీంపల్లి, భూపాలపల్లి



శుక ఉవాచ.. పరీక్షిన్మహారాజా! గోకులంలో నందాది వృద్ధ గోపకులు ఇంద్రయాగానికి సిద్ధపడటం చూచి సర్వజ్ఞుడైన శౌరి వారిని ఇలా ప్రశ్నించి వారించాడు- 'నాన్నగారూ! మీరీ జన్నాన్ని (యాగాన్ని) పరిపాటిగా- పరంపరగా వస్తున్న ఆచారంగా భావించి చేస్తున్నారా లేక యాగ రహస్యం తెలిసి ఆచరిస్తున్నారా? దీనికి, 'పుత్రకామేష్టి' వలన పుత్రప్రాప్తి వలె దృష్ట- ఐహిక ఫలమా లేక జ్యోతిష్టోమానికి స్వర్గప్రాప్తి వలె అదృష్ట ఆముష్మిక- లోకాంతర ఫలమా? శాస్త్రవిధి విధానం తెలిసి చేస్తేనే కర్మలు ఫలిస్తాయి. తెలియక చేస్తే ఫలించవు కదా! మీ ఉద్దేశం నాకు చెప్పండి'. 'ఇంత చిన్నవాని మాటలు ఎంతలేసి పెద్దవో' అంటూ చెంతనున్న వారంతా ఒకింత వింతగా చూచారు.

ఇంద్రయాగం నందవ్రజం ఆగమాగం



రాజా! గడుసరి కొడుకు గోవిందునికి తండ్రి నందుడు ముక్తసరిగా ఇలా సమాధాన మిచ్చాడు.. 'కుమారా! ఇది పరంపరగా వస్తున్న ఆచారమే. ఇంద్ర యాగం చేస్తే దేవేంద్రుడు సంతసించి నిరంతర వర్షధారలు కురిపిస్తాడు. అంత పాడిపంటలు మరింతగా పెరుగుతాయి. మన జీవితాలు సుఖవంతాలవుతాయి'. జనకుని పలుకులు విని జనార్దనుడు బాల ముకుందుడు సునాసీరు- ఇంద్రునికి కినుక చాల హెచ్చునట్లు నందునితో ఇలా అన్నాడు.. తండ్రీ! కర్మ చేతనే ప్రాణి వర్గానికి జన్మ, వృద్ధి, క్షయాలు. కర్మలే జీవుల సుఖదుఃఖాలకు కారణం. కర్తకు వాని కర్మలే తగిన ఫలాలను ప్రసాదిస్తూండగా మధ్యలో ఈశ్వరుని- ఇంద్రుని ప్రసక్తి ఎందుకు? ఆ ఈశ్వరుడు కూడా కర్మ చేసిన వానికే ఫలమిస్తాడు కాని, ఏ కర్మా చేయని వానికి ఏమీ ఇవ్వడు కదా! కర్మఫలాలను ఏ ధర్మదేవతా తప్పించలేదుగా! జీవునికి కర్మమే దైవతం. 'తస్మై నమః కర్మణే'- అతడు కర్మనే దైవంగా భావించి సంభావించాలి- ఆరాధించాలి. కర్మల, ఆయా ఫలాల మర్మ- రహస్యమిలా ఉండగా నడుమ బిడౌజుని- అమరేంద్రుని ప్రమేయం ఏముంది? కనుక, అతనికి కినుక పూనవలసిన పని లేనేలేదు. ఒకవేళ కోపగించినా మనకొచ్చే ఆపద ఏమీలేదు. కాన, పితాశ్రీ! మన హితానికి- సుఖజీవితానికి హేతువులైన మన గోజాతిని పోషించే గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాం. పతితులకు, అనాథలకు అన్న సంతర్పణం చేద్దాం. గిరి, గోవులను పరిక్రమిద్దాం- ప్రదక్షిణలు గావిద్దాం'. నిలింపపతి ఇంద్రుని సొంపు- సంపద సమృద్ధి మదం, దింపు- తొలగించే, తలంపుతోనే పరమాత్మ ఇలా పలికాడు. నందాదులంతా ఆనందంగా అంగీకరించారు.

మ|| 'సకలాభీరులు వీడె కృష్ణుడన నైజంబైన రూపంబు తో
నకలంక స్థితి నుంచి శైలమిదె మీ రర్చింప రండంచు దా
నొక శైలాకృతి దాల్చి గోపకులతో నొండొండ పూజించి గో
పక దత్తాన్నము లాహరించె విభుడా ప్రత్యక్ష శైలాకృతిన్'-

శుకముని.. రాజా! లీలా పురుషోత్తముడు బాల గోపాలుడు, గోపకులందరూ 'ఇడుగో కృష్ణుడు' అనుకొను రీతిగా గొల్లల మధ్య నిర్మలాకృతితో నిశ్శంకగా నిలబడి వారితో- 'ఇదిగో పర్వతం. దీనిని పూజించడానికి మీరందరూ పూనికతో రండి' అంటూ తాను తత్‌క్షణం పర్వతాకారం ధరించాడు. ఆ ఆభీరుల- గొల్లలతోనే కలసి గిరి రూపం దాల్చిన హరి తన్నుతానే వరివస్య- పూజ చేసుకొంటూ వారు అర్పించిన నైవేద్యాలన్నిటిని వేదవేద్యుడు పరామోదంతో ఆహరించాడు- ఆరగించాడు. వందారు మందారుడైన (కైమోడ్పు వారికి కల్పవృక్షమైన) అరవిందాక్షుడు నందనందనుడు ఇలా ఈ గోవర్ధన లీలలో 'పూజ్య- పూజక- పూజలు' (పూజింపబడువాడు, పూజించేవాడు, పూజా కార్యక్రమం) ఈ త్రిపుటి తానే అయ్యాడు. గోపకులు శ్రీహరితో కూడి గిరికి పూజలు, కానుకలూ సమర్పించి, ఆనంద లహరిలో ఓలలాడుతూ ఆలమందలతో దానికి పరిక్రమ చేశారు. అనంతరం మాధవునితో కలసి మందకు మరలిపోయారు.

అప్పుడు జరిగినదంతా తెలుసుకొని జంభాసుర వైరి- ఇంద్రుడు సంరంభం (కోపం, ఆటోపం)తో దంభోళి (వజ్రాయుధం) జళిపించి...

క|| 'గురుదేవ హీను బాలుని
గిరి భూజ ప్రముఖ వాసు గృష్ణు ననీశుం
బరిణామ శీలు గుల గుణ
విరహితు జేపట్టి యింద్రు విడిచిరి గొల్లల్'...

'ఈ కృష్ణుడు గురువు దైవము లేనివాడు, బాలుడు, కొండల్లో కోనల్లో ఉండేవాడు. ఎవ్వరి మీద ఎలాంటి విభుత్వం- ఆధిపత్యం లేనివాడు, చంచల స్వభావుడు, కుల రహితుడు, గుణహీనుడు ఐన ఈ కుర్రని మాటలు విని విర్రవీగి ఈ గొల్లలు వేలుపు దొరనైన నన్ను త్యాగం చేశారు. నా యాగాన్ని విడిచారు. ఇక వీరి ఆటలు సాగనివ్వను.' అని ఉగ్రుడై.. ఉరుములు, మెరుపులతో రాళ్లవాన కురిపించి, నంద గోకులాన్ని ఆగమాగం చెయ్యండని ప్రళయ భయంకరమైన సంవర్తక మేఘ బృందాలను ఆదేశించాడు. అవి మందను ఆవరించాయి. దట్టంగా కారుచీకట్లు కమ్మించాయి. విరామ మెరుగని వడగండ్ల వానతో పిడుగులు రువ్వాయి. గోపయ్యలు కొయ్యబారి పోయారు. ఎటు చూచినా ఆవుల లేగల అంబారావాలు, ఆర్తనాదాలు. ఆ జడివానకు తాళలేక బడుగు (సన్నని) నడుముల గోపికలు గడగడ వణుకుతూ గోవిందునికి మొర పెట్టుకున్నారు.

అందమైన పై కందపద్యంలో దేవేంద్రుడు ఉపేంద్రుని- కృష్ణుని నిందిస్తున్నట్లు పైపైన అనిపిస్తున్నా నిజానికి విచారిస్తే అవి స్తుతివాక్యాలుగానే గోచరిస్తాయి. పరబ్రహ్మము (నిర్దోషం హి సమం బ్రహ్మ- గీత) దోషరహితం కాన ఆయన యందు నింద పొసగదు- వర్తించదు. ఎలాగన.. గురుదేవహీనుడు- 'కృష్ణంవందే జగద్గురుమ్'- తానే జగత్తుకు గురువైతే తనకు మరో గురువు ఉంటాడా? తానే ఆదిదేవుడు, మహాదేవుడు, దేవాధిదేవుడు. తనకు మరో దేవుడు లేడు. బాలుడు- 'బాలు భంగి నితడు భాసిల్లుగాని సర్వాత్ముడాది విష్ణువగుట నిజము'- బాలుని వలె కనిపించుటే కాని ఇతడు సర్వాత్ముడైన ఆ శ్రీహరియే!- అంటుంది యశోద విశ్వరూప సందర్శనంలో. గిరి భూజ ప్రముఖవాసుడు- చరాచరాలందు అంతటా వ్యాపించి ఉన్నవాడు, అనీశుడు- సర్వేశ్వరుడు కాన తనకు మరో ఈశుడు- అధిపతి లేనివాడు, పరిణామశీలు- ధర్మరక్షణకై పలు రూపాలలో పరిణమించు- అవతరించువాడు. పరబ్రహ్మ ఎలా అగుపించినా పరబ్రహ్మే! కులహీనుడు- కులమనగా శరీరమని కూడా అర్థం. జీవుని వలె పాంచభౌతిక, పార్థివ- మృణ్మయ దేహం లేనివాడు. గుణహీనుడు- సత్త్వరజస్తమో గుణాలు లేని గుణాతీతుడు! ఇలా నింద రూపంలో ఉన్న స్తుతికి 'వ్యాజస్తుతి' అనిపేరు. ఇది బమ్మెర వారి స్వీయ రచన!

క|| 'వారి బరువయ్యె మందల
వారికి, నిదె పరులు లేరు వారింపంగా
వారిద పటల భయంబును
వారిరుహ దళాక్ష! నేడు వారింపగదే!'

'వారిజనేత్రా (పద్మాక్షా)! మందలోని వారినందరినీ ఈ ఉపలవృష్టి- రాళ్లవాన కొందల (క్షోభ, కలత) పెడుతోంది. ఈ ఉపద్రవాన్ని నివారింపగలవారు నీవు తప్ప మరెవరున్నారు? దయావారిధీ! ఈ సంవర్తక వారిదా (మేఘా)ల భయాన్ని వారించి కాపాడు'. శుకుడు.. రాజా! ఆపన్నులైన గోకులవాసుల విన్నపాన్ని కన్నయ్య విన్నాడు. ఉన్నతమైన అమరాధిపత్యం అబ్బిందని కన్నుకానని అహంకారంతో అమరేంద్రుడు- (పెరుగులు, నేతులు తాగి క్రొవ్విన- బలసి గర్విస్తున్న ఈ గొల్లలు తన్ను తృణీకరిస్తున్నారని) మిన్ను నుంచి ఇలా శిలా వర్షం కురిపిస్తున్నాడని సర్వజ్ఞుడు హరి గ్రహించాడు. ఇంద్రునికి గర్వభంగం కావించాలని, నందుని మందలో కుందుతున్న- విలవిల్లాడుతున్న వారినందరినీ వారి వారి ఆలమందలతో సహా ఒక చోట చేరమన్నాడు బాలకృష్ణుడు.

క|| 'కిరియై ధర యెత్తిన హరి
కరి సరసిజ ముకుల మెత్తుగతి ద్రిభువన శం
కరకరుడై గోవర్ధన
గిరి యెత్తెం జక్క నొక్క కేలన్ లీలన్'...

అలా పలికి, కిరి- ఆది వరాహమూర్తియై ఇలను- భూమిని ఉద్ధరించిన హరి, ముల్లోకాలకు శంకరుడై- మోదం కలిగించడానికి, కరి- ఏనుగు గున్న తామర మొగ్గను పైకెత్తు రీతిగా గోవర్ధన గిరిని ఒక్కచేతితో అవలీలగా ఎత్తి పట్టుకున్నాడు.

శా|| 'బాలుండాడుచు నాతపత్రమని సంభావించి పూగుత్తి కెం
గేలం దాల్చిన లీల లేనగవుతో గృష్ణుండు దానమ్మహా
శైలంబున్ వలకేల దాల్చి విపుల ఛత్రంబుగా బట్టె నా
భీలాభ్రచ్యుత దుశ్శిలా చకిత గోపీ గోప గోపంక్తికన్'

శుకుడు- రాజా! పసివాడు ఆటలాడుతూ ఒక పూలగుత్తిని గొడుగుగా భావించి తన సుతిమెత్తని చేతిలో ధరించిన రీతిగా, ఇలా గోవర్ధన శైలాన్ని బాలకృష్ణుడు లీలా దరహాసం చిందిస్తూ తన వలకేల- కుడిచేత ధారణ చేశాడు. దారుణమైన వారిద- మేఘాల శిలా వర్షానికి పిల్లపాపలతో ఆపసోపాలు- అవస్థలు పడుతున్న గోప గోపీ గోగణానికి అండగా ఆ కొండను పెద్ద గొడుగుగా పట్టుకున్నాడు. మూలంలో 'ఛత్రాకమివ బాలకః'- (చిన్న పిల్లవాడు పుట్టగొడుగును పట్టుకొన్నట్లు) అని మాత్రమే ఉన్నదానికి సహజ పాండిత్యుడు పోతన్న చేసిన సరస శ్రావ్యమైన పెంపుదల పై కంద, శార్దూల పద్యాలు.

క|| 'దండిని బ్రహ్మాండంబులు
చెండుల క్రియ బట్టి యెగుర జిమ్మెడు హరికిన్
గొండ బెకలించి యెత్తుట
కొండొక పనిగాక యెుక్క కొండా తలపన్'

రాజా! బ్రహ్మాండాలను సైతం చెండు- బంతులవలె ఎగరేసే గండర గండడు- శూరుల కెల్ల శూరుడు, గోవిందుడికి ఒక కొండను పెళ్లగించి పైకెత్తడం చిల్లర- చిన్న పనిగాక ఎల్లరిచే ఎన్నదగిన ఘనకార్యమా?



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

పుత్తడి కాదు ఇత్తడి

ఇస్లాం బోధ



ఒకానొక వ్యాపారి దగ్గరికి ఒక వ్యక్తి వచ్చి 'నాకు డబ్బు అవసరముంది. ఈ బంగారు నగ ఉంచుకొని కొంత డబ్బు ఇవ్వండి. నెలరోజుల్లో డబ్బు చెల్లించి నగను తీసుకువెళ్తాను' అన్నాడు. వ్యాపారి డబ్బు ఇవ్వడానికి తటపటాయించాడు. అతను ఎంతగానో ప్రాధేయపడటంతో డబ్బు ఇవ్వడానికి అంగీకరించాడు. అయితే ఏడాది గడిచినా నగ తాకట్టు పెట్టిన వ్యక్తి తిరిగి రాలేదు. లాభం లేదనుకొని ఆ నగను తీసుకొని పట్టణానికి వెళ్లాడు వ్యాపారి. బంగారం దుకాణానికి వెళ్లి నగను అమ్మజూశాడు. కానీ, దుకాణ యజమాని దానిని పరీక్షించి.. 'ఇది పుత్తడి కాదు.. ఇత్తడి' అనడంతో వ్యాపారి కంగుతిన్నాడు. చేసేది లేక నిరాశతో ఇంటిముఖం పట్టాడు. ఏడాదిపాటు తన బంగారు నగలతోపాటు దాచి ఉంచిన ఆ గిల్టు నగను పాత సామాన్ల పెట్టెలో పడేశాడు వ్యాపారి.

మన స్థానాన్ని మనమే నిర్ణయించుకుంటాం. మనం పుత్తడి మనుషులమో, ఇత్తడి మనుషులమో మన ప్రవర్తనే నిర్ణయిస్తుంది. 'మాటమీద నిలబడేవారు పుత్తడి లాంటి మనుషులు. మాట తప్పేవారు ఇత్తడి మనుషుల'ని ఉలేమాలు పైకథను చెబుతుంటారు. మాట ఇచ్చి నిలుపుకోకపోవడం, చేసిన అప్పు తీర్చకుండా ఎగ్గొట్టడం అల్లాహ్ శాపానికి కారణాలు అవుతాయని ముహమ్మద్ ప్రవక్త (స) హెచ్చరించారు. ఇలాంటివారికి పరలోకంలోనే కాదు, లౌకిక జీవితంలోనూ ఎలాంటి విలువా ఉండదు. మాటకు కట్టుబడే వ్యక్తులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని ఖురాన్ పేర్కొన్నది. 'మాట ఇచ్చి, తరువాత బొంకేవాడు ధర్మం లేనివాడ'ని ప్రవక్త తరచూ చెప్పేవారు. స్వర్గప్రవేశం చేసేవారిలో వాగ్దానానికి కట్టుబడేవారే ఉంటార'ని ఖురాన్ పేర్కొంటున్నది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఏదైనా ఒప్పందం జరిగినప్పుడు దానిని తప్పకుండా నెరవేర్చాలన్నది ప్రవక్త బోధన.

... ముహమ్మద్ ముజాహిద్,
96406 22076

ఎందుకు భయం?

ఇహలోకంలో తమ మనుగడను సుఖమయం చేసుకోవాలన్నదే చాలామంది జీవితాశయంగా ఉంటుంది. కానీ, కోరుకోకుండానే మనిషికి కష్టాలు ఎదురవుతుంటాయి. ఈ కష్టాలు మనిషి మనసు పరివర్తనకో, మనుగడ మార్పునకో దారితీస్తాయి. సామాన్య జనుల మధ్య సాగిన క్రీస్తు జీవనం సుఖమయంగా కాకపోయినా, ఎంత హృదయానందంగా గడిచిందో తెలిసిందే! కానీ, మనిషి కోసం మనిషి కష్టపడాలి. త్యాగం చేయాలి అనే సందేశం ఇవ్వడానికి కష్టాలకే చివరిస్థాయి అయిన మరణాన్ని అనుభవించాడు ప్రభువు. ఎన్నో అద్భుతాలు ఆవిష్కరించిన ఆయన, మరణాన్ని కావాలనే ఆహ్వానించుకున్నాడు. కష్టం అంటేనే క్రీస్తు అని నిర్వచనంగా మిగిలాడు. చిన్నపాటి కష్టానికే ఎందుకిలా భయపడతారు అని హెచ్చరికలు చేస్తూ ప్రభువు ధైర్యం ఇస్తుంటాడు. లేనిపోని కోరికలతో కష్టాలను కొనితెచ్చుకునేవారు ఎందరో! ఇతరుల సౌఖ్యం కోసం, క్రీస్తుపై ప్రేమాతిశయం వల్ల తమ జీవితాల్లో హింసల్ని ఆహ్వానించుకున్న క్రైస్తవ మహర్షులు ఎందరో ఉన్నారు. అలాంటివారిలో స్టీఫెన్ మహర్షి, పునీత సెసీలియా, మరియా గొరెట్టీ తదితరులు కనిపిస్తారు. చిన్నపాటి కష్టాలకే ఉలిక్కిపడే వారికి, వీరంతా ఒక మహా సందేశంలా నిలిచిపోతారు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు,
98667 55024



క్రీస్తు సందేశం

అనుబంధాలకు ప్రతీక

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకొనే పండుగ రక్షాబంధన్. శ్రావణ పౌర్ణమి నాడు జరుపుకొనే ఈ పండుగ వెనుక ఎన్నో విశేషాలు ఉన్నాయి. పురాణాల ప్రకారం.. ఒకసారి దేవతలకు, రాక్షసులకు యుద్ధం జరుగుతుంది. ఆ సమరంలో దేవతల గెలుపు కోరి శ్రావణ పౌర్ణమి నాడు లక్ష్మీనారాయణులను, పార్వతీ పరమేశ్వరులను పూజించి.. శచీదేవి తన భర్త దేవేంద్రుడికి రక్ష కడుతుంది. దాని ప్రభావంతో దేవేంద్రుడు ఆ యుద్ధంలో గెలుస్తాడు. ద్వాపరయుగానికి చెందిన మరో కథ కూడా రక్షాబంధన్ గొప్పదనాన్ని తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడికి ద్రౌపది సోదరి వరుస అవుతుంది. ఒకసారి కృష్ణపరమాత్మ సుదర్శన చక్రం ప్రయోగించినప్పుడు ఆయన వేలుకు గాయం అవుతుంది. అప్పుడు అక్కడే ఉన్న ద్రౌపది తన చీర చెంగును చింపి.. రక్తమోడుతున్న కృష్ణుడి వేలుకు కట్టు కడుతుంది. సోదరి ప్రేమకు చలించిపోతాడు కృష్ణుడు. ఈ రక్షే.. తర్వాత వస్త్రాపహరణ సమయంలో ద్రౌపదికి రక్షణగా నిలిచిందని చెబుతారు. రక్షాబంధన్‌కు సంబంధించిన చారిత్రక కథలు కోకొల్లలుగా వినిపిస్తాయి. అలెగ్జాండర్ భార్య రుక్సానా తన భర్త ప్రాణాలకు అభయం కోరుతూ.. పురుషోత్తముడికి రాఖీ కట్టిందని కథ. ఇవన్నీ ఎలా ఉన్నా.. రాఖీ పౌర్ణమి తోబుట్టువుల బాధ్యతలను గుర్తింపజేసే పండుగ. సోదరి బాగోగులు చూసుకోవడం సోదరుల కర్తవ్యం అని తెలియజేస్తుంది.

నేడు రాఖీ పౌర్ణమి



తల్లి ఒడి

కథాసుధ

ఓ యువ అధ్యాపక దంపతులకు ఒక్కగానొక్క మగబిడ్డ కలిగాడు. ఆ పిల్లవాడిని తమకన్నా పెద్ద చదువులు చదివించాలనుకున్నారు. ఉన్నత స్థానంలో నిలబెట్టాలనుకున్నారు. పిల్లాడు పసివాడుగా ఉన్నప్పుడే అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల గురించి ఆరా తీయడం మొదలుపెట్టారు. అక్కడి ఉపాధ్యాయుల నేపథ్యం, కోర్సుల ప్రత్యేకతలు, అక్కడ చదివి గొప్ప స్థానాల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. కొడుకు ఆ విశ్వవిద్యాలయాల్లో చదివే వయసుకు వచ్చేసరికి ఎంత డబ్బు కావాల్సి వస్తుందో లెక్కలేశారు. తమ దగ్గర ఉన్న వనరుల జాబితా చూసుకున్నారు. మరెంత కూడబెట్టాలో ఆలోచించసాగారు. మనవడిని చూడటానికి వచ్చిన అధ్యాపకుడి తల్లికి తన కొడుకు, కోడలి వింత ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. 'ఎందుకు ఇంతలా ఇదైపోతున్నారు?' అని అడిగింది. విషయం చెప్పారు దంపతులు. ఆమె మనవడిని చేతిలోకి తీసుకుంటూ 'తల్లిని మించిన దైవం లేదని పెద్దలు ఎప్పుడో చెప్పారు. అలాగే తల్లి ఒడికి మించిన గొప్ప విశ్వవిద్యాలయం ఏదీ ఈ ప్రపంచంలో ఉండదు. ప్రేమ, అనురాగం, బుజ్జగింపు, ఆప్యాయత, మమకారం ఇవన్నీ ప్రధానం. అప్పుడే పై చదువుల గురించి ఆలోచిస్తూ మీరు ఒత్తిడికి గురికావద్దు. వాడిని ఒత్తిడికి గురిచేయవద్దు. ముందుగా బిడ్డకు స్వచ్ఛమైన బాల్యాన్ని ఇవ్వాలి. అది అమ్మతోనే సాధ్యం' అని సలహా ఇచ్చింది. 'నిజమే... తల్లి ఒడే ఓ పెద్ద విశ్వవిద్యాలయం. దైవం ప్రసాదించిన ఆలయం. ఇక్కడ నేర్చుకునేది మనిషి జీవితానికి తొలిమెట్టు అవుతుంది. అది లోపిస్తేనే సమస్యలు ఎదురవుతాయి' అని గుర్తించి బిడ్డను ముద్దులాడారు ఆ ఉపాధ్యాయ తల్లిదండ్రులు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821



జ్ఞానానందమయం దేవం

జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే॥

'అనంతమైన, ఆనందమయమైన జ్ఞానానికి అధిపతి, స్వచ్ఛమైన స్ఫటికం వంటి ఆకృతి కలిగి, సకల విద్యలకు అధిదేవత అయిన హయగ్రీవుడికి నమస్కరిస్తున్నాను' అని పై శ్లోకానికి అర్థం. హయగ్రీవ అవతారంలో శ్రీమహావిష్ణువు వేదాలను ఉద్ధరించాడు. అందువల్ల, వేదాలతోపాటు సమస్తమైన వాఙ్మయానికి, జ్ఞానానికి హయగ్రీవుడు అధిపతి అయ్యాడు. ఈ అవతారం దాల్చిన శ్రావణ పౌర్ణమిని హయగ్రీవ జయంతిగా జరుపుకొంటారు. ఈ స్వామి గుర్రం ముఖం, మానవ శరీరం కలిసిన రూపంలో దర్శనమిస్తాడు. స్వామి వామాంకం మీద లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంటుంది. స్వామిది తెల్లటి శరీర ఛాయ. నాలుగు చేతుల్లో శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకాలను ధరించి భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడు. శ్రావణ పూర్ణిమ రోజున హయగ్రీవుడు అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. పురాణాల్లో హయగ్రీవ అవతారానికి సంబంధించి అనేక కథలు ఉన్నాయి. మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి, పాతాళంలో దాచిపెడతారు. వేదాలు లేనిదే సృష్టి కార్యం చేయలేనని బ్రహ్మదేవుడు విష్ణుమూర్తికి విన్నవించుకుంటాడు. వెంటనే, శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారంలో పాతాళానికి చేరి, మధుకైటభులను వధించి, వేదాలను రక్షించి, బ్రహ్మదేవుడికి తిరిగి అప్పగిస్తాడు. హయగ్రీవుడు పరిపూర్ణ వేదమూర్తి. స్వామి రూపం సకల విద్యలకు నిలయం. అంతేకాదు, ఆయన సకల దేవతా స్వరూపం కూడా. ఆయనవల్లనే ఈ లోకానికి లలితా సహస్రనామం, దుర్గా త్రిశతి మొదలైన విద్యలు అందాయి. ఎంతోమంది రుషులు హయగ్రీవస్వామిని అర్చించి ఆత్మజ్ఞానాన్ని సంపాదించారు. దాన్ని సమాజ పునరుద్ధరణ కోసం వినియోగించారు.

నేడు హయగ్రీవ జయంతి



- గుండెపోటుతో కోస్ట్ గార్డ్ చీఫ్ మృతి
- నాలుక రంగు బట్టి వ్యాధుల నిర్ధారణ
- అమెరికాలో మళ్లీ కరోనా కలకలం
- రేవంత్ ఇంటివద్ద గురుకుల అభ్యర్థుల ధర్నా
- సర్కార్‌పై ఆర్టీసీ కార్మికుల జంగ్ సైరన్

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

NAMASTE TELANGANA

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 19.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 75 ‖ వెల (Price) రూ.6.50

సోమవారం, సూర్యోదయం: 6-00, సూర్యాస్తమయం: 6-39. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం తిథి: పౌర్ణమి రాత్రి 11-56 వరకు. నక్షత్రం: శ్రవణం ఉదయం 8-10 వరకు, తదుపరి ధనిష్ఠ. వర్జ్యం: పగలు 11-47 నుంచి పగలు 1-13 వరకు. రాహుకాలం: ఉదయం 7-35 నుంచి ఉదయం 9-10 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-44 నుంచి పగలు 1-35 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-16 నుంచి సాయంత్రం 4-06 వరకు. అమృతకాలం: రాత్రి 8-24 నుంచి రాత్రి 9-50 వరకు. శ్రావణ పౌర్ణమి, హయగ్రీవ జయంతి.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న రైతులు


కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జపల్లి తండా గ్రామంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

అమాత్యా.. ఆలకించరా?

అరకొర మాఫీ.. రైతుకు టోపీ.. మంత్రి శ్రీధర్‌బాబు ఇలాకాలో రైతుకు ధోకా

'నమస్తే' ఫీల్డ్ విజిట్‌లో విస్తుపోయే నిజాలు

- కమాన్‌పూర్ మండలంలో మాఫీ 40 శాతమే
- బ్యాంకుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- రొంపికుంట పంచాయతీ వద్ద ఆందోళన
- రేవంత్ సర్కారు దగా చేసిందంటూ ఆగ్రహం

కరీంనగర్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ పెద్దపల్లి: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టున్నది రుణమాఫీపై రేవంత్ సర్కారు వ్యవహారం. ఏక కాలంలో ఆగస్టు 15లోపు రూ. 2లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో మాత్రం విఫలమయ్యారు. పెద్దపల్లి జిల్లాలోని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలంలో 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్టు 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్‌లో తెలిసింది. అరకొరగా లోన్లు చెల్లించి రైతాంగానికి కుచ్చుటోపీ పెట్టినట్టు వెల్లడైంది. మండలంలోని రొంపికుంట, నాగారం, తెనుగుపల్లి, పేరపల్లి, లింగాల గ్రామాలతో పాటు పెద్దపల్లి మండలంలోని సబ్బితం, 3వ పేజీలో



మాది కాంగ్రెస్.. 40 వేలూ జెయ్యలే

నా భర్త ఓదెలు కాంగ్రెస్ కార్యకర్త. పదేండ్ల క్రితం కాలంజేసిండు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ. 40వేలు లోన్ తీసుకున్నా. ఇది మాఫీ అయితదని ఎదురు చూసిన. బ్యాంకోళ్ల దగ్గరికి వెళితే ఏం చెప్పడం లేదు. కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రాన్ని ఇచ్చివచ్చిన.

-అంజమ్మ, రొంపికుంట (పెద్దపల్లి)



రుణమాఫీ కానప్పుడు ఎవరు ఏట్లో దూకాలి?

సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ప్రశ్న

రాష్ట్రంలో సంపూర్ణంగా రుణమాఫీ కాలేదని కోదండరెడ్డి, కోదండరాంరెడ్డి, ఆది శ్రీనివాస్ ముగ్గురూ చెప్పారు. వారు చెప్పిందే నేను చెప్పాను. మాఫీ జరిగితే రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్డెందుకు ఎక్కుతారు. సీఎం దిష్టిబొమ్మను ఎందుకు దహనం చేస్తారు? ప్రతి అంశాన్నీ రాజకీయం చేయడం తగదు. ఇప్పుడు చెప్పు ఏట్లో ఎవరు దూకాలి?

-హరీశ్‌రావు 2

రైతు గోస విను రాహుల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండ్లు తెరిపించండి: కేటీఆర్

- రాష్ట్రంలో 40 శాతం మందికే రుణమాఫీ
- హామీ మేరకు 2 లక్షల రుణం మాఫీ చేయాలి
- రైతులను నిలువునా మోసగిస్తున్న రేవంత్‌రెడ్డి
- రుణమాఫీ పేరిట తెలంగాణలో నయవంచన
- 49 వేల కోట్లని చెప్పి 17 వేల కోట్లతో సరిపెట్టారు
- రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నది
- మాఫీ తీరుపై రాహుల్, ఖర్గేకు కేటీఆర్ లేఖాస్త్రం

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో లక్షలాది మంది రైతులను దగా చేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భగ్గుమన్నారు. అబద్ధాలు, అభూతకల్పనలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతులను నిలువునా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి, ఎనిమిది నెలలుగా ఊరించి మూడు విడతలుగా మోసం చేసిన వైనాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. ఈ 2వ పేజీలో



అబద్ధాలతో అధికారంలోకి..

అబద్ధాలు, అభూతకల్పనలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతులను నిలువునా మోసం చేశారు. ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఊదరగొట్టి.. ఎనిమిది నెలలుగా ఊరించి మూడు విడతలుగా రైతులను దగా చేశారు.

-కేటీఆర్

వడ్డీ చెల్లిస్తేనే మాఫీ



- అదనపు రుణం చెల్లించాక..
- అర్హత ఉంటే రుణమాఫీ చేస్తాం
- మేం 17,933 కోట్లు మాఫీ చేశాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 5

అర్హులను పెంచుతారట!



- రైతుల ఆందోళనతో మంత్రి బుజ్జగింపు ప్రకటన
- రుణమాఫీకి మరో 12 వేల కోట్లిస్తామన్న పొంగులేటి
- అర్హులందరికీ వర్తింపజేస్తామని పరకాలలో హామీ
- ఆగ్రహంగా ఉన్న అన్నదాతలను శాంతపరిచేందుకేనా?
- 100% పూర్తయినట్టు ఎలా చెప్పారని విపక్షాల ప్రశ్న 2

దళిత రైతుకు దగా



- రైతు సమాచార పత్రంలో ఉద్యోగిగా గుర్తింపు
- అసంబద్ధమైన కారణంతో కంగుతిన్న సుమన్
- సర్కారు తప్పిదం..1.92లక్షల మాఫీకి టోపీ
- నిజామాబాద్ జిల్లా రైతుకు చేదు అనుభవం 5

2 లక్షలు దాటినోళ్లకు రుణమాఫీ ఎప్పుడు?

- ఊసే ఎత్తని ప్రభుత్వం.. రైతుల్లో అయోమయం
- కుటుంబ రుణం వేర్వేరు బ్యాంకుల్లో ఉంటే ఎలా?
- 2 లక్షలు దాటినోళ్లు 20 లక్షల మంది రుణ రైతులు
- మాఫీ కావాలంటే.. మళ్లీ అప్పు చేయాల్సిందేనా! 5

అల్లుడా.. మజాకా?

ఆయిల్‌పామ్ కంపెనీ హస్తగతానికి మంత్రి అల్లుడు, కొడుకు స్కెచ్



- సాగుకు మూడేండ్లుగా కంపెనీ కోట్ల పెట్టుబడి
- పంట చేతికి రావడంతో మంత్రి బంధువుల కన్ను
- ప్రీ యూనిక్ ఇండియా కంపెనీకి బెదిరింపు
- కంపెనీని విక్రయించాలని ఓనర్లపై ఒత్తిడి
- కోట్లలో పెట్టుబడి పెట్టిన ప్రీ యూనిక్
- పంట చేతికొచ్చే సమయానికి కబ్జా యత్నం

ఆయిల్‌పామ్ సాగు కోసం మూడేండ్లుగా రూ.కోట్లు పెట్టుబడి పెట్టారు.. ఇప్పుడిప్పుడే పంట చేతికొస్తున్నది.. ఈ సమయంలో ఆ కంపెనీపై ఓ మంత్రి బంధువుల కన్నుపడింది. ఇంకేముంది..! ఆ కంపెనీని తమకు అమ్మేయాలంటూ సదరు కంపెనీ ప్రతినిధులపై బెదిరింపులకు దిగుతున్నారు. ఆయిల్‌పామ్ సాగులో భాగస్వామ్యమైన ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఓ మంత్రి బంధువుల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): ఆయిల్ పాం కంపెనీని తమకు విక్రయించాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నట్టు సమాచారం. దీనికి మంత్రి కూడా వత్తాసు పలుకుతున్నట్టు తెలిసింది. తన మేనల్లుడు, కొడుకుకు కంపెనీని కట్టబెట్టేందుకు తనవంతుగా ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు గత ప్రభుత్వం జిల్లాలవారీగా కంపెనీలను ఎంపిక చేసింది. ఇందులో ప్రభుత్వరంగ 5వ పేజీలో



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగమైన ఉద్దండాపూర్ కాల్వలపై లిఫ్టులు ఏర్పాటుచేసి కొడంగల్, నారాయణపేటకు నీళ్లిచ్చే ప్రతిపాదనలున్నా, గతంలోనే ఉన్నప్పటికీ, వాటిని పక్కనపెట్టి 4,350కోట్ల వ్యయంతో ఈ లిఫ్ట్ చేపడుతుండటంపై సాగునీటిరంగ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సొంత ఇమేజ్ కోసమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు చేపడుతూ వేల కోట్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ స్కీమ్ వల్ల రాజీవ్‌భీమా ఆయకట్టుకు ముప్పు ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొడంగల్ లిఫ్ట్ 'మేఘా' చేతికే!

- అందుకోసమే టన్నెల్స్ కాదని ప్రెషర్స్ మెయిన్స్
- రూ.4,350 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం
- ఉద్దండాపూర్‌ను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- సుంకిశాల ఘటనతో మేఘా సంస్థపై విమర్శలు
- బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్లున్నా అటే మొగ్గు

హైదరాబాద్, ఆగస్టు18 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు మేఘా కంపెనీకే దాదాపు ఖరారైనట్టు ఇరిగేషన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఆ కంపెనీకి పనులను అప్పగించేందుకే ప్రాజెక్టులోకి ప్రెషర్ మెయిన్స్‌ను తీసుకొచ్చారని చెప్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా.. మేఘా సంస్థను ఈస్టిండియా కంపెనీతో పోల్చిన రేవంత్‌రెడ్డి సర్కారులో ఇప్పుడు అదే సంస్థకు పనులు దక్కుతుండటం గమనార్హం. ఇటీవల సుంకిశాల ఘటనలో రిటైనింగ్‌వాల్ కూలిన విషయం 8వ పేజీలో



కౌలు రైతు ఆత్మహత్య

- పంటలు పండక ఆవేదన
- అప్పులు తీరక బలవన్మరణం
- హనుమకొండ జిల్లాలో విషాదం 6


సర్వేల్‌లో వసీం మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, పిల్లలు

జీతాల్లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

- నాలుగేండ్లుగా సూర్యాపేట దవాఖానలో ఉద్యోగం
- మూడు నెలలుగా వేతనాల్లేక ఇబ్బందుల్లో కుటుంబం
- మనస్తాపంతో ఆపరేటర్ వసీం అక్తర్ ఖాన్ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లోనే ఉరేసుకొని మృతి
- వసీం ఆత్మహత్యకు బాధ్యులెవరు.. కేటీఆర్ నిలదీత 6

వేతనాలివ్వలేం.. ఓపిక పట్టండి!

- 2008 డీఎస్సీ ఉద్యోగాలపై ప్రభుత్వం నాన్చుడు
- జీతాలివ్వలేక నియమించడం లేదన్న ఓ మంత్రి
- ఆరునెలలైనా అమలుకాని క్యాబినెట్ నిర్ణయం
- 27లోగా పూర్తి చేస్తామని కోర్టుకు విన్నపం
- ఆందోళనలో 1,500 మందికి పైగా అభ్యర్థులు 6

ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై రేపు సుప్రీం విచారణ

- సుమోటోగా కేసు స్వీకరణ
- ప్రతి 2 గంటలకు నివేదిక ఇవ్వండి: కేంద్రం ఆదేశాలు 7

సబ్‌కమిటీల పాలన

- ప్రతి నిర్ణయానికి క్యాబినెట్ సబ్ కమిటీలు
- నేరుగా నిర్ణయం తీసుకొనే అంశాలపైనా దాటవేత
- ఒక్కో మంత్రికి నాలుగైదు కమిటీల్లో చోటు
- తికమకపడుతున్న శాఖ, పేషీ అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): ప్రజోపయోగ నిర్ణయాలను వేగంగా తీసుకొని, అమలుచేయాల్సిన రాష్ట్రప్రభుత్వం 'క్యాబినెట్ సబ్ కమిటీ'ల పేరుతో కాలక్షేపం చేస్తున్నది.



కీలకమైన అంశాలపై కమిటీలు వేసి, సంప్రదింపుల పేరుతో నెలలపాటు నెట్టుకొస్తున్నది. నేరుగా నిర్ణయం తీసుకోకుండా నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇదే తంతు. ఒక్కో మంత్రి నాలుగైదు కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. దీంతో ఆయా శాఖల అధికారులు, మంత్రుల పేషీల్లోని అధికారులు ఏ సమావేశం ఎప్పుడు జరుగుతుందో తెలియక తికమకపడుతున్నారు. మంత్రుల వ్యక్తిగత, 8వ పేజీలో

బీసీలు మందుకు ఆశపడ్తరు

- ఎన్నికల్లో ఓట్లు అమ్ముకుంటరు
- రెడ్లను నమ్ముతున్నరు.. వారి ఓట్లను మందుతో కొనగలరా?
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు
- అయిలయ్య సీఎం పదవికి అర్హుడే
- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

గుండాల, ఆగస్టు 18 : సర్వాయి పాపన్నగౌడ్ గోల్కొండ కోటను జయించడానికి బహుజనులను వెంట బెట్టుకుని వెళ్తే.. బహుజనులు మాత్రం రెడ్లను నమ్ముకుని ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల 5వ పేజీలో


బేర సత్యనారాయణను దవాఖానకు తరలిస్తున్న పోలీసులు

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఒత్తిడితో అక్రమ కేసులు పెడుతున్నారని గొంతుకోసుకున్న సత్యనారాయణ
- మంచిర్యాల జిల్లాకేంద్రంలో దారుణం 6

జీతాల్లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

- మూడు నెలలుగా వేతనాలు రాక వేదన
- సూర్యాపేట వైద్యశాల డాటా ఎంట్రీ ఆపరేటర్ వసీం అక్తర్ ఖాన్ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకొని మృతి
- వసీం ఆత్మహత్యకు బాధ్యులెవరు : కేటీఆర్ నిలదీత



వసీం మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్/సంస్థాన్ నారాయణ పురం, ఆగస్టు 18 : మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించే దారిలేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన వసీం అక్తర్ ఖాన్ (43) అదే గ్రామానికి చెందిన ఫౌజియా బేగం అలియాస్ రజినీని 15 ఏండ్ల కింద మతాంతర వివాహం చేసుకున్నాడు. నాలుగేండ్లుగా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఫౌజియా బేగం కూడా ఇదే వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. సూర్యాపేట ఇందిమ్మకాలనీ ఫేజ్‌- 1లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. మూడు నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించక పోవడంతో భార్యాభర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక పోవడంతో తినడానికి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసీం శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయాడు. ప్రస్తుతం సూర్యాపేట జనరల్ వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని మార్చేందుకు అధికారులు ప్రయత్నించినా కోర్టుకు వెళ్లి మరో ఏడాది పాటు కొనసాగేలా ఉత్తర్వులు తెచ్చుకున్నట్టు తెలిసింది. మూడు నెలలుగా వేతనాలు రాక పోవడం వల్ల మనోవేదనతోనే వసీం ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు చెప్తున్నారు. భార్య ఫౌజియా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

'డియర్ రజినీ నన్ను క్షమించు..'

ఆత్మహత్యకు ముందు వసీమ్ తన భార్యకు లేఖ రాసి గదిలో పెట్టాడు. 'డియర్ రజినీ.. నన్ను క్షమించు.. నిన్ను ఎంతో బాధపెట్టాను. ఏదో సాధించాలనుకున్నా కానీ సాధ్యం కాలేదు' అని లేఖలో పేర్కొన్నాడు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనరల్ హాస్పిటల్‌లో వసీమ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి : కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

వసీం ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సర్వేల్ గ్రామానికి వెళ్లి వసీం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు.

ఈ పాపం ఎవరిది?

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సూసైడ్‌పై కేటీఆర్ ఆవేదన
- మూడు నెలలుగా జీతమివ్వకపోవడంపై ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసీం ఆత్మహత్యకు బాధ్యులెవరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో వసీం ఆర్థిక ఇబ్బందుల పాలై మనస్తాపంతో ఉరేసుకొని చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆదివారం ఎక్స్‌వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. వసీంకు ముగ్గురు ఆడపిల్లలున్నారని, వారికి ఆరోగ్యం సరిగా లేక అవస్థలు పడుతున్నారని, ఇందుకు కారణం సర్కార్ కాదా? అని నిలదీశారు. పిల్లలను కనీసం దవాఖానలో చూపిద్దామంటే చిల్లిగవ్వ లేని దుస్థితి వల్లే వసీం ఆత్మహత్యకు పాల్పడ్డాడని కేటీఆర్ పేర్కొన్నారు. వసీం భార్య కూడా అదే వైద్యశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అని, ఒకటో తారీఖునే జీతాలిస్తున్నామని పేర్కొనే సర్కార్ డొల్లతనానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు.

అనంతరం మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు అందిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నదని, వాస్తవ పరిస్థితులు అలా లేవని, సమయానికి వేతనాలు రాక చిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసీం కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కేవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాంబాబు యాదవ్, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల కన్వీనర్ నర్రి నరసింహ ఉన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

- పంటలు పండక.. అప్పులు తీరక బలవన్మరణం
- హనుమకొండ జిల్లాలో విషాదం



అనిల్‌కుమార్ (ఫైల్)

వేలేరు, ఆగస్టు 18: పంటలు పండక, అప్పుల తీరక మనస్తాపంతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. వేలేరు మండలం శాలపల్లికి చెందిన దామెర అనిల్ కుమార్ (31) గ్రామంలో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలు సరిగ్గా పండక సుమారు రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. 3 నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఏడాదిపాటు విశ్రాంతి తీసుకున్నాడు. దీంతో అప్పు సుమారు 6.50 లక్షలకు పెరిగింది. వీటిని ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గురయ్యాడు. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి వెనుకాల పడి ఉండగా గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'రాఖీ'కి సాధారణ సెలవునివ్వండి: టీఎస్‌జీహెచ్‌ఎం

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): బాలికలు, ఆడబిడ్డలు ఘనంగా జరుపుకునే రాఖీపండుగను ఐచ్ఛిక సెలవుగా కాకుండా సాధారణ సెలవుగా ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్‌ఎం) ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ సెలవుల ఉత్తర్వుల్లో ఐచ్ఛిక సెలవు స్థానంలో సాధారణ సెలవుగా మార్చాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రాజభాను, ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాశ్, ఆర్ రాజుగంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లోని బాలికలు, మహిళా ఉపాధ్యాయులకు సెలవులివ్వాల్సి ఉందని విజ్ఞప్తిచేశారు.

రాష్ట్రంలో మరో ఐదు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో ఐదురోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కర్ణాటకను ఆనుకొని తెలంగాణ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలతో పాటు, నగరంలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం నుంచి పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలో 556.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 59శాతం అధికం. గత 24 గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో 5.54 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణకేంద్రం తెలిపింది.



జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతున్న టీ ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

- 36 డిమాండ్లపై ఉద్యమానికి సిద్ధం
- టీఉద్యోగ జేఏసీ రాష్ట్రచైర్మన్ మారం జగదీశ్వర్

జగిత్యాల, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని టీ ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవోస్ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ స్పష్టంచేశారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, నగదురహిత వైద్య సేవలు, 317 జీవో రద్దు, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో జేఏసీ కోశాధికారి షాహిద్ బాబు, సహ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, టీ పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్, టీజీవో నాయకులు కందుకూరి రవిబాబు ఉన్నారు.

వేతనాలివ్వలేం.. ఓపిక పట్టండి!

- 2008 డీఎస్సీ ఉద్యోగాలపై ప్రభుత్వం నాన్చుడు
- జీతాలివ్వలేక నియమించడం లేదన్న ఓ మంత్రి
- ఆరునెలలైనా అమలుకాని క్యాబి నెట్ నిర్ణయం
- ఆందోళనలో 1,500 మందికి పైగా అభ్యర్థులు



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్టు' ఉన్నది 2008 డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి. వీరికి ఉద్యోగాలివ్వాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా, కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలిస్తామని మంత్రి మండలి నిర్ణయం తీసుకున్నా అమలుకాక వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితేం బాగాలేదు. ఇప్పుడు మిమ్మల్ని ఉద్యోగాల్లోకి తీసుకుంటే వెంటనే జీతాలు ఇవ్వాల్సి వస్తుంది. కాస్త ఓపికపట్టండి' ఇవి 2008 డీఎస్సీ అభ్యర్థులతో ఓ మంత్రి అన్న మాటలు. ఉద్యోగాలు ఇవ్వాలని ఆరునెలల కిందటే క్యాబినెట్ నిర్ణయించింది. త్వరలో మీ నియామకాలు జరుగుతాయని క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులూ చెప్తున్నారు. ఈ నెల 27లోగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని స్వయంగా అడ్వకేట్ జనరల్ హైకోర్టు ధర్మాసనం వద్ద మాట ఇచ్చారు. ఈ నేపథ్యంలో తమకు ఉద్యోగాలు వచ్చినట్టేనని భావిస్తున్న ఆ అభ్యర్థులు ఆ మంత్రి మాటతో ఇప్పుడు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. హైకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు.. డీఎస్సీ 2008 అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఫిబ్రవరి 24న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ డీఎస్సీ 2008 బాధితులకు ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు ప్రచారం చేసింది. అధికారులు వివరాలు సేకరించగా దాదాపు 1,500 మంది వరకు ఉన్నట్టు తేలింది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి ఉద్యోగాల్లో చేరుతారని భావించారు.

క్యాబినెట్ సబ్ కమిటీ పేరుతో కాలయాపన

డీఎస్సీ–2008 అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చే అంశంపై ప్రభుత్వం విధివిధానాల రూపకల్పన బాధ్యతను మంత్రి దామోదర రాజనర్సింహా నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగిస్తూ మార్చి 14న ఉత్తర్వులు జారీచేసింది. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. అప్పటి నుంచి అభ్యర్థులు మంత్రుల చుట్టూ, విద్యాశాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అదిగో, ఇదిగో అంటూ తిప్పుకుంటున్నారే తప్ప ప్రక్రియను పూర్తి చేయడం లేదు. ఈ కేసుపై ఈ నెల 8న హైకోర్టులో జరిగిన వాదనల సందర్భంగా మూడు వారాల్లోగా నియామకాలు పూర్తి చేస్తామని 'చివరి అవకాశం' ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ కోరడంతో.. ధర్మాసనం ఈ నెల 27వ తేదీకి విచారణను వాయిదా వేసింది.

సర్కారుపై ఆర్టీసీ కార్మికుల జంగ్‌సైరన్

- ఈ నెల 27న నల్లబ్యాడ్జీలతో నిరసన
- సెప్టెంబర్ 10న 'డిమాండ్ డే'.. అక్టోబర్ 1న నిరాహార దీక్ష
- ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రసర్కారుపై ఆర్టీసీ కార్మికులు జంగ్‌సైరన్ మోగించారు. పెండింగ్ డిమాండ్లపై ప్రభుత్వంతో తేల్చుకునేందుకు ఆర్టీసీ జేఏసీ సిద్ధమవుతున్నది. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న ఆదివారం ప్రకటించారు. ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా 'నల్లబ్యాడ్జీలతో' నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 10న హామీలను అమలు చేయాలని కోరుతూ 'డిమాండ్ డే ' పేరిట నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించనున్నట్టు చెప్పారు. అక్టోబర్ 1న ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో వెంటనే జేఏసీలను ఏర్పాటు చేయాలని వెంకన్న పిలుపునిచ్చారు. టీజీఎస్‌ఆర్టీసీలో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని ఆర్టీసీ జేఏసీ భావిస్తున్నది. కార్మికులపై రోజురోజుకూ పనిభారం మోపుతూ వేధింపులకు గురి చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జేఏసీ తరఫున 40 అంశాలతో కూడిన మెమోరాండాన్ని ప్రభుత్వానికి అందజేశారు. రవాణాశాఖ మంత్రి, ఆర్టీసీ ఎండీ, రవాణాశాఖ కమిషనర్‌ను కలిసి ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ డిమాండ్లను వారి ముందు పెట్టారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నా, పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడుతున్నారు. ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన బాండ్ల బకాయిలు రూ. 200కోట్లు, 2 పీఆర్సీ బకాయిలు, డీఏలు ఇప్పటి వరకు పరిష్కారం కాకపోవడం కార్మికుల్లో అసహనం పెంచుతున్నది.

ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహించాలి

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డుల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటలు మాత్రమే డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 11 గంటలు, డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారని వాపోతున్నారు. డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు ఎలాంటి అదనపు అలవెన్సులు చెల్లించడం లేదని మండిపడుతున్నారు. పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

అల్లుడిని పిలిచి అంతమొందించాడు

పెద్దపల్లి జిల్లాలో దారుణహత్య

జూలపల్లి, ఆగస్టు 18: మద్యం సేవిద్దామని ఇంటికి పిలిచిన మామ.. అల్లుడిని హతమార్చిన ఘటన పెద్దపల్లి జిల్లాలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్‌కి చెందిన జేజేల అశోక్ అలియాస్ చెత్తయ్య (45)కు అదే గ్రామానికి చెందిన జాడి కనకయ్య 20 ఏండ్ల క్రితం కూతురిని ఇచ్చి వివాహం చేశాడు. అశోక్ వ్యవసాయం చేస్తున్నాడు. మామ, అల్లుడికి పదేండ్లుగా గొడవలు ఉన్నాయి. అల్లుడికి తన భార్యతో వివాహేతర సంబంధం ఉన్నదన్న అనుమానంతో చంపేయాలని మామ భావించాడు. మద్యం తాగుదామని అశోక్‌ను ఆదివారం ఇంటికి పిలిచాడు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. ఆ తర్వాత ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా.. కనకయ్య ఇనుప రాడ్, బండరాయితో అశోక్ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అశోక్‌కు భార్య అంజలి, నలుగురు కూతుర్లు ఉన్నారు.

టీజీఎస్పీడీసీఎల్‌లో 2,263 మందికి ప్రమోషన్

- ఎట్టకేలకు ఏడున్నరేండ్లకు వీడిన గ్రహణం
- త్వరలోనే పోస్టింగ్‌లు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో పదోన్నతులకు ఏడున్నరేండ్ల తర్వాత గ్రహణం వీడింది. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఆదివారం ఏకంగా 2,263 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. జూనియర్ లైన్‌మన్ నుంచి సీజీఎం వరకు పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఒకరికి జాయింట్ సెక్రటరీగా ఉద్యోగోన్నతి కల్పించారు. జీఎం నుంచి సీజీఎంలుగా ఇద్దరికి, ఎస్‌ఈవో నుంచి జీఎంలుగా మరో ఇద్దరికి అవకాశం కల్పించారు. మరో 8 మంది డీఈలకు ఎస్‌ఈలుగా, 30 మంది ఏడీఈలకు డీఈలుగా, 58 మంది ఏఈ/ఏఈఈలకు ఏడీఈలుగా పదోన్నతులు కల్పించారు. జేఎల్‌ఎం స్థాయి నుంచి ఏఎల్‌ఎంలుగా 1650 మందికి ప్రమోషన్ కల్పించారు. అకౌంట్స్ విభాగాల్లో వివిధ క్యాటగిరీల్లో 50 మందికి పదోన్నతులు కల్పించారు. ఆపరేషన్, మెయింటెనెన్స్ (ఓ అండ్‌ఎం) విభాగంలో మరికొందరికి పదోన్నతులు కల్పించారు. త్వరలోనే బదిలీలను చేపట్టి వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఆయా పోస్టులు ఖాళీ కావడంతో త్వరలోనే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేసేందుకు వీలుపడనున్నది. పదోన్నతుల విషయంలో కొన్నిసంఘాలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, పదోన్నతులు ఎట్టి పరిస్థితుల్లో ఆపొద్దని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈజేఏసీ) ప్రతినిధులు శనివారం సీఎండీ ముషారఫ్‌కు సూచించారు. 2,500 మందికి పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు.

సంఘాల ఆధ్వర్యంలో సంబురాలు

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ పదోన్నతులు కల్పించడంతో విద్యుత్తు ఉద్యోగులు ఆదివారం మింట్ కంపౌండ్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్షీరాభిషేకం చేయడమే కాకుండా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. సంబురాల్లో జేఏసీ కో చైర్మన్ పీ అంజయ్య, కో కన్వీనర్ రామేశ్వరయ్యశెట్టి, సీజీఎంలు మోహన్‌రెడ్డి, కామేశ్, కృష్ణారెడ్డి, టీఈజేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విలీనం వార్తలపై బీఆర్‌ఎస్ ఆగ్రహం

- ఆర్టీవీ నెట్‌వర్క్‌కు, రవిప్రకాశ్‌కు బీఆర్‌ఎస్ లీగల్ నోటీసులు
- అసత్య కథనాలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 5 రోజుల్లో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అంటూ తప్పుడు కథనాలను ప్రసారం చేసినందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆర్‌టీవీ నెట్‌వర్క్, రవిప్రకాశ్‌పై బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ నోటీసులు జారీ చేసింది. పార్టీ, పార్టీ అధినేత కేసీఆర్‌పై, ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలను ప్రచురించినందుకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించి, 4 కోట్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే రీతిలో ఆర్‌టీవీ అసత్యకథనాలను ప్రసారం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. 2014 నుంచి 2023 దాకా తెలంగాణను కేసీఆర్ దేశానికే దిక్సూచిగా నిలిపారని, ఈ క్రమంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై బీఆర్‌ఎస్ చేసిన పోరాటాన్ని లీగల్ నోటీసులో ప్రస్తావించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలే ప్రాణప్రదంగా కొనసాగుతున్న బీఆర్‌ఎస్ పార్టీని, పార్టీ అధినేత కేసీఆర్ ప్రతిష్ఠను ఆర్‌టీవీ దిగజార్చిందని, బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అంటూ నిరాధారమైన కథనాలను ప్రసారం చేసిందని ధ్వజమెత్తింది. ఆర్‌టీవీ నెట్‌వర్క్, రవిప్రకాశ్ ఐదు రోజుల్లో క్షమాపణ చెప్పి, ఆ నెట్‌వర్క్‌లో ఉన్న తప్పుడు కథనాల లింకులను తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

రేపు నాందేడ్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్రస్థాయి సమావేశం

మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే

ముంబై, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): త్వరలో మహారాష్ట్రలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సి న వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం నాందేడ్‌లో భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రైతు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత నెల కొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహించలేదని పేర్కొన్నారు. ఇక ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీ చేసే అంశంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

- ఏసీపీ కార్యాలయంలోనే గొంతు కోసుకున్న బేర
- ఎమ్మెల్యే పీఎస్సార్ ప్రోద్బలంతోనే అక్రమ కేసు పెట్టారని ఆరోపణ
- విచారణ కోసమే పిలిపించాం: ఏసీపీ ప్రకాశ్ వివరణ
- ఉన్నతాధికారులు విచారణ జరపాలి: మాజీ ఎమ్మెల్యే



దవాఖానలో సత్యనారాయణ, ఏసీపీ మధ్య సంభాషణ

మంచిర్యాల ప్రతినిధి (నమస్తే తెలంగాణ)/మంచిర్యాల టౌన్, ఆగస్టు 18: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌పై కక్షకట్టారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక నస్పూరు మున్సిపాలిటీలో 21వ వార్డుకు కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న బేర సత్యనారాయణ కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే పోలీసులు ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ ఘటన శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో చోటుచేసుకుంది. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనపై కక్షకట్టి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, గతంలో కూడా కేసులు పెట్టించారని ఆరోపించారు. నస్పూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 14లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో తనకు రెండు ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. ఆ వెంచర్‌లోని మురుగు కాలువను ఆక్రమించారని అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ సతీశ్ అక్కడికి వెళ్లి విచారణ జరిపారని, కాలువ కబ్జాకు గురైందని నిర్ధారించుకున్న కమిషనర్.. మురుగు కాలువలో వేసిన మట్టిని తవ్వించి యథావిధిగా మార్చారని చెప్పారు. ఈ విషయంలో కమిషనర్‌తోపాటు ఫిర్యాదు చేసిన స్థానికులకు, తనకు మాటామాటా పెరిగిందని, ఈ క్రమంలో కమిషనర్‌ను తాను కులం పేరుతో దూషించినట్టు, విధులకు ఆటంకం కలిగించినట్టు తనపై నస్పూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న తనను పోలీసులు బలవంతంగా మంచిర్యాల ఏసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారని, దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఇక్కడే కేక్ కట్ చేసే కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సత్యనారాయణ వాపోయారు. కాగా.. నస్పూరు మున్సిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో విచారణ కోసమే పిలిపించామని మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్ స్పష్టంచేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆరోపించడం సరైంది కాదని, తాను ఇక్కడకు వచ్చి ఆరు నెలలే అయిందని, అంతకన్నా ముందు సత్యనారాయణపై ఏడెనిమిది కేసులున్నాయని వివరించారు. అంతకుముందు కూడా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని, ఆ కేసు కోర్టులో నడుస్తున్నదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు విషయంలో విచారణకు రావాలని పిలిచినా రాలేదని, అందుకే పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లి తీసుకొచ్చారని తెలిపారు. సత్యనారాయణ గొంతుకోసుకుని కేసును దారి మళ్లించాలని చూస్తున్నారని, విచారణకు ఆయన రాని పక్షంలో తన తరపున ఎవరినైనా పంపించాల్సి ఉంటుందని ఏసీపీ వివరించారు. నస్పూరు మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపై అక్రమ కేసు పెట్టిన పోలీసులు.. మున్సిపల్ కమిషనర్‌పై ఆయా శాఖల ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులే లక్ష్యంగా, వారిని ఇబ్బందులకు గురిచేసే చర్యలు సాగుతున్నాయని ఆరోపించారు.



జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల 1:2 అభ్యర్థులు

గురుకుల పోస్టుల భర్తీలో డౌన్‌మెరిట్ అమలు చేయండి

సీఎం రేవంత్ ఇంటి ఎదుట 1:2 అభ్యర్థుల నిరసన

హైదరాబాద్, ఆగస్టు18 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల భర్తీలో డౌన్‌మెరిట్‌ను అమలు చేయాలని కోరుతూ 1:2 అభ్యర్థులు డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట శాంతియుత నిరసన చేపట్టారు. ''సీఎం రేవంతన్నకు 1:2 ఆడపడచుల రాఖీ పండుగ శుభాకాంక్షలని తెలుపుతూనే, మరోవైపు గురుకుల పోస్టుల భర్తీలో డౌన్‌మెరిట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిబ్ డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకపోవడం, ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపట్టడంతోనే గురుకుల పోస్టుల్లో భారీగా బ్యాక్‌లాగ్‌లు ఏర్పడుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డౌన్ మెరిట్‌ను అమలు చేసి బ్యాక్‌లాగ్‌లు లేకుండా చూడాలని 6నెలలుగా పోరాడుతున్నారు. ప్రజాప్రతినిధుల ఇండ్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుటనే నిరసనకు దిగారు. ఆదివారం సైతం మరోసారి అభ్యర్థులు రేవంత్‌రెడ్డి ఇంటికి తరలివచ్చారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ డౌన్ మెరిట్‌కు అనుకూలంగానే కోర్టు సైతం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిందని, అయినా ట్రిబ్ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డౌన్‌మెరిట్ అమలుకు జీవో 81 అడ్డంకి కాబోదని అభ్యర్థులు వెల్లడించారు. నరేందర్, శ్రీనివాస్, సునీత, మహేశ్, రేణుక, సాయికుమార్, నాగలక్ష్మి, లలిత, పరమేశ్వరి, శైలజ, సంపత్, రమణి తదితరులు నిరసన వ్యక్తంచేశారు.

2014లో కేసీఆర్ సర్కారు చేసిన లక్ష రుణమాఫీ కంటే **2024**లో రేవంత్ సర్కారు చేసిన **2** లక్షల రుణమాఫీలో రైతుల సంఖ్య తగ్గింది... మాఫీ మొత్తమూ తగ్గింది.


వివరాలు

జిల్లా	2014	2024	తగ్గుదల
నల్లగొండ.	**4.95.000**	**3.32.490.**	**1.62.510**
కరీంనగర్.	**3.77.984**	**2.60.651.**	**1.17.333**
నిజామాబాద్.	**3.79.520.**	**1.76.056**	**2.03.464**
ఖమ్మం.	**3.58.026**	**1.72.433.**	**1.85.593**
మహబూబ్నగర్	**6,02,085**	**3.38.548.**	**2.63.537**
మెదక్	**4.17.591.**	**2.85.493.**	**1.32.098**
వరంగల్.	**4.13.474.**	**2.64.781.**	**1.48.693**
ఆదిలాబాద్	**3.16.195.**	**2.28.085.**	**8.8110**
రంగారెడ్డి.	**2.10.252**	**1.79.484**	**30.768**
మొత్తం	**35.67.** లక్షల	**22.38.** లక్షల.	**13.32** లక్షలు

2014 2024 నాటికి
రైతుల సంఖ్య భారీగా **45**లక్షల నుంచి **70** లక్షలకు పెరిగింది. సాగు విస్తీర్ణం **1.31** కోట్ల ఎకరాల నుంచి **2.38** కోట్ల ఎకరాలకు పెరిగింది.
రైతులు తీసుకున్న పంట రుణాల మొత్తం **33** వేల కోట్ల నుంచి **65** వేల కోట్ల రూపాయలకు పెరిగింది.
అప్పుడు లక్ష్మ రుణమాఫీ **36. 68** లక్షల మంది అర్హులయ్యారు. రూ. **19, 198** కోట్లు ఖర్చులయ్యాయి.
మరిప్పుడు **2** లక్షల రుణమాఫీకి అంతకంటే తక్కువ మందే ఎలా అర్హులవుతారు? అంతకంటే తక్కువ మొత్తం ఎలా సరిపోతుంది?
journalist Shankar

నమస్తే తెలంగాణ

హోమ్ లోన్ Vs సిప్



25 ఏండ్ల ఈఎంఐ.. 10 ఏండ్ల పెట్టుబడి

రూ.80 లక్షల ఇంటిని సొంతం చేసుకోడానికి ఏది దగ్గర దారి

సొంతింటి కల సాకారానికి చక్కని మార్గం ఏదని అడిగితే ఎవరైనా గృహ రుణమేనని టక్కున చెప్తారు. అయితే కాస్త తెలివితో.. ఇంకాస్త ధైర్యంతో ఆలోచిస్తే ప్రత్యామ్నాయ దారులూ కనిపించక మానవు. అలాంటి వాటిలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఒకటి. మ్యూచువల్ ఫండ్‌లో మీరు సిప్‌ను మొదలు పెట్టినట్టైతే గృహ రుణ కాలపరిమితిలో సగం సమయానికే సొంతింటి కలను సాకారం చేసుకోవచ్చు. ఒక్కసారి పరిశీలిస్తే.. దినేశ్, సురేశ్ స్నేహితులు. ఇద్దరి వయసూ, సంపాదన ఒక్కటే. ఇద్దరూ సొంతిల్లు కోసం కష్టపడుతున్నారు. అయితే దినేశ్ హోమ్ లోన్ తీసుకుని సొంతింటి కలను ముందుగానే నెరవేర్చుకున్నాడు. కానీ సురేశ్ పెట్టుబడుల వైపు నడిచాడు. ఆ తర్వాత జరిగిందిది..

గృహ రుణంలో..

9 శాతం వార్షిక వడ్డీరేటుకు రూ.80 లక్షల గృహ రుణాన్ని 25 ఏండ్ల కాలపరిమితితో దినేశ్ తీసుకున్నాడు. నెలనెలా ఈఎంఐ రూ.67,136గా ఉన్నది. మొత్తం రుణ కాలపరిమితి 300 నెలల్లో దినేశ్ రూ.2,01,40,800 చెల్లించాల్సి వస్తున్నది. ఇందులో వడ్డీ భారమే రూ.1.2 కోట్లకు పైగా ఉన్నది.



సిప్ ఇన్వెస్ట్‌మెంట్‌లో..

ఇదే సమయంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో అంతే మొత్తాన్ని సురేశ్ పెట్టుబడిగా పెట్టాడు. 12 శాతం వార్షిక వృద్ధిని అందుకున్నాడు. నెలనెలా రూ.67,136 చొప్పున 10 ఏండ్లు మొత్తం రూ.80,56,320ని ఇన్వెస్ట్ చేశాడు. దీనిపై మరో రూ.75,41,996ను అదనంగా పొందాడు. పదేండ్లకే సురేశ్ దగ్గర రూ.1,55,98,316 ఉన్నది. మరో రెండేండ్లు తన పెట్టుబడిని అలాగే కొనసాగించాడు. అప్పుడు రూ.2.2 కోట్లు చేతికొచ్చింది. పెట్టిన పెట్టుబడి రూ.96,67,584గా ఉన్నది. దానిపై లాభం రూ.1,19,67,138 అందుకున్నాడు. ఇలా దినేశ్‌తో పోల్చితే.. సురేశ్ అందులో సగం కాలవ్యవధి అంటే 12 ఏండ్లకే ఇంటిని చేజిక్కించుకున్నాడు. నచ్చిన ఇంటిని తన దగ్గరున్న సొమ్ముతో కొనేసి రుణ భారం నుంచి తప్పించుకున్నాడు.

నెలనెలా రూ.50 వేలతో..

సిప్‌లో నెలనెలా రూ.50 వేలను పెట్టుబడిగా పెట్టి.. మిగతా మొత్తాన్ని అద్దె ఇంటికి చెల్లించారనుకుందాం. 10 ఏండ్లకు మీ పెట్టుబడులు రూ.60 లక్షలు అవుతాయి. దానిపై రూ.56,16,954 పొందవచ్చు. ఇలా 12 ఏండ్లు పెడితే అదనంగా రూ.89, 12,609 అందుకోవచ్చు. కనుక గృహ రుణం కన్నా.. సిప్ పెట్టుబడులే మిన్న అని చెప్పవచ్చు.

చివరగా..

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయన్న విషయాన్ని మరిచిపోవద్దు. లాభనష్టాలు ఇందులో సహజం. కాబట్టి పెట్టుబడులు పెట్టే ముందు సదరు ఫండ్ డాక్యుమెంట్లను పూర్తిగా చదివాకే నిర్ణయం తీసుకోవాలి. అయితే దీర్ఘకాల పెట్టుబడులు కాబట్టి లాభాలకు ఆస్కారం ఎక్కువనే చెప్పవచ్చు. అయినప్పటికీ వ్యక్తిగత రిస్క్‌పైనే ఈ ప్రతిఫలాలు ఆధారపడి ఉంటాయన్నది మరువద్దు. అలాగే గృహ రుణంపై వడ్డీరేట్లలో, సిప్ పెట్టుబడుల్లో రాబడుల్లో ఎక్కువ, తక్కువలూ ఉంటాయని గుర్తుంచుకోవాలి.

రాబడి

ఆటుపోట్లకు అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం లాభనష్టాల్లో కదలాడాయి. తొలి రెండు రోజులు నష్టాల్లో కదలాడిన సూచీలు.. చివరి రెండు రోజులు లాభాలను అందుకున్నాయి. ఆఖరి రోజు శుక్రవారం భారీగా పెరిగాయి. దీంతో నష్టాల ముప్పు తప్పింది. మదుపరులలో కొనుగోళ్ల జోష్ కనిపించింది. దీంతో ఓవరాల్‌గా గత వారం మార్కెట్లు లాభాలనే సంతరించుకున్నాయి. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్సేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 730.93 పాయింట్లు లేదా 0.91 శాతం ఎగిసి 80,436.84 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 173.65 పాయింట్లు లేదా 0.71 శాతం ఎగబాకి 24,541.15 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ఒడిదొడుకులకు ఎక్కువగా ఆస్కారం కనిపిస్తున్నది. దేశ, విదేశీ పరిణామాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణ దిశగా నడిచే వీలు లేకపోలేదనిపిస్తున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,800-25,100 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



తండ్రీ-కొడుకులు, భార్యా-భర్తల లావాదేవీలకూ

తాఖీదులేనా?



ఆదాయ పన్ను (ఐటీ) శాఖ మన ప్రతీ లావాదేవీపైనా ఓ కన్నేసి ఉంచుతుంది. అయితే తండ్రీ-కొడుకులు, భార్యా-భర్తలు, ఇతర కుటుంబ సభ్యుల మధ్య జరిగే నగదు లావాదేవీలపైనా ఐటీ నోటీసులు వస్తాయా? అన్న సందేహం రాకమానదు. అసలు ఎలాంటప్పుడు ఆదాయ పన్ను శాఖ అధికారుల నుంచి మనకు నోటీసులు వస్తాయి. వేటికి మినహాయింపు ఉంటుంది. ఒక్కసారి పరిశీలిస్తే..

ఇదీ సంగతి..

ఆదాయ పన్ను నిపుణుల వివరాల ప్రకారం.. భర్త నుంచి భార్యకు ప్రతినెలా గృహావసరాల కోసం నగదు ఇస్తే అందుకు ఐటీ నోటీసులు రావు. ఎందుకంటే ఈ నగదు.. భర్త ఆదాయం పరిధిలోకే వెళ్తుంది. అయితే ఈ మొత్తాలను భార్య ఎక్కడో ఓ చోట పెట్టుబడిగా పెడుతూ దానిపై ఆదాయం పొందితే మాత్రం ఐటీ తాఖీదులు తప్పవు. ఐటీ చట్టంలోని సెక్షన్ 269ఎస్ఎస్, 269టీ కింద రూ.20,000కు మించి ఉన్న నగదు లావాదేవీలపై జరిమానాలూ పడవచ్చు. అయినప్పటికీ చాలా కేసుల్లో మినహాయింపు లభించింది. ఇక తండ్రీ-కొడుకులు, ఇతర కుటుంబ సభ్యుల మధ్య నడిచే లావాదేవీలూ ఇదే కోవకు వస్తాయి.

ఐటీ నోటీసులను వివిధ కారణాలతో సంబంధిత అధికారులు జారీ చేస్తారు. వాటిలో..


- ఐటీ రిటర్న్స్ దాఖలు చేయకపోతే
- దాఖలు చేసిన రిటర్న్స్‌లో తేడాలుంటే
- టీడీఎస్ మొత్తాల్లో తప్పులు దొర్లితే
- అవసరమైన డాక్యుమెంట్లు ఇవ్వకపోతే
- భాగస్వాముల పేరిట పెట్టుబడులుంటే
- అధిక విలువ కలిగిన లావాదేవీలు చేస్తే
- సంపద పన్ను చెల్లింపుల కోసం
- యాదృచ్ఛిక పరిశీలనలో భాగంగా

మీ సిబిల్ స్కోర్ పెంచుకోండిలా?

సిబిల్ స్కోర్.. దీని ఆధారంగానే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు ఎవరికైనా రుణాలిస్తాయి, దానిపై వడ్డీ రేట్లను నిర్ణయిస్తాయి. కాబట్టి తప్పకుండా మన క్రెడిట్ స్కోర్ బాగుండాల్సిందే. అయితే ఈ స్కోర్ పెరగడానికి ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. కనుక వీటిని మర్చిపోవద్దు.

చెల్లింపులు: మీరు తీసుకున్న రుణాలకు సంబంధించి చేస్తున్న చెల్లింపుల తీరు మీ క్రెడిట్ స్కోరును అధికంగా ప్రభావితం చేయగలదు. సకాలంలో లోన్ పేమెంట్స్ ఉన్నట్టైతే క్రెడిట్ స్కోర్ బాగుంటుంది. అలస్యమైతే తగ్గుతుంది. అయితే అనవసరంగా లోన్ గ్యారంటీలకు వెళ్లకపోవడమే మంచిది.

తక్కువ రుణ భారం: విచ్చలవిడిగా తీసుకునే రుణాలూ మన క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తాయి. కాబట్టి అనవసరంగా అప్పులు చేయవద్దు. అవసరమైతే తప్ప రుణాల కోసం బ్యాంకుల్లో విచారణలూ చేయకపోవడం ఉత్తమం.



క్రెడిట్ నివేదిక తనిఖీ: మీ క్రెడిట్ స్కోర్‌ను తరచూ చెక్ చేసుకోవాలి. దీనివల్ల మీ రుణదాతలు చేసిన పొరబాట్లను గుర్తించి, సరిచేసుకోవచ్చు. రుణదాతలిచ్చే సమాచారం ప్రకారమే సిబిల్ స్కోర్ పెరగడం, తగ్గడం ఉంటుంది. కొన్నిసార్లు మన క్రెడిట్ స్కోర్‌ను అప్‌డేట్ చేయడం బ్యాంకర్లు మర్చిపోతారు. రుణాల చెల్లింపు వివరాలు సిబిల్‌కు ఇవ్వకపోవడం వల్ల నష్టపోతాం. ఆన్‌లైన్‌లో ఉచితంగానే క్రెడిట్ స్కోర్‌ను తెలుసుకోవచ్చు.

ఇంకా: మీరు ఏయే రుణాలను తీసుకుంటున్నారనేదానిపైనా మీ సిబిల్ స్కోర్ ఆధారపడి ఉంటుంది. వాటిని ఎంత బాధ్యతాయుతంగా చెల్లిస్తున్నారన్నది కీలకం. కనుక వాహన, గృహ, వ్యక్తిగత, విద్య, క్రెడిట్ కార్డు, గృహోపకరణాల రుణాల నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ)ను మరువద్దు.

నమస్తే తెలంగాణ

విదేశీ విద్యకు మోక్షమెప్పుడో!

ఆందోళనలో బ్రాహ్మణ విద్యార్థులు



హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ) : పేద బ్రాహ్మణుల విదేశీ విద్యకు సంబంధించిన వివేకానంద విదేశీ విద్యా పథకంపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నది. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విదేశీ విద్య కోసం ఇప్పటికే సంక్షేమ శాఖ దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాత్రం దరఖాస్తులు ఆహ్వానించకపోవడంపై ఆశావహుల్లో ఆందోళన నెలకొన్నది. వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినప్పటికీ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకమండలిని ఏర్పాటు చేయకపోవడం, సంక్షేమ పరిషత్ చేపడుతున్న పథకాల కొనసాగింపునకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంపై బ్రాహ్మణ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఏర్పాటు..

పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటుచేసి వివిధ సంక్షేమ పథకాలను అమలుచేసిన విషయం తెలిసిందే. ఇందులో వివేకానంద విదేశీ విద్యా పథకం ముఖ్యమైనది. విదేశాల్లోని వివిధ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన బ్రాహ్మణ విద్యార్థులకు ఈ పథకం కింద రూ.20లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏటా 100 నుంచి 150 మంది వరకు లబ్ధిపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.50కోట్లు కేటాయించింది. అయితే, నిరుద్యోగుల కోసం ఉద్దేశించిన స్వయం ఉపాధి పథకం, వివేకానంద విదేశీ విద్యా పథకానికి సంబంధించి లబ్ధిదారుల బకాయిలు రూ.50 కోట్లకుపైగా పెండింగ్ ఉండడం గమనార్హం. విదేశీ విద్యాలయాల్లో 2024-25విద్యా సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ కొనసాగుతున్నది. కానీ, ప్రభుత్వం ఇప్పటివరకు ఈ పథకంపై స్పష్టత ఇవ్వకపోవడం, దరఖాస్తులు ఆహ్వానించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.



నేడు తిరుమల ఆర్జిత సేవా టికెట్లు విడుదల

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): వచ్చే నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను సోమవారం విడుదల చేయనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల లక్కీడిప్ కోసం పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చని టీటీడీ అధికారులు తెలిపారు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా ఆర్జిత సేవల టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరోవైపు వరుసగా సెలవులు రావడంతో తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది. తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి గరుడసేవ జరుగనున్నది.

మంత్రి శ్రీధర్‌బాబుతో శ్రీలంక మంత్రి భేటీ

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల సహాయ మంత్రి సదాశివన్ వియలేందిరన్ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి శ్రీలంకకు ఎగుమతి చేయదగ్గ ఉత్పత్తులపై ఈ భేటీలో చర్చించారు. ఇప్పటికే మన రాష్ట్రం నుంచి ఔషధాలు, ఆర్గానిక్ కెమికల్స్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలు, విద్యుత్తు యంత్రాలు, న్యూక్లియర్ రియాక్టర్లు, బాయిలర్లు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, కెనడా, యూఏఈ, సౌదీ అరేబియా, జర్మనీ, బంగ్లాదేశ్ తదితర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాయి.

బీఏ యానిమేషన్‌లో ప్రవేశాల గడువు పెంపు

హైదరాబాద్, ఆగస్టు18 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కాలేజీలో నూతనంగా ప్రవేశపెట్టిన బీఏ యానిమేషన్ కోర్సులో ప్రవేశాల గడువును 24 వరకు పెంచారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులు ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. వరుసగా వచ్చిన సెలవుల నేపథ్యంలో దరఖాస్తుల గడువును పెంచామని తెలిపారు. వెబ్‌సైట్ https:// mjptbcwreis.telangana.gov.in లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలకు 9032 644463, 9063242329 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళల రక్షణలో బాధ్యులవ్వాలి

ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయల్



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : సురక్షిత సమాజం కోసం రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు తెలుపాలని, మహిళల రక్షణలో బాధ్యులు కావాలని వింగ్ డీజీ శిఖాగోయల్ ఎక్స్ వేదికగా కోరారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న నేరాలపై స్వీయ అవగాహన అవసరమని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించే విషయాల గురించి తెలుసుకోవాలని సూచించారు. గృహహింస, లైంగిక వేధింపులను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తమ పరిసరాల పరిధిలో ఎవరైనా అలా చేస్తే.. డయల్ 100కు కాల్ చేయాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరిగే నేరాలు, లైంగిక వేధింపులు, ర్యాగింగ్, గుడ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలపై ఇంట్లోని మగ పిల్లలకు తెలియజేయాలని శిఖాగోయల్ చెప్పారు.

వైద్యసిబ్బందికి రక్షణ కల్పించండి

మహిళా కమిషన్‌కు జూడాల విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): కోల్‌కతా ఘటన నేపథ్యంలో తెలంగాణలోనూ మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జూనియర్ డాక్టర్ల సంఘం(జూడా) నాయకులు మహిళా కమిషన్‌ను కోరారు. ఆదివారం టీ-జూడా ప్రతినిధి డాక్టర్ చంద్రిక నేతృత్వంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తదితర కాలేజీల జూడాలు తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఎస్ శారదను కలిసి మెమొరాండం అందజేశారు. మెడికోలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంతో కూడిన ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. క్యాంపస్ అంతటా సీసీటీవీతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని, స్థానిక పోలీస్ స్టేషన్లు లేదా కంట్రోల్ రూమ్‌లకు కనెక్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో పోలీసులు లేదా సీఆర్పీఎఫ్ లేదా సీఐఎస్ఎఫ్ భద్రత కల్పించాలని కోరారు. సెక్యూరిటీ ఆడిట్ జరగాలని సూచించారు. వేధింపుల పరిష్కారానికి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఇందులో జూడాలను భాగస్వాములను చేయాలని తెలిపారు. డిమాండ్లపై మహిళా కమిషన్ సానుకూలంగా స్పందించిందని జూడాలు పేర్కొన్నారు.

లండన్‌లో ఎయిర్ ఇండియా ఉద్యోగినిపై దాడి

హోటల్ గదిలోకి చొరబడ్డ దుండగుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: లండన్ హోటల్‌లో ఎయిర్ ఇండియా ఉద్యోగిని బస చేసిన గదిలోకి చొరబడ్డ ఓ దుండగుడు, ఆమెపై దాడికి పాల్పడ్డాడు. సమయానికి హోటల్ సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేరని, తనను పట్టించుకునే వాళ్లే అక్కడ లేరని బాధితురాలు ఆరోపించారు. లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి సమీపంలోని ఓ స్టార్ హోటల్‌లో ఈ ఘటన జరిగిందని, గుర్తు తెలియని వ్యక్తి సదరు ఉద్యోగిని బస చేసిన గదిలోకి చొరబడ్డాడని 'ఎయిర్ ఇండియా' ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఘటనపై ఎయిర్ ఇండియా అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులతో విచారణ జరుపుతున్నామని తెలిపారు. బాధితురాలు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల నుంచి ఇతరులు వచ్చి దుండగుడి దాడి నుంచి ఆమెను కాపాడారని, దుండగుడ్ని పట్టుకున్నారని తెలిసింది. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని హోటల్ మేనేజ్‌మెంట్‌ను ఎయిర్ ఇండియా కోరింది.

బస్సు, వ్యాను ఢీ.. 10 మంది మృతి

బులంద్‌షహర్: ఉత్తరప్రదేశ్‌లోని సేలంపూర్ ప్రాంతంలో ఆదివారం ఓ ప్రైవేటు బస్సును ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోగా, 27 మంది గాయపడ్డారు. గాయపడినవారిని వేర్వేరు దవాఖానలకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు. బుదౌన్-మీరట్ రాష్ట్ర హైవేపై ఈ దుర్ఘటన జరిగింది. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని మీరట్ వైద్య కళాశాల, దవాఖానకు తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.

కేసీఆర్ ప్రభుత్వంలా మమత స్పందించాలి

- హైదరాబాద్‌లో దిశ ఘటనలో ఎన్‌కౌంటర్ చేశారు
- బెంగాల్ ప్రభుత్వం కూడా సత్వర న్యాయం చేయాలి
- కోల్‌కతా ఘటనపై ఢిల్లీలో వైద్య విద్యార్థుల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): కోల్‌కతాలో డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచార ఘటనలో మమతా బెనర్జీ ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగా స్పందించి, సత్వర న్యాయం చేయాలని వైద్యవిద్యార్థులు డిమాండ్ చేశారు. మౌమిత ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో భారీ ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు కోల్‌కతా ఘటనను, తెలంగాణలో జరిగిన దిశ ఘటనను పోల్చారు. వెటర్నరీ డాక్టర్(దిశ) హత్యాచార ఘటనపై కేసీఆర్ ప్రభుత్వం వేగంగా స్పందించిందని, నిందితులను ఎన్‌కౌంటర్ చేసిందని గుర్తుచేశారు. ఇదే తరహాలో పశ్చిమ బెంగాల్‌లోని మమత బెనర్జీ ప్రభుత్వం కూడా త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైదరాబాద్ ఘటనను ఉదాహరణగా తీసుకోవాలి. ఆ డాక్టర్ ఘటనలో కేసీఆర్ ప్రభుత్వం పదిరోజుల్లోనే బాధిత కుటుంబానికి న్యాయం చేశారు. ఇదే తరహాలో కోల్‌కతా ఘటనలోనూ న్యాయం జరగాలి' అని సందీప్ అనే వైద్యవిద్యార్థి డిమాండ్ చేశారు. 'దుర్గామాత కొలువై ఉన్న పశ్చిమబెంగాల్‌లో మహిళలపై హత్యాచారాలు జరగడం సిగ్గుచేటు. తెలంగాణలో ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించినవారిని కేసీఆర్ ప్రభుత్వం శిక్షించింది. ఇదే తరహాలో డాక్టర్ మౌమిత కుటుంబానికి న్యాయం చేయాలి. లేదంటే ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం చేస్తాం' అని సుమిత్ హెచ్చరించారు.

ఆఫ్రికా బీళ్లలో ఇక్రిశాట్ పసిడి పంటలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): అధిక ఉష్ణోగ్రతలు, నీటి వనరుల లేమితో వ్యవసాయానికి అత్యంత ప్రతికూల పరిస్థితులు ఉండే ఆఫ్రికా ఖండంలో ఇక్రిశాట్ అద్భుతాలను సృష్టిస్తున్నది. అధునాతన వ్యవసాయ సాంకేతికతను ఉపయోగించి అక్కడి బీడు భూముల్లో పసిడి పంటలు పండిస్తున్నది. తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడినిచ్చే మొక్కజొన్న, బీన్స్, సజ్జ, జొన్న, కంది, పెసర వంగడాలను అందుబాటులోకి తేవడంతోపాటు భూసారం పెంపు, పంట మార్పిడి విధానాలతో రైతుల బలవన్మరణాలను అడ్డుకట్ట వేస్తున్నది. కెన్యా, జింబాబ్వే, సెనెగల్, నైజీరియా దేశాల్లో 1.20 లక్షలకుపైగా రైతు కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి.